RNI.No. APTEL/2014/57702 ESTD: 1999




www.voodayam.com

# వుదయం

గుంటూరు 30-07-2026 గురువారం సంపుటి : 13 | సంచిక : 138 SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY రూ. 3.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily

Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal Postal Regd. No. GTR/117/2025-27 Follow us on




# ప్రత్యామ్నాయ పంటల వైపు రైతుల మొగ్గు



**పేద ప్రజల సమస్యల పరిష్కారమే మా ధ్యేయం**

**బంగాళాఖాతంలో మునిగిపోయిన వాళ్లే హైడ్రాను వేస్తామంటే ఎలా?**

**హైదరాబాద్, జూలై 29 (వుదయం) :**
హైడ్రా (HYDRAA) అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రస్థాయిలో స్పందించారు. రాజకీయంగా కనుమరుగవుతున్న వాళ్లే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తామంటే అర్థం లేదని ఎద్దేవా చేశారు.

గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటలు, ప్రభుత్వ ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై పలు కీలక విషయాలు వెల్లడించారు.

**మంత్రి తుమ్మల ప్రసంగంలోని ముఖ్యాంశాలు:**
ఎల్‌నినో ప్రభావం ప్రత్యామ్నాయ పంటలు: రాష్ట్రంలో వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ ఇప్పటి వరకు 30 శాతం లోటు వర్షపాతం నమోదైందని తుమ్మల తెలిపారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందని, రాబోయే ఆగస్ట్, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లోనూ దీని ప్రభావం ఉండే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో గ్రామగ్రామాన ప్రజలకు, రైతన్నలకు దీనిపై అవగాహన కల్పిస్తున్నామని, రైతులు వరి సాగును తగ్గించి మెట్ట పంటలు, ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగు వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారని చెప్పారు.
ప్రజల నమ్మకానికి ప్రతీక గాంధీభవన్: గాంధీభవన్‌ను ప్రజలు ఒక దేవాలయంగా భావిస్తున్నారని, తమ సమస్యలు ఇక్కడ పరిష్కారమవుతాయనే పూర్తి నమ్మకంతోనే బాధితులు వస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును స్వీకరించి, వెంటనే సంబంధిత శాఖల అధికారులకు పంపి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఏ రాజకీయ పార్టీ కూడా నిర్వహించని విధంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలతో నేరుగా ముఖాముఖి నిర్వహిస్తోందని, పేద, మధ్య తరగతి ప్రజలు తమ కష్టాలు చెప్పుకునేందుకు ఇదే సరైన వేదికగా మారిందని తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

# పాత బీఎస్3 వాహనాల్లో ఈ20 ఇంధన ప్రభావం



**2016కి ముందు తయారైన వాహనాల్లో ఈ20 ఎఫెక్ట్**

**న్యూఢిల్లీ, జూలై 29 (ఎఎంఎస్) :**
దేశవ్యాప్తంగా అమలవుతున్న ఈ20 (20 శాతం ఇంధన ఇథనాల్ మిశ్రమం) పెట్రోల్ వినియోగంపై కేంద్ర ప్రభుత్వం కీలక స్పష్టతనిచ్చింది. 2016కు ముందు తయారైన పాత బీఎస్3 (BS3) వాహనాల్లో ఈ20 పెట్రోల్ వాడటం వల్ల చిన్నపాటి రిపేర్లు వచ్చే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు కొన్ని రబ్బరు భాగాలు, గ్యాస్కెట్లు (Gaskets) మాత్రం మార్చాల్సి రావచ్చని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రాజ్యసభలో ఒక లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. అయితే, ఇది వాహనాల పనితీరు, మన్నిక లేదా మైలేజీపై పెద్దగా ప్రభావం చూపదని స్పష్టం చేశారు. అధ్యయనంలో తేలిన అంశాలు ఇవే: ఐఓసీఎల్ , ఐఐపీడెహ్రాదూన్, సియామ్, ఏఆర్ఏఐ సంస్థలు సంయుక్తంగా ఈ20 ఇంధనంపై విస్తృత స్థాయి అధ్యయనాలు నిర్వహించాయి. ఈ పరీక్షల్లో ఇంధనం వినియోగించే వాహనాల ఇంజిన్‌లలో పెద్దగా ఎలాంటి మార్పులు అవసరం లేదని తేలినట్లు మంత్రి తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ20 విధానాన్ని అమలు చేయడానికి ముందే ప్రయోగశాల పరీక్షలు, ఫీల్డ్ ట్రయల్స్, మన్నిక పరీక్షలను సమగ్రంగా నిర్వహించామని చెప్పారు. అన్ని పరీక్షల్లోనూ సానుకూల ఫలితాలు వచ్చిన తర్వాతే దశలవారీగా దీన్ని అమలులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు.అంతేకాకుండా, 2016కు ముందు తయారైన పాత వాహనాల్లోనూ ఈ20 పెట్రోల్ వాడినప్పుడు ఇంజిన్ అరిగిపోవడం, స్టార్టబిలిటీ, లోహాలు, ప్లాస్టిక్ భాగాల అనుకూలత వంటి అంశాల్లో ఎలాంటి తీవ్రమైన సమస్యలు తలెత్తలేదని నితిన్ గడ్కరీ వివరించారు.

# యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం



**న్యూఢిల్లీ, జూలై 29 (ఎఎంఎస్) :**
దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న పరీక్షల పేపర్ లీకేజీలను అడ్డుకునేందుకు ఉద్దేశించిన కీలక బిల్లుకు పార్లమెంటులో గ్రీన్ సిగ్నల్ లభించింది. 'ది పబ్లిక్ ఎగ్జామినేషన్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్లు' (యాంటీ పేపర్ లీక్ బిల్లు)కు లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది. ఈ చర్చ సందర్భంగా విపక్షాలు పలు సవరణలు కోరినప్పటికీ, అవి వీగిపోయాయి. పేపర్ లీక్‌లకు పాల్పడే అసాంఘిక శక్తులపై అత్యంత కఠిన చర్యలు ఉంటాయని ప్రభుత్వం ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఇందుకు తగినట్లుగానే బిల్లులో కఠిన నిబంధనలు పొందుపరిచినట్లు వెల్లడించింది. అనంతరం సభ గురువారానికి వాయిదా పడింది.

**రాహుల్ గాంధీపై జితేంద్ర సింగ్ తీవ్ర విమర్శలు:**
ఈ బిల్లుపై జరిగిన చర్చలో ఆయా పార్టీల సభ్యులు మాట్లాడిన అనంతరం.. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ సభలో సమాధానమిచ్చారు.

# వందేమాతరం బిల్లు పాస్..

**న్యూఢిల్లీ, జూలై 29 (ఎఎంఎస్) :**
మన జాతీయ గేయం 'వందేమాతరం'కు అత్యున్నత చట్టపరమైన రక్షణ కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేసింది. జాతీయ గేయం వందేమాతరంపై రూపొందించిన ప్రత్యేక బిల్లుకు రాజ్యసభలో ఆమోదం లభించింది. ఈ బిల్లును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ నెల 24న సభలో ప్రవేశపెట్టారు. వందేమాతరాన్ని అవమానించినా, లేదా అది ఆలపిస్తుండగా ఎవరైనా ఆటంకం కలిగించినా దానిని తీవ్రమైన నేరంగా పరిగణించేలా ఈ చట్టాన్ని తీసుకొస్తున్నారు. ఇందులో భాగంగా 'ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్ 1971' చట్టంలో కేంద్రం కీలక సవరణలు ప్రతిపాదించింది. ప్రస్తుతం జాతీయ గీతమైన 'జనగణమన'కు ఏ విధంగా అయితే చట్టపరమైన రక్షణ ఉందో, అదే స్థాయి రక్షణను ఇప్పుడు 'వందేమాతరం' జాతీయ గేయానికీ వర్తింపజేయడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. ఒకవేళ వందేమాతరాన్ని అవమానిస్తే దోషులకు గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష విధించేలా ఈ బిల్లులో కఠిన నిబంధనలు రూపొందించారు. ప్రతిపక్షాల నిరసనలు, వాకౌట్: ఈ బిల్లుపై రాజ్యసభలో చర్చ ప్రారంభం కాగానే ప్రతిపక్ష నేతలు భారీ ఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. ఇటీవల దిల్లీలో విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారని, దీనిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా సభకు వచ్చి వివరణ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

# లోక్‌సభలో రాహుల్ గాంధీ వ్యాఖ్యల కలకలం



- విద్యావ్యవస్థను ఆర్ఎస్ఎస్ నడిపిస్తోంది
- అమిత్ షాపై తీవ్ర ఆరోపణలతో భగ్గుమన్న అధికార పక్షం

**న్యూఢిల్లీ, జూలై 29 (ఎఎంఎస్) :**
లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి, వాడీవేడి వాగ్వాదానికి దారితీశాయి. పబ్లిక్ ఎగ్జామినేషన్స్‌లో అక్రమాల నిరోధక సవరణ బిల్లుపై లోక్‌సభలో బుధవారం జరిగిన చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ చేసిన ప్రసంగం సభలో తీవ్ర గందరగోళాన్ని సృష్టించింది. విద్యార్థుల ఆందోళనలను ప్రస్తావిస్తూ ఆయన కేంద్ర ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్, అలాగే కేంద్ర హోంమంత్రి అమిత్ షాలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

**రాహుల్ ప్రసంగంలోని ప్రధానాంశాలు:**
యువత ఆవేదన: పేపర్ లీక్ ఘటనలతో తీవ్ర వేదనకు గురైన విద్యార్థులు దిల్లీ వేదికగా శాంతియుతంగా నిరసనలు చేపట్టారని, ఆందోళన చేస్తున్న వారిని రెచ్చగొట్టేలా పోలీసులు ప్రవర్తించారని రాహుల్ ఆరోపించారు. ఆందోళనకారులతో తాను మాట్లాడానని, "మూర్ఖులు ఎవరి మాటలు వినరు" అని విద్యార్థులు తనతో ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు.

**విద్యావ్యవస్థపై ఆర్ఎస్ఎస్ ఆధిపత్యం:**
చదువు ప్రస్తుతం అత్యంత ఖరీదైన వ్యాపారంగా మారిందని, విద్యావ్యవస్థ క్రూరంగా తయారైందని రాహుల్ మండిపడ్డారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కేవలం ఒక సింబల్ మాత్రమేనని, అసలు ఈ వ్యవస్థను ఆర్ఎస్ఎస్ నడిపిస్తోందని విమర్శించారు. విశ్వవిద్యాలయాల్లోనూ ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్నవారినే వీసీలుగా నియమిస్తున్నారని ఆరోపించారు.

# పోలీసు కొలువుల జోరు

- 7,437 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ జరగాలంటే ఆయన పదవిలో ఉండొద్దు
- ఫైర్, జైళ్ల శాఖ కొలువుల భర్తీకి రంగం సిద్ధం




**హైదరాబాద్, జూలై 29 (వుదయం) :**
రాష్ట్రంలో నిరుద్యోగులకు ప్రభుత్వం భారీ శుభవార్త అందించింది. తెలంగాణ పోలీసు శాఖలో భారీగా ఉద్యోగాల భర్తీకి రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు నియామక మండలి (TGPRB) ఏకంగా నాలుగు నోటిఫికేషన్లను విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల్లో మొత్తం 7,437 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు అధికారికంగా వెల్లడించింది. పోలీసు శాఖతో పాటు జైళ్లు, అగ్నిమాపక (ఫైర్), స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (SPF) విభాగాల్లోనూ ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. విభాగాల వారీగా ఖాళీల వివరాలు:
కానిస్టేబుల్ (సివిల్): 3,697 పోస్టులు
కానిస్టేబుల్ (ఏఆర్): 1,052 పోస్టులు
స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (SPF): ఎస్సై పోస్టులు 44, కానిస్టేబుల్ పోస్టులు 1,380
అగ్నిమాపక (ఫైర్) శాఖ: స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పోస్టులు 39, ఫైర్ ఫైటర్ పోస్టులు 751
జైళ్ల శాఖ: వివిధ విభాగాల్లో కలిపి మొత్తం 223 పోస్టులు
అర్హులైన అభ్యర్థులు త్వరలోనే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని నియామక మండలి సూచించింది.

# ఆన్‌లైన్ మోసాల్లో నంబర్ వన్ తెలంగాణ!

**హైదరాబాద్, జూలై 29 (వుదయం) :**
దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు మహమ్మారిలా విస్తరిస్తున్నాయి. కేవలం నాలుగేళ్ల వ్యవధిలోనే దేశంలో సైబర్ నేరాల కేసుల సంఖ్య ఏకంగా మూడు రెట్లు పెరిగినట్లు కేంద్ర ప్రభుత్వ అధికారిక గణాంకాలు వెల్లడించాయి. ఆన్‌లైన్ మోసాలకు సంబంధించి రాజ్యసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం.. దేశవ్యాప్తంగా 2020లో కేవలం 10 వేల సైబర్ కేసులు మాత్రమే నమోదు కాగా, 2024 నాటికి ఈ సంఖ్య 29 వేలకు పైగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు, సైబర్ మోసాల కారణంగా బాధితులు కోల్పోయిన మొత్తం లేదా రికవరీకి సంబంధించిన పూర్తి సమాచారాన్ని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (NCRB) ప్రస్తుతానికి పొందుపరచడం లేదని కేంద్రం తెలిపింది. అయితే, ఇటువంటి సాంకేతిక నేరాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఇప్పటికే 'ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్' (I4C)ను ఏర్పాటు చేసి పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

**13 మంది మృతి, వందలాది మందికి ముప్పు!**

# జపాన్‌లో భీకర భూకంపం



**టోక్యో :**
జపాన్‌ను భారీ భూకంపం తీవ్రంగా వణికించింది. మంగళవారం సంభవించిన ఈ భీకర భూకంపం కారణంగా 13 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఆ దేశ ప్రధానమంత్రి సనయీ తకాయిచి వెల్లడించారు. ప్రాణ, ఆస్తి నష్టాన్ని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. భూకంప శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను రంగంలోకి దించినట్లు ఆమె తెలిపారు. భూకంపం తీవ్రతకు కషిమా పట్టణంలో ఒక భారీ షాపింగ్ మాల్ పేకమేడలా కూలిపోయిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ మాల్ శిథిలాల కింద వందలాది మంది చిక్కుకుని ఉంటారని అంచనా వేస్తుండగా, ప్రస్తుతం ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. కేవలం భూకంపం వల్లనే ఈ మాల్ కూలిందా లేక ఇతర కారణాలున్నాయా అనే కోణంలో అధికారులు దర్యాప్తు జరుపుతున్నారు. ఈ ప్రకృతి విపత్తు కారణంగా పలు నగరాల్లో రోడ్లు, వంతెనలు, రైలు పట్టాలు, భారీ భవనాలు ధ్వసమయ్యాయి. ఇప్పటివరకు సుమారు 9 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. క్షతగాత్రులను రక్షించేందుకు దేశవ్యాప్తంగా 3,600 మంది స్వీయరక్షణ దళాల సిబ్బంది సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు.

# రష్యా కొనుగోళ్లపై అమెరికా కన్నెర్ర



**వాషింగ్టన్ :**
ఇంధన ఎగుమతులతో రష్యా ఆర్జిస్తోన్న భారీ ఆదాయానికి కళ్లెం వేసేందుకు అమెరికా మరోసారి కఠిన చర్యలకు సిద్ధమైంది. రష్యా ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటున్న దేశాలపై ఉక్కుపాదం మోపేలా రూపొందించిన సరికొత్త ఆంక్షల బిల్లును పరిశీలించేందుకు అమెరికా సెనెట్ సభ్యులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ బిల్లు కనుక చట్టరూపం దాల్చితే.. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్న భారత్, చైనా వంటి దేశాలపై భారీగా టారిఫ్‌ల ఎఫెక్ట్ పడనుంది. ఈ ఆంక్షల బిల్లు ఆమోద ప్రక్రియలో భాగంగా సెనెట్‌లో నిర్వహించిన ఓటింగ్‌లో 8612 తేడాతో బిల్లును పరిశీలించేందుకు సభ్యులు అంగీకరించారు. అయితే, చట్టంగా మారడానికి ముందు ఈ బిల్లుకు సెనెట్‌తో పాటు ప్రతినిధుల సభ (హౌస్ ఆఫ్ రెప్రజెంటేటివ్స్) కూడా ఆమోదం తెలపాల్సి ఉంది. భారత్‌పై టారిఫ్‌ల ప్రభావం ఎలా ఉండనుంది?
ఈ బిల్లు పూర్తిగా చట్టరూపం దాల్చితే.. రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తున్న దేశాల నుంచి అమెరికా దిగుమతి చేసుకునే వస్తువులపై వంద శాతం (100%) వరకు టారిఫ్‌లు విధించే ప్రత్యేక అధికారాలు అమెరికా అధ్యక్షుడికి లభించనున్నాయి. 2022 నుంచి ఉక్రెయిన్‌రష్యా మధ్య భీకర యుద్ధం కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఉక్రెయిన్‌కు అమెరికా, ఐరోపా దేశాల నుంచి ఎంత సాయం అందుతున్నప్పటికీ.. రష్యా ఆర్థిక వ్యవస్థను మాత్రం దెబ్బతీయలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే రష్యా అధ్యక్షుడు పుతిన్ సర్కార్‌ను ఆర్థికంగా బలహీనపరిచేందుకు అమెరికా ఈ సరికొత్త వ్యూహానికి తెరతీసింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ అమెరికాలో పర్యటించిన నేపథ్యంలో సెనెట్‌లో ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. మరోవైపు, యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి పశ్చిమ దేశాల హెచ్చరికలను లెక్కచేయకుండా భారత్ రష్యా నుంచి భారీగా డిస్కౌంట్ ధరలకే ముడి చమురును దిగుమతి చేసుకుంటున్న సంగతి తెలిసిందే. చైనాతో పాటు మరికొన్ని దేశాలు కూడా రష్యా నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నాయి. ఒకవేళ ఈ ఆంక్షల బిల్లు ఆమోదం పొందితే భారత్‌పై పరోక్షంగా భారీ వాణిజ్య ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రస్తుతానికి అయితే వాణిజ్య ఒప్పందాల్లో ఎలాంటి మార్పులు లేవు.



# ప్రమాదకరంగా రోడ్డు నరకయాతన పడుతున్న ప్రయాణికులు



- గత వర్షా కాలంలో కూడా అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

**నారాయణఖేడ్ జులై 29(వుదయం)**

నారాయణఖేడ్ మండలం కాశీనాథ్ మందిర్ భూమి మూలమలుపు నుండి ఈ తక్షలా పాఠశాల వరకు రోడ్డు అధ్వా నంగా మారడంతో నరకయాతన పడు తున్న ప్రయాణికులు.. ప్రాణాలు పోతే తప్ప అధికారులు స్పందించరా ద్విచక్ర వాహనాల రాకపోకలు నరకంగా ఉందని గత వర్షాకాలంలో కూడా చాలామంది ఆ గుంతలో పడి కాలు చేతులు విరిగిన సందర్భాలు ఉన్నాయి. ఈ వర్షాకాలం అయిన వాటిని బాగు చేసి ప్రమాదాలు జరగ కుండా చూడాలని పలువురు ప్రయాణి కులు కోరుతున్నారు.

# మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు పంపిణీ

- కార్మికులు ఆరోగ్యంగా ఉంటే మున్సిపల్ క్లీన్ అండ్ గ్రీన్ ఉంటుంది
- మున్సిపల్ చైర్మన్ నగేష్ శెట్కర్

**నారాయణఖేడ్ జులై 29 (వుదయం )**

నారాయణఖేడ్ మున్సిపాలిటీలో వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ మున్సిపల్ కార్మికులకు రైన్ కోట్లు పంపిణీ చేశారు. మున్సిపల్ కా ర్మికులు ఆరోగ్యంగా ఉంటే మునిసిపల్ క్లీన్ అండ్ గ్రీన్ ఉంటుందని మున్సిపల్ చైర్మన్ నగేష్ షెట్కర్ అన్నరు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందిస్తూ మున్సిపాలిటీని పరిశుభ్రం గా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడా రు. వర్షాకాలంలో విధులు నిర్వహించే సమయంలో వారికి ఎలాంటి ఇబ్బంది లు తలెత్తకుండా ఉండేందుకు ఈ రెయి న్‌కోట్లను అందజేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రశాంతి,మున్సిపల్ కౌన్సిలర్లు వివేకా నంద మహేందర్, లక్ష్మణ్, బాలాపూరం రాజు,మహేష్, షారుక్, గోపాల్ రెడ్డి, మైటెట్ ,సుబూర్, కోఆప్షన్ సభ్యులు ముంతాజ్, నగేష్, మున్సిపల్ అధికా రులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ ప్రమాదల నివారణ జాగ్రత్తలు పాటించాలి

- జహీరాబాద్ విద్యుత్ శాఖ (డి. ఈ ఈ /ఓపీ)

**కోహీర్ జూలై 29 (వుదయం ప్రతినిధి)**



వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్త పాటించాలి.తడి చేతులతోలేదా కాళ్లతో స్విచ్‌లను, ప్లగ్‌లను.తాకకూడదు. వర్షంలో తడిసిన కరెంట్ స్తంభాలు, స్టే వైర్లను ముట్టుకోకూడదు. ట్రాన్స్‌ఫార్మర్ల సమీపానికి అస్సలు వెళ్ల కూడదు.ఇనుప లేదా జీ.ఐ. (GI) వైర్లపై బట్టలు ఆరేయడం చాలా ప్రమాదకరం. రోడ్లపై తెగిపడిన.కరెంట్ తీగలను ఎట్టి పరిస్థితుల్లోనూ.ముట్టుకోకూడదు.తెగిప డిన తీగలు కనిపిస్తే వెంటనే విద్యుత్ అధి కారులకు సమాచారం ఇవ్వాలి.విద్యుత్ వినియోగదారులు మరియు రైతులు పొలాల్లో జాగ్రత్తగా ఉండాలి.వర్షం. పడే.సమయంలో పిల్లలను విద్యుత్ పరి కరాలకు.దూరంగా ఉంచాలి.ఇంట్లో కరెంట్ షాక్ రాకుండా సరైన ఎర్తింగ్ విధానాన్ని తనిఖీ చేయాలి.ప్రమాద సమ యాల్లో కరెంట్ మెయిన్ స్విచ్ వెంటనే ఆపివేయాలి.ఈ భద్రతా నియమాలను ఇతరులకు తెలియజేసి చైతన్యపరచా లి. విద్యుత్ శాఖ జారీ చేసే.మార్గదర్శ కాలు.తప్పక.పాటించాలి.చిన్నపాటి, నిర్లక్ష్యం కూడా.ప్రాణాలకే.ముప్పు,కావ చ్చు,విద్యుత్,వినియోదారులు మరియు రైతులందరూ జాగ్రత్తలు పాటించి సుర క్షితంగా ఉండాలి,అని జహీరాబాద్. డి. ఈ. ఈ./ఓపి విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలియజేసారు

# విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పై విచారణ జరిపి దోషులను శిక్షించాలి !

- విద్యార్థి నేతిబొట్టు తరుణ్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పై విచారణ జరిపి దోషులను శిక్షించాలి !

**గద్వాల జూలై 29 (వుదయం బ్యూరో)**



గద్వాల ప్రభుత్వ జూనియర్ కళాశా లలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి నేతిబొట్టు తరుణ్ (17) ఆత్మహ త్యకు పాల్పడిన ఘటన తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ఈ విషాద సంఘటనపై సమగ్ర, నిష్పాక్షిక విచారణ జరిపి వాస్త వాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ప్రాథమిక సమాచారం ప్రకారం, ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో 440 మార్కుల కు 434 మార్కులు సాధించి జిల్లాలో రెండో స్థానం పొందిన తరుణ్‌ను, ఎక్కువ మార్కులు సాధించిన మరో వి ద్యార్థితో పోల్చుతూ ఒక మహిళా లెక్చ రర్ తరగతి గదిలో అవమానించారని, దీనిని ప్రశ్నించిన విద్యార్థిని మరింత కించపరిచినట్లు ఆరోపణలు వినిపిస్తు న్నాయి. ఈ సంఘటనల వల్ల తీవ్ర మనో వేదనకు గురైన తరుణ్ ఆత్మహత్యకు పా ల్పడినట్లు, అలాగే తన సూసైడ్ నోట్‌లో తన ఆవేదనను వ్యక్తం చేసినట్లు వార్తలు వెలువడు తున్నాయి. ఈ అంశాలన్నిం టినీ విచారణలో నిష్పాక్షికంగా పరిశీ లించాల్సిన అవసరం ఉంది. ఈ ఘటన ఒక్క కుటుంబానికే కాదు, మొత్తం విద్యా వ్యవస్థకు ఒక హెచ్చరిక. ఉపాధ్యాయు ని పాఠ విద్యార్థిని అవమానించడం కాదు; ప్రోత్సహించడం, అతని వ్యక్తిత్వా న్ని పెంపొందించడం, అతని వ్యక్తిత్వా న్ని వికసింపజేయడం. విద్యార్థులను మార్కులు, ర్యాంకుల ఆధారంగా ఒకరితో ఒకరిని పోల్చడం, బహిరంగం గా కించపరచడం, ఎగతాళి చేయడం వంటి చర్యలు వారి మానసిక ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.మార్కులు విద్యార్థి ప్రతిభలో ఒక భాగాన్ని మాత్రమే సూచిస్తాయి; అతని వ్యక్తిత్వం, విలువను కాదు.ప్రతి విద్యా ర్థికి గౌరవప్రదమైన, భయరహితమైన విద్యా వాతావరణం కల్పించడం విద్యా సంస్థల బాధ్యత. ఉపాధ్యాయులందరికి బాలల మనస్తత్వం, సానుకూల బోధనా పద్ధతులు, భావోద్వేగ భద్రతపై నిరంతర శిక్షణ అవసరం. మా డిమాండ్లు:

* ఈ ఘటనపై ఉన్నతస్థాయి, నిష్పాక్షిక విచారణ జరపాలి.
* వాస్తవాలు వెలుగులోకి వచ్చిన తర్వాత బాధ్యులపై చట్టపరమైన, శాఖా పరమైన చర్యలు తీసుకోవాలి.
* ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలన్నిం టిలో విద్యార్థులను అవమానించడం, బహిరంగంగా కించపరచడం వంటి చర్యలపై స్పష్టమైన మార్గదర్శకాలు రూ పొందించాలి.
* ప్రతి జూనియర్ కళాశాల, పాఠశా లలో విద్యార్థులకు మానసిక ఆరోగ్య సహాయం, కౌన్సెలింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలి.
* విద్యార్థుల గౌరవం, ఆత్మవిశ్వాసం, మానసిక ఆరోగ్యాన్ని కాపాడే విధానా లను ప్రభుత్వం అత్యవసరంగా అమలు చేయాలి.

ఒక విద్యార్థి ప్రాణాన్ని తిరిగి తీసుకురాలేము. కానీ ఇటువంటి విషాదాలు మళ్లీ జరగకుండా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావడం మనందరి బాధ్యత. ప్రతి తరగతి గది పిల్లల ఆత్మగౌరవాన్ని కాపాడే సురక్షిత మైన స్థలంగా మారాలి.

# దౌల్తాబాద్‌లో గురుపౌర్ణమి వేడుకలు



ర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ దత్తా త్రేయ స్వామివారికి పూజారి వెంకట లక్ష్మయ్య ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయా నికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాల ను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పసు పునూరి పద్మ, మురికి పద్మ, ధనలక్ష్మి (ధనక్క), ప్రభాకర్, ఆది బాల్ రెడ్డి, శ్రీరామ్-రామచంద్రం దంపతులు సీనియర్ జర్నలిస్టు శంభు లింగం తది తరులు పాల్గొన్నారు.

# మంత్రినీ మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు



**వుదయం, న్యూస్ శివ్వంపేట జులై 29:**

మెదక్ జిల్లా శివ్వంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుదర్శన్ గౌడ్ నేడు హైదరాబాద్లోని మినిస్టర్ కోర్టాసుల్లో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సిమను మర్యాదపూ ర్వకంగా కలవడం జరిగింది. మినిస్టర్ ని సుదర్శన్ గౌడ్ శివ్వంపేట మండల కేంద్రంలో 30 పడకాల ప్రభుత్వాసుప త్రి. 24 గంటలు సర్వీస్. ఒక అంబులె న్స్ మంజూరు చేయాల్సిందిగా ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సిమను కోరడం జరిగిందని. మంత్రి సానుకూ లంగా స్పందించడంతో వారికి మండల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కా ర్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కందికొండ అశోక్. మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు మొహమ్మద్ ఖాన్. తది తరులు పాల్గొన్నారు.

# ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

- భక్తులతో కిటకిటలాడిన శ్రీ గురు పీఠం....
- దత్తాత్రేయునికి అభిషేకం చేసిన వేద పండితులు

**వుదయం, న్యూస్ శివ్వంపేట జులై 29:**

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరి ధిలోని గూడూరు గ్రామంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో నేడు గురు పౌర్ణమి వేడుకలు శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఫౌండర్ శివకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను వేద పండితులు మహర్షి గురువులు శాస్త్రుల వామన శర్మ ఆధ్వ ర్యంలో శ్రీ దత్తాత్రేయ మహాస్వామికి అభిషేకం . హవనం. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల కు నర్సాపూర్ శాసన సభ్యురాలు సునీత లక్ష్మారెడ్డి. మెదక్ జిల్లా గ్రంథాలయ చైర్ పర్సన్ సువాసిని రెడ్డి లు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నర్సాపూర్ శాసనసభ్యురాలు సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ. గురువు సూపే మార్గమే మనిషిని అజ్ఞానం దకారం నుంచి జ్ఞాన వెలుగులోకి నడిపిస్తుందని అన్నారు. గురువు బోధలను ఆచరణలో పెట్టిన వారే నిజమైన శిష్యులని పేర్కొం టారు. ఆమె వివరించారు. అనంతరం సనాతన ధర్మం గురించి శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ. సనాతన ధర్మం వ్యక్తి యొక్క ఆధ్యాత్మిక స్వరూపమైన ఆత్మ , ఆధారంగా నిర్వర్తించాల్సిన కర్తవ్యాలు. ఇవి అందరికీ సమానంగా వర్తిస్తాయి. సత్య వచనం. ప్రాణులకు హాని చేయక పోవడం. పవిత్రత సస్తంకల్పం . దయ. క్షమా. తపస్సు వంటి సద్గుణాలు ఈ ధర్మంలో భాగాలుగా పరిగణించబడ తాయని వారు వివరించారు. అనంతరం వేద పండితులు శాస్త్రుల వామన శర్మ మాట్లాడుతూ. సనాతన ధర్మం హిందు వులకి సంబంధించిందా భారతీయులకు సంబంధించిన లేదా ఇంకొకరికి సంబం ధించిందా? అది కాదు అసలు విషయం. మీరు ఎక్కడున్నా మీరు భారతీయులైన హిందువులైన వేరే మతస్తులైన . మీరు ఇంకేదైనా సనాతన ధర్మం అందరికీ వర్తిస్తుంది ఎందుకంటే ఈ నియమాలు మన ప్రాథమిక జీవన ప్రక్రియకు మార్గ దర్శకాలు. ఏ సంస్కృతి కూడా దీని వైపు మనం చూపినంత లోతుగా చూడలేదు అందుకే మనం గొప్పగా. ఇది హిందూ సనాతన ధర్మం అని అంటూ ఉంటారు. కానీ మనం ఈరోజున హిందూ అనే పదం వాడి సనాతన ధర్మం యొక్క సంస్కృతి తగ్గిస్తున్నాం హిందూ అనబ డేది భౌగోళిక గుర్తింపు. హిందూ మహా సముద్రానికి హిమాలయానికి మధ్య ఉన్న భూభాగమే హిందూ. సనాతన ధర్మం ప్రతి జీవికి వర్తిస్తుంది. సనాతన ధర్మం జీవితంలో వివిధ అంశాలను పు ట్టబోయే వారిని పుట్టిన వారిని ఎదిగిన వారిని జీవితంలో వివిధ దశల్ని చివరికి చనిపోయిన తర్వాత కూడా ఎలా నిర్వ హించుకోవాలో తెలుపుతుంది. జీవితా న్ని లోతుగా చూసే విధానం ఇది అని వారు వివరించారు. ఈ కార్యక్రమం లో ప్రముఖ సంఘ సేవకులు బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు పబ్బ స్వరూప రమేష్ గుప్తా. బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్. మహేందర్ రెడ్డి. నాయక్. మాజీ సర్పంచి బాబురావు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుదర్శన్ గౌడ్. ట్రస్ట్ సభ్యులు సూర్య కుమార్ గౌడ్. స్వరాజ్యలక్ష్మి శ్రీనివాస్ గౌడ్. రాజ్యం బి క్షపతి యాదవ్. గంగాధర్. సర్పంచులు ప్రవీణ్ గౌడ్. నారాయణరావు. బ్యాగరి నర్సయ్య. వెంకటేష్. మాజీ సర్పంచు లు. మాజీ ఎంపీటీసీలు. యాదగిరిరా వు. నరేందర్. దమ్మెగూడ కార్పొరేటర్ సురేఖ. దమ్మెగూడ మాజీ ఎంపీపీ స్వప్న వెంకటరెడ్డి. శ్రీనివాస్ గౌడ్. సత్యనారా యణ గౌడ్. కొడకంచి శ్రీనివాస్ గౌడ్. నర్సింగరావు. మురళి. పండితులు శా స్త్రుల నటరాజ్ శర్మ. శాస్త్రుల హాస్య శర్మ. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య





- పౌష్టికాహారం పై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- నూతన తహసీల్దార్ కార్యాలయానికి స్థల పరిశీలన
- జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**తాడూర్, జులై 29 (వుదయం ప్రతినిధి) :**

జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ బుధవారం మండలం లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ తనిఖీ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథ మిక పాఠశాల, అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. విద్యా ర్థుల అభ్యాస సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారం, హాజరు, మౌలిక వసతులను పరిశీలించారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలని ఉపాధ్యా యులు, అంగన్వాడి సిబ్బందిని ఆదే శించారు. సులభమైన బోధన, ఆంగ్ల మాధ్యమ ప్రోత్సాహం, వంటశాల పరిశుభ్రత, ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విద్యా ర్థుల నమోదు పెంచాలని, పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి పర్యవే క్షించాలని తెలిపారు.నూతన తహసీల్దా ర్ కార్యాలయ స్థల పరిశీలన తాడూర్ మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి సర్వే నెం.644లోని ఒక ఎకరం ప్రభుత్వ భూమిని పరిశీలించా రు. నిర్మాణ ప్రతిపాదనలను వెంటనే ఉన్నతాధికారులకు పంపాలని ఆదే శించారు.ఎస్ఐఆర్ ప్రక్రియ, ఇంది రమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని కూడా సమీక్షించి నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేయాలని సూచించారు.ఈ కా ర్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హలధారికి జలహారతి!

- తీరిన రైతన్న సాగునీటి ఆరటం.. కాలువల్లో ఉరకలేస్తున్న నెట్టెంపాడు జలాలు
- గుడ్డెందొడ్డి, ర్యాలంపాడు నుంచి నీటి విడుదల
- పంట మార్పిడే ధ్యేయం.. ఆరుతడితోనే పండగ
- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పిలుపు

**ధరూర్, జూలై 29 (వుదయం బ్యూరో):**



రైతు సంక్షేమమే ప్రభుత్వ శ్వాస.. నాటిన ప్రతి పైరుకు, సాగులో ఉన్న ప్రతి ఎకరాకు సాగునీరందించడమే సర్కారు పరమావ ధి" అని గద్వాల శాసనసభ్యులు బండ్ల కృ ష్ణమోహన్‌రెడ్డి పునరుద్ఘాటించారు. సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ, జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని గుడ్డెందొడ్డి వద్ద నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ఫేజ్-1 పంప్‌హౌస్‌తో పాటు ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి ఆయ కట్టుకు సాగునీటిని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. పంప్‌హౌస్ స్విచ్ ఆన్ చేసి పవిత్ర కృష్ణమ్మ జలాలను కా లువల్లోకి ప్రవహింపజేసిన అనంతరం జలకన్య గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులర్పించారు.ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. "విడుదల చేసిన నీటిని కాలువల ద్వారా చెరువులు, కుంటలకు నింపి, ఆయకట్టు చివరి పాము వరకు వేగంగా చేరవేసేందుకు నీటిపారు దల శాఖ ప్రణాళికాబద్ధంగా అడుగులేస్తోం ది. రైతుకు సాగునీటి కష్టాలు రాకుండా నిరంతరం సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావులకు అలంపూర్, గద్వాల ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవా దాలు తెలుపుతున్నాం" అని పేర్కొన్నారు. గురు పౌర్ణమి శుభసందర్భంగా నియో జకవర్గ ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలియజేశారు.

**వరి వద్దు.. ఆరుతడే ముద్దు!**

ప్రస్తుత సాగు కాలంలో ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షపాతం తగ్గే ముప్పు ఉందన్న వా తావరణ నిపుణుల హెచ్చరికల నేపథ్యం లో రైతులు విచక్షణతో వ్యవహరించాలని ఎమ్మెల్యే హితవు పలికారు. "నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలి. అధిక నీరు తాగే వరి సాగును తగ్గించి, తక్కువ నీటితో పూర్తయ్యే కంది, పెసర, మినుము, శనగ, జొన్న, సజ్జ, మొక్కజొన్న, వేరుశెనగ, నువ్వులు వంటి ఆరుతడి పంటల వైపు మళ్లాలి. ఉద్యాన పంటలు, కూరగాయల సాగు చేపడితేనే ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని ఆర్థికంగా నిలదొక్కుకోగలరు" అని విస్పష్టంగా స్పష్టం చేశారు.చుక్క నీరు వృథా కాదు.. భవిష్యత్తుకు భరోసా! సాగునీటి వనరుల సంరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత. చెరువులు, కుంటలను పరిరక్షించుకుంటూ వర్షపు నీటిని భద్రపరుచుకోవాలి. గ్రామీణ ప్రాం తాల్లో పశువులకు తాగునీరు, పశుగ్రా సం కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి గ్రామంలోనూ పెద్ద ఎత్తున మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, నీటిపారుదల శాఖ ఇంజినీర్లు, స్థానిక నాయకులు మరియు పరిసర గ్రామాల రైతన్నలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గురు పూజ మన జీవితానికి సరైన దారి

- గురు పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**నారాయణఖేడ్ జులై 29 (వుదయం)**



గురు పూజ మన జీవితానికి సరైన దారి చూపిస్తుందని అందుకు గురు పూజ చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పి సంజీవ రెడ్డి అన్నరు.
నారాయణఖేడ్ మండల పరిధిలోని పంచగామ గ్రామంలో వెలసియున్న ప్రసిద్ధ పంచవటి పుణ్యక్షేత్రంలో గురు పౌర్ణమి మహోత్సవాన్ని పురస్కరిం చుకుని బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా ని ర్వహించారు. ఈ సందర్భంగా నారా యణఖేడ్ శాసనసభ్యులు ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహిం చారు.అనంతరం పంచవటి పుణ్యక్షేత్ర ఆలయ పీఠాధిపతి కాశీనాథ్ బాబా ని దర్శించుకుని పండ్లు శాలువాతో,పూల మాలతో సత్కరించి, వారి పవిత్ర ఆశీ ర్వాదాలు తీసుకున్నారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గురు పూజ మన జీవితానికి సరైన దారిని చూపుతుందని అన్నరు. గురువు అంటే అర్థం గు అంటే అంధకారం, లేదా చీకటి అని అర్థం, రు అనగా దానిని పోగొట్టే వెలుగు అని అర్థం అన్నారు. గురువుకు కృతజ్ఞత భావం మనకు విద్యా బుధులు, మంచి నడవ డిక నేర్పిన గురువులను పాదాభివంద నాలు చేసి కృతతలు తెలుపడానికి ఈ గురు పౌర్ణమి వేదిక
అని అన్నారు.భారతీయ సంస్కృతి, సంప్రదాయాలలో గురువు స్థానం అత్యున్నతమైనది. అజ్ఞానమనే చీకట్ల ను తొలగించి, జ్ఞానమనే వెలుగును ప్రసాదించే గురువులను స్మరించుకో వడం మనందరి బాధ్యత అన్నారు.
ఆధ్యాత్మిక చింతన మానసిక ప్రశాంత తను ఇవ్వడమే కాకుండా, సమాజంలో సద్భావనను పెంపొందిస్తుందన్నారు. ఆధ్యాత్మికంగా ఎంతో ప్రసిద్ధి చెందిన పంచవటి పుణ్యక్షేత్రం మరింత అభివృ ద్ధి చెందడానికి నా వంతు కృషి ఎల్లప్పు డూ ఉంటుంది. కాశీనాథ్ బాబా దివ్య ఆశీస్సులతో నారాయణఖేడ్ నియోజ కవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యా లతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ఈ ప్రాంతం సుభిక్షంగా ఉండాలని భగవంతుడిని వేడుకుంటున్నారు.
ఈ కార్యక్రమంలో వినోద్ పాటిల్ హైదరాబాద్ యూత్ కాంగ్రెస్ పార్ల మెంట్ మాజీ అధ్యక్షుడు, అశోక్ రెడ్డి పి ఏ సి ఎస్ చైర్మన్, గోపాల్ రెడ్డి,స్థా నిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు భక్తులు పాల్గొన్నారు.

# బ్రాండ్ బలంరాజోలిలో జీఐ శిబిరం

- జీఐతో గద్వాల చీరల విలువ పెంపు..
- 30న అవగాహన శిబిరం"

**గద్వాల, జూలై 29 (వుదయం కరస్పాండెంట్)**

గద్వాల చేనేత చీరలకు భౌగోళిక సూచిక (జీఐ) గుర్తింపును మరింత సమర్థంగా వి నియోగించుకునేలా చేనేత కార్మికులకు అవగాహన కల్పించేందుకు నేషనల్ హ్యాండ్‌లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరే షన్ (ఎన్‌హెచ్‌డీసీ) ప్రత్యేక కార్యక్రమా న్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 30వ తేదీన రాజోలిలో జీఐ అథరైజ్డ్ యూజర్ అవగాహన శిబిరం నిర్వహించనున్నట్లు ఎన్‌హెచ్‌డీసీ ప్రాంతీయ ఇన్‌చార్జి బి.ఎస్. గణేశా తెలిపారు. భారత ప్రభుత్వ వస్త్ర మంత్రి త్వ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న ఈ కార్యక్రమం గురువారం ఉదయం 10.30 గంటలకు రాజోలిలోని శ్రీ మాత అంబా భవాని భవన్‌లో (మాత అంబా భవాని ఆలయానికి ఎదురుగా) జరుగుతుందని ఆయన వెల్లడించారు. అలాగే నాణ్యమైన నూలు సరఫరా, సహజ రంగుల యూనిట్ల ఏర్పాటు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఆధునిక డిజైన్ల పరిచయం వంటి ఎన్‌హెచ్‌డీసీ చేపడు తున్న కార్యక్రమాలను కూడా వివరించ నున్నారు.జోగులాంబ గద్వాల జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల నేతన్నలు, చేనేత సంఘాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని బి.ఎస్. గణేశా విజ్ఞప్తి చేశారు. కార్యక్ర మానికి సంబంధించిన వివరాల కోసం 99642 24840 నంబర్‌ను సంప్రదిం చాలని సూచించారు.

# పరుపు బండానే సాగు భూమిగా మారుస్తుండు

**వుదయం న్యూస్, శివ్వంపేట జులై 28:**



మెదక్ జిల్లా శివ్వంపేట మండలం పరి ధిలోని దొంతి గ్రామ శివారు లో ఉన్న సిమ్మ సముద్రం చెరువు కట్టను చీల్చి పరుపు బండపై పోస్తూ దానిని సాగు భూమిగా మారుస్తున్న వైనం ఒకటి బయటకు వచ్చింది. వివరాల లోకి వెళ్తే శివ్వంపేట మండలం దొంతి గ్రామ శివారు ప్రాంతం 136 సర్వే నంబర్ లో గ్రామానికి చెందిన కుంట వెంకటేష్ ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా సిమ్మ సముద్రం కట్టాను చీల్చి, డోజర్, జేసిబీ లా సహాయం లో అక్కడ రెండు ఎకరాలల్లో విస్తరించి ఉన్న పరుపు బండ పై మట్టి పోసి దానిని కబ్జా చేసి సాగు భూమి గా మర్చివేస్తున్నాడని రైతులు చింతల సత్తయ్య, చింతల బాబు, గంట శ్యామ్, గంట శ్రీకాంత్ లు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వందలాది ఎకరాల వేణుగోపాల స్వామి దేవస్థానం భూమిని గ్రామానికి చెందిన చాలామంది రైతులం ఖాస్తులో ఉండీ సాగు చేసుకుంటూ జీవనం గడుపుతు న్నామని రైతులు తెలిపారు. ఆ పరుపు బండపై సుమారు 20 మంది రైతులం 10 లారీల వడ్లు ధాన్యాన్ని ఆరబెట్టు కునే వారమని తెలిపారు. ఆ బండపై మట్టి పోసి సాగు భూమిగా తీర్చిదిద్దడం వలన ఎంతోమంది రైతులు ఇబ్బందు లకు గురవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకరి వద్ద 30 గుంటలు కొనుగోలు చేసిన వెంకటేష్ తనకు 4 ఎకరాల భూమి ఉన్నదని గ్రామంలో అసత్య ప్రచారం చేస్తూ, బండరాల భూమిని మొత్తం అక్రమంగా ఆక్రమిం చుకుంటున్నాడని రైతులు వాపోయారు. ఇప్పటికైనా ఈ విషయంపై జిల్లా కలెక్ట ర్ అలాగే ఉన్నతాధికారులు స్పందించి అక్రమ భూ కబ్జాను అడ్డుకొని మాకు న్యాయం చేయగలరని ఆశిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామ రైతులు తదితరులు ఉన్నారు.

# చదువుల గుడిపై.. చేతబడి నీడలు!

- గద్వాల హైస్కూల్ వద్ద అర్ధరాత్రి భయంకర పర్వం!
- బడి ముంగిట వికృత పూజలు.. ఊరు ఊరంతా తీవ్ర దిగ్భ్రాంతి!

**గద్వాల, జూలై 29 (వుదయం బ్యూరో):**



సరస్వతీ నిలయాన్ని బలిపీఠం చేయాలని చూశారా? అక్షరాలు దిద్దే చోట అంధకార శక్తిల ఆటలు సాగించాలని చూశారా? జోగులాంబ గద్వాల రాఘవేంద్ర కాలనీ ప్రభుత్వ స్కూల్ వద్ద బుధవారం ఉదయం వెలుగుచూసిన దృశ్యాలు ప్రతీ ఒక్కరినీ దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. పాఠశాల గుమ్మం ముందే ముగ్గులు, నిమ్మకాయల తో చేసిన వికృత పూజల గుర్తులు భయానక వాతావరణాన్ని సృష్టించాయి. ఎవరి కుట్ర ఇది? పౌర్ణమి నాడే ఈ వికృత యత్నం జరగడం పలు తీవ్రమైన సందేహాలకు తావి స్తోంది. విద్యావ్యవస్థపై, పసిపిల్లల మనస్సు లపై భయాన్ని నూరిపోసేందుకు ఎవరైనా దుండగులు వేసిన ప్లానా ఇది? ఉదయాన్నే పాఠశాలకు వచ్చిన చిన్నారులు, వారి తల్లి దండ్రులు ఈ భయంకర దృశ్యాన్ని చూసి భయంతో హడలెత్తిపోయారు. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించకుండా తక్షణమే స్పందించి, ఈ అనాగరిక చేష్టల కు ఒడిగట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకో వాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# శివాచార్య మహాస్వామిని ఆశీస్సులు తీసుకున్న వీరశైవ లింగాయత్ సమాజం నాయకులు

**సంగారెడ్డి వుదయం**

వీరశైవ లింగాయత్ సమాజం సంగా రెడ్డి జిల్లా అధ్యక్షులు ఇప్పపల్లి నరసిం హులు కోటిలింగేశ్వర క్షేత్రం, జంగామ య్యగుట్ట తంగడపల్లిలో శ్రీ శివయోగి శివాచార్య మహాస్వామిని కలిసి ఆశీ స్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా మహాస్వామి వారికి సమాజ అభివృద్ధి, ఐక్యత, ఆధ్యాత్మిక కార్యక్రమాలపై ది శానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో అందోల్ తాలూకా అధ్యక్షులు పట్లోళ్ల అశోక్, సంగారెడ్డి తాలూకా ప్రధాన కార్యదర్శి పట్టాల శివకుమార్, సదాశి వపేట మండల అధ్యక్షులు పట్ల నాగేష్, మహేష్ స్వామి, మడివాల స్వామి, అల్లూరి విశ్వనాథం, నరేందర్, సంగ మేశ్వర్, మహిళా అధ్యక్షురాలు పట్ల అరుణ, రాణి, వసంత పాల్గొన్నారు.





# గ్రేటర్ హైదరాబాద్



## త్రాగునీటి ఇబ్బందికి శాశ్వత పరిష్కారం



**ఆమీన్ పూర్ జులై 29, (వుదయం ),**

సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ పరిధి పటేల్ గూడ శ్రీ రాజా రాజేశ్వరి ఎన్‌క్లేవ్ ఫేజ్ II కాలనీ వాసుల చిరకాల వాంఛ నెరవేరింది. గత అనేక సంవత్సరాలుగా వేధిస్తున్న తాగునీటి కొరత ఎట్టకేలకు శాశ్వతంగా పరిష్కారం దొరికింది. కాలనీలో తాగునీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను స్థానికులు ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల ఇబ్బందిని స్వయంగా అర్థం చేసుకున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి క్షణం కూడా ఆలస్యం చేయకుండా స్పందించారు. ఈ క్రమంలో గురువారం రామచంద్రపురంలోని ఎమ్మెల్సీ నివాసంలో సంబంధిత అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై, కాలనీలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా, కాలనీలో నూతన తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు నిమిత్తం ప్రభుత్వం తరపున రూ. 28 లక్షలు మంజూరు చేయించి తన నిబద్ధతను చాటుకున్నారు. ఎమ్మెల్సీ ప్రత్యేక చొరవ, పట్టుదల కారణంగా తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారం లభించడం పట్ల కాలనీ వాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ మేరకు కాలనివాసులు తమ ప్రాంత సమస్యను స్పందించి పరిష్కరించిన ఎమ్మెల్సీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఎల్‌నినో: ఆరుతడి పంటలే మేలు



**గుమ్మడిదల, జూలై 29 (వుదయం) :**

గుమ్మడిదల మండలంలోని వివిధ పంటలను జిల్లా వ్యవసాయ అధికారి కె. శివప్రసాద్ పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కంది, మొక్కజొన్న, జొన్న, కూరగాయలు, సోయాబీన్, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు వంటి ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.భవిష్యత్తులో ఎల్‌నినో ప్రభావం కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోయే అవకాశం ఉన్నందున అధిక నీటి అవసరం ఉండే వరి, చెరకు వంటి పంటల సాగును తగ్గించాలని రైతులకు సూచించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ వానాకాలంలో కంది, మొక్కజొన్న, కూరగాయల సాగు విస్తీర్ణం పెరగడం పట్ల రైతులను అభినందించారు. ప్రస్తుతం గుమ్మడిదల మండలంలో సుమారు 700 ఎకరాల్లో కంది, 1,200 ఎకరాల్లో మొక్కజొన్న, 300 ఎకరాల్లో కూరగాయలు, 1,500 ఎకరాల్లో వరి సాగులో ఉన్నట్లు తెలిపారు. పంటలకు అవసరమైన యూరియా, కాంప్లెక్స్ ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) డి. శ్రీనివాసరావు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) ఎం. సుమిత, కె. వందనతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## సేవే నిజమైన గురుదక్షిణ



**షాద్‌నగర్ జూలై 29 (వుదయం) :**

గురు పౌర్ణమి సందర్భంగా షాద్‌నగర్ షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి

వేదవ్యాస మహర్షి, గురుపరంపరను స్మరించుకుంటూ, ఆమె మాట్లాడుతూ, గురు పౌర్ణమి భారతీయ సంస్కృతిలో గురువుల పట్ల కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేసే అత్యంత పవిత్రమైన పర్వదినమని అన్నారు. జ్ఞానాన్ని అందించి దోహదపడే గురువుల సేవలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ గురువులను గౌరవిస్తూ వారు చూపిన సన్మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు.సద్గురు సాయిబాబా బోధించిన 'శ్రద్ధా - సబూరి' సూత్రాలు ప్రతి ఒక్కరి జీవితానికి మార్గదర్శకాలని పేర్కొంటూ, ప్రేమ, సేవ, త్యాగం, మానవత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు.

## ఘనంగా మా విలేజ్ రెస్టారెంట్



**శంకర్‌పల్లి, జులై 29 (వుదయం)**

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'మా విలేజ్ రెస్టారెంట్' ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ హోంశాఖ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి రెస్టారెంట్‌ను ప్రారంభించారు. అనంతరం రెస్టారెంట్‌లోని ఏర్పాట్లను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. శంకర్‌పల్లి పట్టణంలో నాణ్యమైన ఆహార సేవలను అందించే లక్ష్యంతో ఈ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. స్థానిక ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఈ సంస్థ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రెస్టారెంట్ యాజమాన్యానికి ఆమె ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించే విధంగా సేవలు అందించాలని సూచించారు.ఈ సందర్భంగా మాట్లాడిన సబితా ఇంద్రారెడ్డి, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో కొత్త వ్యాపార సంస్థలు ఏర్పడడం స్థానిక ఆర్థికాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని అన్నారు. నాణ్యత, పరిశుభ్రత, వినియోగదారుల సంతృప్తిని ప్రధాన లక్ష్యంగా తీసుకొని సేవలు అందిస్తే ప్రజల ఆదరణ మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడం వల్ల యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయగలరని ఆమె అభిప్రాయపడ్డారు. వ్యాపార రంగంలో కొత్త ఆలోచనలతో ముందుకు వస్తున్న యువ పారిశ్రామికవేత్తలను ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని తెలిపారు. ప్రజలకు ఆరోగ్యకరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించడం ద్వారా ఈ రెస్టారెంట్ ప్రత్యేక గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు, వ్యాపారవేత్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో కొనసాగగా, రెస్టారెంట్ యాజమాన్యం ముఖ్య అతిథి సబితా ఇంద్రారెడ్డితో పాటు హాజరైన ప్రముఖులను ఘనంగా సన్మానించింది. అనంతరం అతిథులు రెస్టారెంట్‌లోని సదుపాయాలను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. శంకర్‌పల్లి ప్రజలకు నాణ్యమైన ఆహార సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమని స్థానికులు అభిప్రాయపడుతూ రెస్టారెంట్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతంగా ముగియగా, ప్రారంభోత్సవం స్థానికంగా విశేష ఆకర్షణగా నిలిచింది.

## గురుపూర్ణిమ వేళ శంకరపల్లిలో పూజలు

**.11వ శతాబ్దపు శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో భక్తిశ్రద్ధలతో అభిషేకాలు**

**.అధికారులకు స్వామివారి శేష వస్త్రాలతో సత్కారం – తీర్థప్రసాదాల పంపిణీ**



**శంకర్‌పల్లి, జులై 29 (వుదయం)**

గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో వెలసిన చారిత్రాత్మక 11వ శతాబ్దానికి చెందిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో భక్తి శ్రద్ధల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌పల్లి మండల డిప్యూటీ తహసిల్దార్ బాలకృష్ణారెడ్డి దంపతులు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాంగణం శివనామస్మరణలతో మారుమోగగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించగా, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.అదే కార్యక్రమంలో శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్సైలు సురేష్, మంజుల, హెడ్ కానిస్టేబుల్ మహాదేవ్ కూడా కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, సమాజంలో శాంతి, భద్రతలు నెలకొనాలని వారు స్వామివారిని ప్రార్థించారు. గురుపౌర్ణమి రోజున శివదర్శనం చేసుకోవడం అత్యంత పుణ్యప్రదమని పేర్కొంటూ ఆలయ విశిష్టతను కొనియాడారు. ఆలయ చరిత్ర, మరకత లింగం మహిమ గురించి అర్చకులు వారికి వివరించారు.పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ చైర్మన్ కడకంచి కుమార్ యాదవ్ డిప్యూటీ తహసిల్దార్ బాలకృష్ణారెడ్డి దంపతులతో పాటు ఎస్సైలు సురేష్, మంజుల, హెడ్ కానిస్టేబుల్ మహాదేవ్‌లను స్వామివారి శేష వస్త్రాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం తీర్థప్రసాదాలను అందించి, స్వామివారి పవిత్ర చిత్రపటాలను జ్ఞాపికగా బహుకరించారు. ఆలయానికి విచ్చేసిన అతిథులు ఆలయ అభివృద్ధికి కమిటీ చేస్తున్న కృషిని అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, గ్రామ పెద్దలు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గురుపౌర్ణమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వైభవంతో కొనసాగగా ఆలయ ప్రాంగణం శివభక్తులతో కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు, రుద్రపారాయణాలు, మహామంగళహారతులు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయం చారిత్రక, ఆధ్యాత్మిక విశిష్టతను మరోసారి చాటిచెప్పే విధంగా ఈ గురుపౌర్ణమి వేడుకలు ఘన విజయవంతమయ్యాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## పొద్దుటూరులో పరిశుభ్రతకు పెద్దపీట



**శంకర్‌పల్లి, జులై 29 (వుదయం)**

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని పొద్దుటూరు గ్రామంలో పరిశుభ్రతకు మరింత ప్రాధాన్యత కల్పించే దిశగా గ్రామ పంచాయతీ కీలక ముందడుగు వేసింది. గ్రామ పంచాయతీ నిధులతో కొనుగోలు చేసిన నూతన ట్రాక్టర్‌ను గ్రామ సర్పంచ్ బండ లక్ష్మి నర్సింహ ఘనంగా ప్రారంభించారు. గ్రామంలో రోజురోజుకు పెరుగుతున్న పారిశుద్ధ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని చెత్త సేకరణ, మురుగు నిర్వహణ, రహదారుల పరిశుభ్రత పనులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ ట్రాక్టర్ ఎంతో ఉపయోగపడుతుందని ఆమె తెలిపారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ బండ లక్ష్మి నర్సింహ మాట్లాడుతూ, ప్రజల నుంచి వసూలు చేసే ప్రతి రూపాయి ప్రజల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలనే సంకల్పంతో గ్రామాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. పరిశుభ్రమైన గ్రామమే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని పేర్కొంటూ, ప్రతి కుటుంబం గ్రామ పరిశుభ్రతలో భాగస్వాములు కావాలనిపిలుపునిచ్చారు.గ్రామంలోని ప్రతి వీధి శుభ్రంగా ఉండేలా పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆధునిక వనరులను అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. ప్రజల సహకారంతో పొద్దుటూరును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.నూతన ట్రాక్టర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోలారం వెంకట్ రెడ్డి, ఉపసర్పంచ్ కవేలి గోవర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ కె. శ్రీనివాస్, మాజీ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఏనుగు నారసింహ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సురకంటి మల్లారెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొని గ్రామాభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించేందుకు గ్రామ పంచాయతీ చేస్తున్న కృషి ప్రశంసనీయమని వారు పేర్కొన్నారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ గ్రామ పంచాయతీ ముందుకు సాగుతుండటం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. నూతన ట్రాక్టర్ అందుబాటులోకి రావడంతో చెత్త సేకరణ వేగవంతం కావడంతో పాటు గ్రామంలోని అన్ని కాలనీల్లో పారిశుద్ధ్య నిర్వహణ మరింత సమర్థవంతంగా జరుగుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పొద్దుటూరును అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా నిలిపేందుకు గ్రామ పంచాయతీ కట్టుబడి ఉందని సర్పంచ్ బండ లక్ష్మి నర్సింహ తెలిపారు.

## 12వ వార్డులో భూగర్భ కాలువ పనులు ప్రారంభం



**శంకర్‌పల్లి, జులై 29 (వుదయం)**

శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సౌకర్యాలు అందించేందుకు రూ.5.8 లక్షల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ మురుగు నీటి కాలువ నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ శంకుస్థాపన చేశారు. చేవెళ్ల ఎమ్మెల్యే యాదన్న సహకారంతో ఈ అభివృద్ధి పనులు ప్రారంభం కావడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కాలువ నిర్మాణం పూర్తయితే మురుగు నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు కూడా తగ్గనున్నాయని ప్రజలు అభిప్రాయపడ్డారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మున్సిపాలిటీ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తోందని పలువురు ప్రశంసించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, పట్టణంలోని ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ప్రజలకు అవసరమైన రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలను దశలవారీగా అభివృద్ధి చేస్తూ శంకర్‌పల్లిని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. భూగర్భ మురుగు నీటి కాలువ నిర్మాణంతో పరిసరాలు పరిశుభ్రంగా మారడంతో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కూడా ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి రాజీ ఉండదని, నాణ్యతతో పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్వేత పాండురంగారెడ్డి, 12వ వార్డు కౌన్సిలర్ దండు రాజేశ్వర్, కౌన్సిలర్లు అశోక్, ప్రశాంత్, గిరిజ శేఖర్, పాల్గొన్న నాయకులు అభివృద్ధి పనులు నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం, ఎమ్మెల్యే, మున్సిపల్ పాలకవర్గం సమన్వయంతో శంకర్‌పల్లి పట్టణ అభివృద్ధికి మరిన్ని సంక్షేమ,మౌలిక సదుపాయాల పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. స్థానికులు కూడా అభివృద్ధి కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తామని, పట్టణాన్ని పరిశుభ్రంగా, అభివృద్ధి చెందిన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## ఎస్ఐఆర్ నమోదు శాతం పెంచాలి: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**రామచంద్రాపురం, జూలై 29(వు దయం)**

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో భాగంగా భారతి నగర్, రామచంద్రాపురం డివిజన్‌ల బూత్ స్థాయి నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు. మాజీ కార్పొరేటర్ తొంట ఆంజయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో బూత్‌ల వారీగా ఎస్ఐఆర్ నమోదు శాతాన్ని సమీక్షించి, నమోదు పెంపునకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు.ఓటరు జాబితాలోని డూప్లికేట్ నమోదులను గుర్తించి తొలగించే ప్రక్రియపై బూత్ లెవల్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేశారు. ఆగస్టు 3తో ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణ గడువు ముగియనున్నందున ప్రతి బీఆర్ఎస్ నాయకుడు, కార్యకర్త బూత్ లెవల్ అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి అర్హులైన ప్రతి ఓటరితో ఫారాలు నింపించి నమోదు శాతాన్ని పెంచాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చాకరిమెట్లలో కొబ్బరికాయల వేలం....

**11.21000లకు దక్కించుకున్న శ్రీకాంత్ రెడ్డి....**

**వుదయం న్యూస్ శివ్వంపేట జులై 29....**

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామ పంచాయతీ పరిధిలో స్వయంభుగా వెలసిన శ్రీ సహకార ఆంజనేయ స్వామి దేవస్థానం లో నేడు కొబ్బరికాయలు. పూజా సామాగ్రి. వేలం పెట్టగా. ఇట్టి వేలంపాటలో భువనగిరి జిల్లా యాదాద్రి కి చెందిన ఏ శ్రీకాంత్ రెడ్డి 11 లక్షల ఇరవై ఒక్క వేలకు దక్కించుకోవడం జరిగిందని. ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ బీ .ప్రసన్నాంజనేయ శర్మ. ధర్మాదాయ శాఖ పరిశీలకులు రంగారావు. దేవస్థానము కార్యనిర్వాహణాధికారి శ్రీనివాస్ లు అధికారికంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నారాయణరావు. ఉప సర్పంచ్ పాపయ్య చారి. మాజీ ఎంపీటీసీ నర్సింగరావు. గ్రామస్తులు రామచంద్ర రావు. తదితరులు పాల్గొన్నారు.



## శంకర్‌పల్లిలో రాజకీయ పార్టీల సమావేశం



**.ఓటరు జాబితాలో 100 శాతం మ్యాపింగ్ పూర్తి చేయాలని బీఎల్ఏలు, బీఎల్‌వోలకు అధికారుల సూచన**

**శంకర్‌పల్లి జూలై 29(వుదయం)**

శంకర్‌పల్లి మండలంలో ఎస్ఐఆర్-2026 (స్పెషల్ ఇంటెన్షివ్ రెవిషన్ -2026) కార్యక్రమం పురోగతిపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం ప్రస్తుత స్థితిని సమగ్రంగా సమీక్షించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా కొనసాగేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్ఏలు (బూత్ లెవెల్ ఏజెంట్స్ ), బీఎల్‌వోలు (బూత్ లెవెల్ ఆఫీసర్స్ ) సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని అధికారులు వివరించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ ప్రతి అర్హత కలిగిన ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో గ్రామాల వారీగా, మారిన ఓటర్లు, మరణించిన వారి పేర్లు, ఒకే వ్యక్తి పేర్లు రెండుసార్లు నమోదైన డూప్లికేట్ ఓటర్లు, సంబంధించిన పూర్తి వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు.ఈ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన అభ్యంతరాలు, సూచనలు నిర్ణీత గడువులోగా సమర్పించాలని కోరారు.అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు తమకు సంబంధించిన బీఎల్ఏలకు స్పష్టమైన సూచనలు జారీ చేసి, ఆయా పోలింగ్ కేంద్రాల బీఎల్‌వోలతో సమన్వయం చేసుకుంటూ ఇంటింటి స్థాయిలో ఓటర్ల వివరాలను పరిశీలించాలని అధికారులు సూచించారు.అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చడం, అనర్హులైన వారి పేర్లను నిబంధనల ప్రకారం తొలగించడం, ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా 100 శాతం ఓటర్ల మ్యాపింగ్ పూర్తి చేయాలని సమావేశంలో స్పష్టం చేశారు. సమావేశం ముగింపులో ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు ఎస్ఐఆర్-2026 ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడానికి అన్ని రాజకీయ పార్టీలు, బీఎల్ఏలు, బీఎల్‌వోలు పరస్పర సహకారంతో పనిచేయాలని అధికారులు పి లు పు ని చ్చా రు . ప్ర జా స్వా మ్య వ్యవస్థకు ఓటరు జాబితా అత్యంత కీలకమైనదని, ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటు హక్కును వినియోగించుకునేలా ఖచ్చితమైన, తప్పులులేని ఓటరు జాబితా రూపొందించడం అందరి బాధ్యత అని సమావేశంలో నొక్కిచెప్పారు.

## బీరంగూడలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



**రామచంద్రాపురం జూలై 29(వుదయం)**

పటాన్‌చెరు నియోజకవర్గంలోని బీరంగూడ డివిజన్ పరిధిలోని ఎన్ఆర్ఐ శ్రీనివాస్ నగర్ కాలనీ, షిరిడి సాయి కాలనీ, బీరంగూడ శివాలయం గోశాలలోని సాయిబాబా ఆలయాల్లో బుధవారం గురుపౌర్ణమి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ఆమెకు ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కాట సుధా శ్రీనివాస్ గౌడ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.



"రాజకీయ ప్రయోజనాల కంటే తెలంగాణ ప్రయోజనాలే మాకు ముఖ్యం. రాష్ట్ర ప్రజల తరఫున రైల్వే, ఐటీ రంగాలకు సంబంధించిన అత్యంత కీలకమైన అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లాం. కాజీపేట కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశాం. ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే పునర్విభజన ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఇదే సరైన సమయం. ప్రతిపాదిత కాజీపేట డివిజన్‌లో కాజీపేట–బల్లార్షా, పెద్దపల్లి–నిజామాబాద్, కాజీపేట–ఎర్రుపాలెం, డోర్నకల్–మణుగూరు, మోతమర్రి–విష్ణుపురం, కాజీపేట–వంగపల్లి రైల్వే స్టేషన్లను చేర్చాలి. ఈ డివిజన్ పరిధి సుమారు రెండు వేల ట్రాక్ కిలోమీటర్ల వరకు ఉంటుంది. రైల్వే ఉద్యోగులు కూడా కాజీపేట డివిజన్ ఏర్పాటుకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారు."

**-కేటీఆర్, బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్**

## వే'మన' పద్యం

**కనకమృగము భువిని గద్దు లేదనకను**
**తరుణి విడిచి చనియె దాశరధియు**
**తెలివిలేనివాడు దేవుడెట్లాయెరా**
**విశ్వదాభిరామ! వినురవేమ!**



# సంపాదకీయం

# విద్య భిక్ష కాదు.. రాజ్యాంగ హక్కు

ఇంజినీరింగ్ విద్య ఇప్పుడు జ్ఞానాన్ని అందించే వ్యవస్థగా కాకుండా, ప్రయివేటు కాలేజీలకు అదనపు ఫీజుల పేరుతో డబ్బు వసూలు చేసే యంత్రంగా మారింది. ప్రభుత్వం, ఫీజుల రెగ్యులేటరీ కమిటీ నిర్ణయించిన ట్యూషన్ ఫీజు కాకుండా యాజమాన్యాలు ఒక్కో విద్యార్థి నుంచి రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. ఇదేంటని అడిగితే? ల్యాబ్, కాలేజ్ డెవలప్‌మెంట్ ఫండ్, లైబ్రరీ, అడ్మిషన్, జేఎన్‌టీయూ, మెయింటెనెన్స్, ఇతర ఖర్చులు అంటూ కాకమ్మ కథలు చెబుతున్నాయి. అంతేకాదు, గుర్తింపు పొందిన పెద్ద పెద్ద కాలేజీల్లో బి కేటగిరి సీట్లను కూడా ఒక్కొక్క సీటును డొనేషన్ కింద లక్షల రూపాయలకు అమ్ముకుంటున్నాయి. గత కొన్నేండ్లుగా ఈ దందా నడుస్తున్నా సర్కారు చర్యలు మాత్రం శూన్యంగానే కనిపిస్తున్నాయి. ఈ అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట లేదా? ప్రతి విద్యా సంవత్సరంలో వేలాది తల్లిదండ్రుల బాధ ఇదే. అధికారంలో ఉంటున్న పాలకులు ఎవరిని కాపాడుతున్నారు? విద్యార్థులనా... విద్యను వ్యాపార రంగా మార్చుకున్న యాజమాన్యాలనా? ప్రభుత్వం లో యాజమాన్యాల భాగస్వామ్యం ఉన్నప్పుడు చర్యలు ఉంటాయనుకోవడం భ్రమే. 202526, 202627, 202728

విద్యా సంవత్సరాలకు తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏపీఆర్‌సీ) గత విద్యా సంవత్సరం ట్యూషన్ ఫీజులను ఖరారు చేసింది. కమిటీ ప్రతిపాదనలకు అనుగుణంగా ప్రయివేటు కాలేజీలకు ఫీజుల వివరాలను పొందుపరుస్తూ ప్రభుత్వం జీవోను విడుదల చేసింది. మూడేండ్ల ఫీజుల పీరియడ్‌లో ట్యూషన్ ఫీజు గాకుండా ఎలాంటి అదనపు ఫీజులూ అక్రమంగా వసూలు చేసినా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. ఆ ఆదేశాలను యాజమాన్యాలు తుంగలో తొక్కేశాయి. ఈ విద్యాసంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియ పూర్తికాలేదు. ఇంకా క్లాసుల్లోకి విద్యార్థులు అడుగు పెట్టకముందే అదనపు ఫీజుల వసూలుకు తెరలేపాయి. ఫీజులు చెల్లిస్తేనే అడ్మిషన్ ఇస్తామని మొహం మీదనే చెప్పేస్తున్నాయి. ఒకవైపు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం సరిగా అమలు గాకపోవడం, మరోవైపు ఈ అదనపు ఫీజుల వసూళ్లతో ప్రస్తుత విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్య కఠినంగా తయారైంది. ప్రభుత్వం ప్రకటనలు చేసినంత సులభంగా వాటి అమలు విషయంలో సీరియస్‌గా లేకపోవడం ప్రస్తుత పరిస్థితులకు కారణం. విద్యార్థులందరికీ ఇంజినీరింగ్ విద్యను దగ్గర చేయడం కోసం గత ప్రభుత్వాలు తీసుకొచ్చిన అనేక విధానాల వల్ల లక్షలాది మంది విద్యార్థులు ఇంజినీర్లుగా మారి దేశ నిర్మాణంలో భాగస్వాములయ్యారు. సాంకేతిక నిపుణులుగా ప్రపంచంలోనే గుర్తింపు పొందారు. ఎప్పుడైతే విద్యార్థులు ఇంజినీరింగ్‌వైపు మొగ్గుచూపారో ఆనాటి నుంచి ఫీజుల పేరుతో ఇంజినీరింగ్ విద్యను యాజమాన్యాలు దోపిడీకి అడ్డాగా మార్చేశాయి. గతంలో అన్ని కాలేజీలకు ఒకేరకమైన ఫీజు ఉండేది. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వచ్చిన తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చాలా కాలేజీలు పుట్టుకొచ్చాయి.

ఈ పథకం మీదనే ఆధారపడి చాలా కాలేజీలు నడిచాయి కూడా. చివరికి కొంతమంది యాజమాన్యాలు ప్రభుత్వంలో భాగస్వామ్యమై చివరికి ప్రభుత్వాలనే శాసించే స్థాయికి చేరాయి. అదే సందర్భంలో చిన్న కాలేజీలను పట్టించుకోవడమే మానేశాయి. దేశవ్యాప్తంగా చాలా రాష్ట్రాల్లో ఇవే పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలో 176 ఇంజినీరింగ్ కాలేజీలుంటే అందులో 157 ప్రయివేటు కాలేజీలే. ఇందులో పాలకులకు దగ్గరగా ఉన్న కాలేజీలే ఎక్కువ. ఖర్చులకు అనుగుణంగా ఫీజులు సరిపోవడం లేదంటే కొన్ని కాలేజీలకు ప్రభుత్వాలు ఫీజులు పెంచేశాయి. నాలుగేండ్ల ఇంజినీరింగ్ విద్యలో కన్వీనర్ కోటాలో ఏడాదికి ఫీజు ప్రస్తుతం చాలా కాలేజీల్లో లక్ష రూపాయలు, లక్షా 50 వేలు, లక్షా 80 వేలు, రెండు లక్షల చొప్పున ఫీజు ఉంది. బీ కేటగిరి సీట్లకు డొనేషన్ ఫీజు సరేసరి. కొన్ని కాలేజీల్లో తక్కువ ఫీజు ఉంది. ఇవి గాకుండా ఇతరత్రా కేటగిరిల కింద అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. దీనకంతటికీ ప్రభుత్వ విధానాల అమలు లోపమే కారణం. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద విద్యార్థులకు సకాలంలో ఫీజులు చెల్లిస్తే అదనంగా ఫీజులు వసూలు చేయాల్సిన దుస్థితి ఉండేది కాదనేది యాజమాన్యాల వాదన. ప్రభుత్వం కూడా ఆ దిశగా ఆలోచించాల్సి ఉంది. విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చే ధోరణి రోజురోజుకూ పెరుగుతోంది. దీనికి అనుగుణంగా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలూ అందులో భాగం. అనేక ప్రయివేటు విద్యాసంస్థలు కొంతమంది ప్రభుత్వ పెద్దల చేతుల్లో ఉండటం వల్ల నియంత్రణ సంస్థలు కూడా కఠినంగా వ్యవహరించలేకపోతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని అమలు చేయాలి. పర్యవేక్షణ సంస్థలకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు మినహా అదనపు వసూళ్లు చేసినా చర్యలు తీసుకోవాలి. విద్యను కాపాడాలంటే ఫీజుల దోపిడీని అరికట్టాలి. లేకపోతే 'విద్య హక్కు' అనే రాజ్యాంగ వాగ్దానం, 'డబ్బు ఉన్నవారికే విద్య' అనే చేదు వాస్తవంగా మిగిలిపోతుంది.

# ఏఐలో అమెరికా, చైనా నువ్వా నేనా

ఒకప్పుడు చమురు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు చోదకశక్తిగా నిలిచింది. ఆ తర్వాత డేటా కొత్త చమురుగా గుర్తింపు పొందింది. ఇప్పుడు కృత్రిమ మేధస్సు ప్రపంచ ఆర్థిక, సాంకేతిక, సైనిక, రాజకీయ ఆధిపత్యాన్ని నిర్ణయించే కొత్త శక్తి కేంద్రంగా అవతరించింది. 21వ శతాబ్దంలో కృత్రిమ మేధస్సులో ముందంజలో నిలిచే దేశమే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ రాజకీయాలు, జాతీయ భద్రతపై అత్యధిక ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అమెరికా-చైనా మధ్య సాగుతున్న కృత్రిమ మేధస్సు పోటీ కేవలం సాంకేతిక రంగానికే పరిమితం కాకుండా, ప్రపంచ నాయకత్వాన్ని నిర్ణయించే వ్యూహాత్మక సమరంగా మారింది.ఈ పోటీ కేంద్రంలో కృత్రిమ మేధస్సు నమూనాలు, సెమీకండక్టర్ చిప్‌లు, డేటా, క్లౌడ్ కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలు, పరిశోధన, పెట్టుబడులు, కంప్యూటింగ్ సామర్థ్యం ఉన్నాయి. అందువల్ల దీనిని సాధారణ వాణిజ్య పోటీగా కాకుండా, భవిష్యత్ భౌగోళికరాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే ఆధిపత్య పోరుగా విశ్లేషిస్తున్నారు. ప్రపంచ ఆర్థిక వృద్ధిలో కృత్రిమ మేధస్సు కీలక పాత్ర పోషిస్తుందని పలు అంతర్జాతీయ అధ్యయనాలు సూచిస్తున్నాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి అంచనా ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా సుమారు 40 శాతం ఉద్యోగాలపై కృత్రిమ మేధస్సు ప్రభావం పడే అవకాశం ఉంది. మరోవైపు, ఫ్వ్ విశ్లేషణ ప్రకారం కృత్రిమ మేధస్సు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు రానున్న దశాబ్దంలో గణనీయమైన అదనపు వృద్ధిని



అందించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. అమెరికా ప్రస్తుతం ఈ రంగంలో ఆధిక్యాన్ని కొనసాగిస్తోంది. ఓపెన్‌ఏఐ, గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా, ఆంత్రోపిక్, ఎన్విడియా వంటి సంస్థలు ప్రపంచ కృత్రిమ మేధస్సు పరిశోధనకు నాయకత్వం వహిస్తున్నాయి. ముఖ్యంగా ఎన్విడియా తయారు చేస్తున్న అత్యాధునిక సెమీకండక్టర్ చిప్‌లు ప్రపంచ కృత్రిమ మేధస్సు వ్యవస్థలకు వెన్నెముకగా మారాయి. తన సాంకేతిక ఆధిక్యాన్ని కాపాడుకునేందుకు అమెరికా చిప్స్ యాక్ట్, చిప్ ఎగుమతి నియంత్రణలు, పెట్టుబడి పరిమితులు వంటి విధానాలను అమలు చేస్తోంది.మరోవైపు చైనా కృత్రిమ మేధస్సును జాతీయ అభివృద్ధి వ్యూహంలో కీలక భాగంగా ప్రకటించింది. బైడూ, అలీబాబా, టెన్సెంట్, హువావే, డీప్‌సీక్ వంటి సంస్థలతో పాటు ప్రభుత్వ మద్దతు, విస్తృత డేటా వనరులు, భారీ పెట్టుబడులు చైనాకు బలాన్ని అందిస్తున్నాయి. అమెరికా ఆంక్షలను అధిగమించేందుకు స్వదేశీ చిప్‌ల తయారీ, కృత్రిమ మేధస్సు ప్రాసెసర్ల అభివృద్ధిపై చైనా దృష్టి సారిస్తోంది. అదే సమయంలో తక్కువ వ్యయంతో ఓపెన్ సోర్స్ నమూనాలను అందుబాటులోకి తెచ్చి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో తన సాంకేతిక ప్రభావాన్ని విస్తరించేందుకు ప్రయత్నిస్తోంది.ఈ పోటీలో అత్యంత కీలకమైన ఆయుధం సెమీకండక్టర్ చిప్‌లే. శక్తివంతమైన చిప్‌లు లేకుండా ఆధునిక కృత్రిమ మేధస్సు వ్యవస్థలు పనిచేయలేవు. అందువల్ల చిప్‌ల సరఫరా గొలుసు, లిథోగ్రఫీ సాంకేతికత, కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలు వ్యూహాత్మక ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. అదే సమయంలో డేటా కూడా కొత్త శక్తిగా మారింది. అమెరికాలో వ్యక్తిగత గోప్యతా చట్టాలు డేటా వినియోగంపై కొన్ని పరిమితులు విధిస్తుండగా, చైనాలో భారీ స్థాయిలో డేటా అందుబాటులో ఉండటం అక్కడి కృత్రిమ మేధస్సు నమూనాల అభివృద్ధికి అనుకూలంగా మారుతోంది.ఈ పోటీ ప్రభావం సాంకేతిక రంగానికే పరిమితం కాదు. తయారీ, వైద్యం, వ్యవసాయం, విద్య, బ్యాంకింగ్, రవాణా రంగాలతో పాటు స్వయంచాలక డ్రోన్లు, సైబర్ భద్రత, నిఘా వ్యవస్థలు, సైనిక వ్యూహాల్లో కూడా కృత్రిమ మేధస్సు వినియోగం వేగంగా పెరుగుతోంది. అదే సమయంలో ఆటోమేషన్ కారణంగా ఉద్యోగాల స్వరూపం మారుతుండగా, కొత్త నైపుణ్యాలు, కొత్త పరిశ్రమలకు కూడా మార్గం సుగమమవుతోంది. అమెరికా, చైనా వేర్వేరు సాంకేతిక ప్రమాణాలను అనుసరిస్తే ప్రపంచం రెండు డిజిటల్ పర్యావరణ వ్యవస్థలుగా విడిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.కృత్రిమ మేధస్సు ఆధిపత్యం అంటే కేవలం మెరుగైన సాఫ్ట్‌వేర్‌ను రూపొందించడం కాదు. చిప్‌లు, డేటా, పరిశోధన, ప్రతిభ, కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలు, విధానాలు, సరఫరా గొలుసులు, నైతిక నియంత్రణలు—ఇవన్నీ కలిసిన సమగ్ర శక్తి. కృత్రిమ మేధస్సు ప్రపంచానికి అపార అభివృద్ధి అవకాశాలను అందిస్తున్నప్పటికీ, అమెరికా-చైనా మధ్య ఆధిపత్య పోరు దానిని కొత్త జియోపాలిటికల్ యుద్ధరంగంగా మార్చింది. ఈ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తూ పరిశోధన, సెమీకండక్టర్ తయారీ, భాషా సాంకేతికత, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారిస్తే, భారతదేశం కూడా ఈ సాంకేతిక విప్లవంలో కీలక శక్తిగా ఎదిగే అవకాశం ఉంది.



సి. హెచ్. ప్రతాప్
77938 00743

# ప్రజాస్వామ్యం ఓటే వజ్రాయుధం

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఒక పండుగగా చెప్పుకుంటాం. కానీ ఆ పండుగకు ప్రాణం పోసేది పోలింగ్ కేంద్రం కాదు, ఓటర్ల జాబితా. ప్రతి అర్హుడైన పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని కల్పించే పునాది అదే. ఓటర్ల జాబితా ఎంత ఖచ్చితంగా, పారదర్శకంగా, నిష్పాక్షికంగా ఉంటే ప్రజాస్వామ్యం అంత బలంగా నిలుస్తుంది. అందుకే ఓటర్ల జాబితా రూపకల్పనను కేవలం పరిపాలనా కార్యక్రమంగా కాకుండా, ప్రజాస్వామ్యానికి మొదటి రక్షణ కవచంగా చూడాల్సిన అవసరం ఉంది. ఇటీవలి కాలంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఎన్నికల కమిషన్ దీని ఉద్దేశాన్ని ఓటర్ల జాబితాను మరింత ఖచ్చితంగా రూపొందించడం, అర్హులైన వారిని చేర్చడం, అనర్హ నమోదులను తొలగించడం అని వివరిస్తోంది. మరోవైపు, ప్రతిపక్ష పార్టీలు, కొన్ని పౌర సంఘాలు, ఎన్నికల పరిశీలకులు మాత్రం ఈ ప్రక్రియలో అర్హులైన ఓటర్లు కూడా తొలగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి భిన్నాభిప్రాయాలు సహజమే. అయితే, ఆ అనుమానాలకు పారదర్శక సమాధానాలు ఇవ్వడం కూడా అంతే అవసరం. భారత రాజ్యాంగం ప్రతి వయోజన పౌరుడికి ప్రజాప్రతినిధులను ఎన్నుకునే అవకాశాన్ని కల్పించింది. ఓటు హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభం. ప్రజల ఆకాంక్షలు, అభిప్రాయాలు, ప్రభుత్వాల రూపకల్పన అన్నీ ఓటు ద్వారానే ప్రతిఫలిస్తాయి. అందుకే ఓటర్ల జాబితాలో ఒక్క పేరు కూడా అన్యాయంగా తొలగిపోకూడదు. అదే సమయంలో అర్హత లేని నమోదులు కొనసాగకూడదు. ఈ రెండు లక్ష్యాల మధ్య సమతుల్యతను కాపాడటం ఎన్నికల నిర్వహణలో అత్యంత కీలకమైన బాధ్యత. ప్రజాస్వామ్యంలో విశ్వాసం చట్టాల వల్ల మాత్రమే కాదు; ఆ చట్టాల అమలుపై ప్రజలకు కలిగే నమ్మకం వల్ల కూడా నిలుస్తుంది. ఎన్నికల కమిషన్ రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థ. అందువల్ల అది తీసుకునే ప్రతి నిర్ణయం రాజకీయాలకు అతీతంగా కనిపించడమే కాదు, పారదర్శక విధానాలు, సమయానికి సమాచారం, ఫిర్యాదులపై వేగవంతమైన స్పందన, ప్రజలకు అందుబాటులో ఉండే పరిష్కార వ్యవస్థ—ఇవన్నీ ఎన్నికల వ్యవస్థపై విశ్వాసాన్ని బలోపేతం చేస్తాయి. సుప్రీంకోర్టు అనేక సందర్భాల్లో స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికలను రాజ్యాంగంలోని ప్రాథమిక ప్రజాస్వామ్య విలువలలో భాగంగా పేర్కొంది. ఎన్నికల కమిషన్ స్వతంత్రత, ఓటర్ల జాబితా విశ్వసనీయత, ప్రతి అర్హుడికి ఓటు వేసే అవకాశం—ఈ మూడు అంశాలు ఒకదానితో ఒకటి విడదీయరాని సంబంధం కలిగి ఉన్నాయి.

ప్రజాస్వామ్య బలం కేవలం ఓట్ల లెక్కింపులో కాదు; ఓటు వేసే హక్కు ప్రతి అర్హుడికి సమానంగా అందుబాటులో ఉండటంలో ఉంది. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో సహజ న్యాయ సూత్రాలు తప్పనిసరిగా పాటించాలి. ఒకరి పేరు తొలగించే ముందు కారణాలు తెలియజేయడం, వివరణ ఇచ్చే అవకాశం కల్పించడం, అవసరమైతే అప్పీల్ చేసుకునే అవకాశం ఉండడం ప్రజాస్వామ్య పరిపాలనలో అత్యంత కీలకమైన అంశాలు. చట్టబద్ధ మార్గాల్లో పరిష్కారాలు కోరాలి. అలాగే ఎన్నికల కమిషన్ కూడా అన్ని రాజకీయ పార్టీలతో నిరంతర సంభాషణ కొనసాగిస్తూ సందేహాలను నివృత్తి చేయాలి. పౌరుల బాధ్యత మరింత కీలకం. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైన వెంటనే ప్రతి ఒక్కరూ తమ పేరు ఉందో లేదో పరిశీలించాలి. పేరు లేకుంటే వెంటనే దరఖాస్తు చేయాలి. కొత్తగా అర్హత పొందిన యువత నమోదు చేసుకోవాలి. చిరునామా మారిన వారు వివరాలు సవరించుకోవాలి. వృద్ధులు, దివ్యాంగులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా ఈ ప్రక్రియ సులభంగా అందుబాటులో ఉండేలా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకోవాలి. ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికల రోజు మాత్రమే జీవించదు. ఎన్నికల ముందు జరిగే ప్రతి ప్రక్రియలో అది ప్రతిబింబిస్తుంది. ఓటర్ల జాబితా రూపకల్పన, నామినేషన్లు, ప్రచారం, పోలింగ్, ఓట్ల లెక్కింపు—ప్రతి దశ సమానంగా విశ్వసనీయంగా ఉండాలి. ఈ గొలుసులో తొలి కడియం ఓటర్ల జాబితానే. అదే బలహీనమైతే మొత్తం వ్యవస్థపై ప్రభావం పడుతుంది. దేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవడం కేవలం ఎన్నికల కమిషన్ లేదా రాజకీయ పార్టీల బాధ్యత మాత్రమే కాదు. ప్రతి పౌరుడి బాధ్యత కూడా అదే. తన ఓటు హక్కును పరిరక్షించుకోవడం, ఇతరులను కూడా చైతన్యవంతులను చేయడం, ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొనడం ప్రజాస్వామ్యానికి బలమైన పునాది వేస్తాయి. చివరగా చెప్పాల్సింది ఒక్కటే. ఎన్నికల్లో గెలుపు-ఓటములు మారుతూ ఉంటాయి. ప్రభుత్వాలు వస్తుంటాయి, వెళ్తుంటాయి. కానీ ప్రజాస్వామ్యంపై ప్రజల విశ్వాసం దెబ్బతినకూడదు. ఆ విశ్వాసాన్ని నిలబెట్టేది ఖచ్చితమైన, పారదర్శకమైన, అందరికీ సమాన న్యాయం చేసే ఓటర్ల జాబితా. ప్రతి అర్హుడి ఓటు విలువైనదే. ఆ విలువను కాపాడుకోవడం భారత ప్రజాస్వామ్య భవిష్యత్తుకు అత్యంత అవసరం.



ఏం రవీందర్
7901503777



# లక్ష్యం ఘనం- పంపిణీ ఘోరం

పాఠశాల పునఃప్రారంభమై నెల రోజులు దాటిపోతున్నా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందాల్సిన విద్యా కిట్లు పూర్తిస్థాయిలో చేరకపోవడం విద్యా పరిపాలనా యంత్రాంగపు ప్రణాళికారాహిత్యానికి, నిరంతర అలసత్వానికి నిదర్శనంగా నిలుస్తోంది. విద్యా సంవత్సరం తొలి రోజు నుంచే సమాన అవకాశాలతో, నాణ్యమైన చదువును అందించడంతో పాటు పేద కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించాలనే ఉన్నతాశయంతో ప్రభుత్వం ఉచితంగా రెండు జతల యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్లు, నోట్‌బుక్లు, పాఠశాల బ్యాగు, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, టైలతో కూడిన సమగ్ర విద్యా కిట్లను ప్రతి ఏటా పంపిణీ చేస్తోంది. తొలి రోజు నుంచే విద్యార్థులందరూ ఎలాంటి ఆత్మన్యూనతా భావానికి లోనుకాకుండా సమభావనతో, ఆత్మవిశ్వాసంతో తరగతి గదుల్లోకి అడుగుపెట్టాలన్న ఈ శ్రేయోరాజ్య ప్రాథమిక లక్ష్యానికి క్షేత్రస్థాయిలోని నిర్వహణ లోపాలు తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయి. చిరిగిపోయిన, వర్ణం వెలసిన పాత దుస్తులతోనే బడికి వస్తున్న పిల్లల దృశ్యాలు ఒకవైపు కాగా, కొనుగోలు శక్తి లేక తోటి విద్యార్థుల నుంచి కాగితాలు అడిగి తెచ్చుకుని నోట్లు రాసుకుంటున్న దృశ్యాలు మరొకవైపు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కనిపిస్తుండటం విద్యా వ్యవస్థ తీరుపై తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

ప్రభుత్వ విద్యా సంక్షేమ పథకాల విస్తృతిని పరిశీలిస్తే, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీలు, మోడల్ పాఠశాలలు, గురుకులాల్లో అభ్యసిస్తున్న లక్షలాది మంది విద్యార్థులకు విద్యా సామగ్రిని ఉచితంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిసారీ బడ్జెట్‌లో వందల కోట్ల రూపాయలు కేటాయిస్తోంది. నేటి ఆర్థిక పరిస్థితుల్లో ఒక సగటు నిరుపేద శ్రామిక కుటుంబానికి ఇద్దరు పిల్లలు ఉంటే, వారి విద్యా సామగ్రి, నూతన దుస్తుల కొనుగోలుకే బహిరంగ మార్కెట్లో వేలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తుంది. అటువంటి ఆర్థిక భారాన్ని తగ్గించడమే కాకుండా, పాఠశాలల్లో నమోదు శాతాన్ని గరిష్ఠ స్థాయికి పెంచడం, మధ్యలోనే బడి మానేసే ప్రవృత్తికి అడ్డుకట్ట వేయడం, ధనిక పేద వ్యత్యాసాలు లేని సమ్మిళిత విద్యా వాతావరణాన్ని ప్రోత్సహించడంలో ఈ కిట్ల పంపిణీ కీలకంగా మారింది. అయితే, ఏడాది కేడాది పునరావృతమవుతున్న సరఫరా జాప్యాలు ఈ పథక విస్తృత ఆశయాన్ని తీవ్రంగా దెబ్బ తీస్తున్నాయి. ఈ జాప్యానికి అధికారుల వైపు నుంచి అనేక కారణాలు వ్యక్తమవుతున్నాయి. టెండర్లను ఖరారు చేయడంలో చోటుచేసుకునే సాంకేతిక, పరిపాలనా ఆలస్యాలు, తయారీ సంస్థలకు ఆర్డర్లు ఇవ్వడంలో జాప్యం, మార్కెట్‌లో వస్త్ర ముడిసరుకు ధరల అస్థిరత ప్రధాన అవరోధాలుగా నిలుస్తున్నాయి. దీనికితోడు వస్త్రాల నేత, కుట్టుపనులు, నాణ్యతా ప్రమాణాల పరిశీలనకు ఎక్కువ సమయం పట్టడం, రవాణా ఇబ్బందులు, జిల్లా స్థాయి గిడ్డంగుల నుండి మారుమూల పాఠశాలలకు సరఫరా చేయడంలో సమన్వయ లోపం ఉండటం సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభంలో సంభవించే కొత్త చేరికల ఆధారంగా అదనపు అవసరాలను ముందస్తుగా ఖచ్చితంగా అంచనా వేయలేకపోవడం కూడా ఈ లోపానికి తోడవుతోంది. కొన్ని వస్తువుల నాణ్యత ప్రమాణాల విషయంలో అధికారులు తీసుకుంటున్న అదనపు జాగ్రత్తల వల్ల పంపిణీ మరింత ఆలస్యమైందని వివరణ ఇస్తున్నప్పటికీ, సమయపాలన లేని నాణ్యత విద్యార్థుల సమయ నష్టానికి పరిహారం కాలేదు.సంక్షేమ పథకాలు కేవలం నిధుల కేటాయింపుతోనో, ప్రకటనలతోనో సంపూర్ణం కావు; వాటి అమలులోని సమయపాలన మాత్రమే నిజమైన విజయానికి కొలమానంగా నిలుస్తుంది. పాఠశాల తెరిచిన తొలిరోజే విద్యార్థి చేతికి కావలసిన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్లు అందితేనే బోధనాఅభ్యసన ప్రక్రియ నిరంతరాయంగా సాగుతుంది. తరగతి గదిలో విద్యార్థులందరూ ఒకే విధమైన దుస్తులు ధరించడం ద్వారా వారిలో సమానత్వ భావన, క్రమశిక్షణ పెంపొందుతాయి. సామాజిక శ్రేణులు, ఆర్థిక తారతమ్యాలను తుడిచిపెట్టే ఈ సమభావన సూత్రం, సామగ్రి సమయానికి అందకపోవడం వల్ల ఆటంకానికి గురవుతోంది. నెల రోజులు దాటినా నోట్‌బుక్లు, పుస్తకాలు చేతికి రాకపోవడంతో రోజువారీ పాఠ్యాంశాల అభ్యాసన వెనుకబడి, విద్యా సంవత్సరం ఆరంభంలోనే విద్యార్థులలో నిరాసక్తత చోటుచేసుకుంటోంది.ఈ పరిపాలనా అలసత్వం వల్ల అత్యంత ప్రతికూల ప్రభావానికి గురవుతున్నది గ్రామీణ, గిరిజన ప్రాంతాల నిరుపేద విద్యార్థులే. ఆర్థిక స్థోమత లేని దళిత, బహుజన, శ్రామిక కుటుంబాలు తమ పిల్లలకు తక్షణమే నూతన సామగ్రిని సొంత ఖర్చులతో సమకూర్చలేక అల్లాడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు చొరవ తీసుకుని తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ, అది సంపూర్ణ పరిష్కారం కానేరదు. విద్యాహక్కు చట్టం ప్రకారం నాణ్యమైన సదుపాయాలతో కూడిన ఉచిత విద్యను పొందడం ప్రతి చిన్నారి ప్రాథమిక హక్కు. ప్రభుత్వ వ్యవస్థ కేటాయిస్తున్న నిధుల ప్రయోజనం సరైన సమయానికి విద్యార్థికి చేరనప్పుడు, విద్యా వ్యవస్థ కార్యాచరణ విశ్వసనీయతపైనే ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఉండటానికి సమగ్రమైన కార్యాచరణ ప్రణాళిక అత్యంత ఆవశ్యకం. రాబోయే విద్యా సంవత్సరానికి కావలసిన పంపిణీ ప్రక్రియలను కనీసం మూడు నుండి నాలుగు నెలల ముందే, అంటే విద్యా సంవత్సరం ముగిసే సమయానికే ప్రారంభించాలి. మార్చి మాసానికే టెండర్లను పూర్తి చేసి, మే నెలాఖరు నాటికి పంపిణీకి సిద్ధంగా ఉంచేలా కఠినమైన కాలపట్టికను నిర్దేశించుకోవాలి. కొనుగోలు, తయారీ, నాణ్యతా పరిశీలన, రవాణా ప్రక్రియల పర్యవేక్షణ కోసం డిజిటల్ ట్రాకింగ్ విధానాన్ని (జియోటాగింగ్, క్యూఆర్ కోడ్ ఆధారిత పర్యవేక్షణ) ప్రవేశపెట్టాలి. దీని ద్వారా ఏ వస్తువు ఏ దశలో ఉందో సెంట్రల్ డాష్‌బోర్డ్ ద్వారా తక్షణమే గుర్తించి చర్యలు తీసుకోవడానికి వీలవుతుంది.

అంతేకాకుండా, కేంద్రీకృత కొనుగోలు వ్యవస్థలపైనే ఆధారపడకుండా వికేంద్రీకరణ పద్ధతులను ప్రోత్సహించాలి. స్థానిక మహిళా స్వయం సహాయక బృందాలు (మెప్మా, సెర్ప్), చేనేత సహకార సంఘాలు, చిన్న తరహా పరిశ్రమలకు యూనిఫారాల కుట్టుపనులు, అనుబంధ విద్యా సామగ్రి తయారీ బాధ్యతలను అప్పగించడం ద్వారా సమయపాలన సాధ్యమవ్వడమే కాకుండా, స్థానిక గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుంది. నాణ్యతలో లోపాలు రాకుండా కఠినమైన నిబంధనలు అమలు చేస్తూనే, సరఫరాదారులకు సమయానికి బిల్లుల చెల్లింపులు జరిగేలా పారదర్శకతను నెలకొల్పాలి. అత్యవసరంగా పెరిగే విద్యార్థుల సంఖ్యను ఎదుర్కొనేందుకు ప్రతి జిల్లా స్థాయిలో అదనపు నిల్వలను (బఫర్ స్టాక్) సిద్ధంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలి. విద్యా రంగానికి ప్రభుత్వం చేసే ఖర్చు కేవలం సంక్షేమ వ్యయం మాత్రమే కాదు, అది దేశ భవిష్యత్తు కోసం చేసే అత్యంత ప్రాధాన్యమైన మూలధన పెట్టుబడి. విద్యా కిట్ల పథకం ద్వారా ప్రభుత్వం సాధించాలనుకుంటున్న సామాజిక లక్ష్యాలు నెరవేరాలంటే ప్రక్రియలో వేగం, పారదర్శకత, శాఖల మధ్య పటిష్టమైన సమన్వయం అత్యంత కీలకం. బడి తెరిచిన మొదటి రోజే ముఖంలో ఆనందంతో, చేతిలో నూతన పుస్తకాలతో, ఒంటిపై సరికొత్త దుస్తులతో తరగతి గదిలో అడుగుపెట్టే హక్కు ప్రతి పేద విద్యార్థికి ఉంది. పాలనా యంత్రాంగం ఇకనైనా క్షేత్రస్థాయి వాస్తవాలను గుర్తించి, ప్రస్తుతం మిగిలి ఉన్న కిట్లను అత్యవసర ప్రాతిపదికన ప్రతి పాఠశాలకు చేరవేసేలా తక్షణ చర్యలు చేపట్టాలి. రాబోయే కాలంలో విద్యా సంవత్సరం ఆరంభంలోనే ఈ ప్రక్రియలన్నీ సంపూర్ణమయ్యేలా ఒక శాశ్వత, జవాబుదారీ వ్యవస్థను రూపొందించడమే ప్రస్తుత విద్యా వ్యవస్థ ముందున్న ఏకైక మార్గం.

**పాఠశాల పునఃప్రారంభమై నెల రోజులు దాటిపోతున్నా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందాల్సిన విద్యా కిట్లు పూర్తిస్థాయిలో చేరకపోవడం విద్యా పరిపాలనా యంత్రాంగపు ప్రణాళికారాహిత్యానికి, నిరంతర అలసత్వానికి నిదర్శనంగా నిలుస్తోంది. విద్యా సంవత్సరం తొలి రోజు నుంచే సమాన అవకాశాలతో, నాణ్యమైన చదువును అందించడంతో పాటు పేద కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించాలనే ఉన్నతాశయంతో ప్రభుత్వం ఉచితంగా రెండు జతల యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్లు, నోట్‌బుక్లు, పాఠశాల బ్యాగు, ఒక జత బూట్లు, గదుల్లోకి అడుగుపెట్టాలన్న ఈ కలిగిస్తున్నాయి. తీవ్ర విమర్శలకు తావిస్తోంది.**



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

# ప్రజల విశ్వాసమే కీలకం

ప్రభుత్వ భూములను పరిరక్షించడం ఎంత అవసరమో, న్యాయస్థానాల ఆదేశాలను గౌరవించడం కూడా అంతే అవసరం. ఈ రెండు సూత్రాలు పరస్పర విరుద్ధమైనవి కావు, ఒకదానికొకటి పరిపూరకాలు. తెలంగాణలో ప్రభుత్వ భూములు, చెరువులు, పార్కులను ఆక్రమణల నుంచి రక్షించేందుకు ఏర్పాటైన హైడ్రా చేపడుతున్న చర్యలు ఒకవైపు ప్రజల ప్రశంసలు పొందుతుండగా, మరోవైపు న్యాయస్థానాల పరిశీలనకూ లోనవుతున్నాయి. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్‌కు సంబంధించి తెలంగాణ హైకోర్టు చేసిన వ్యాఖ్యలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఇచ్చిన ఆదేశాలు రాజ్యాంగబద్ధ పాలనపై మరోసారి చర్చకు దారితీశాయి. హైదరాబాద్ నగరం, పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణ అనేది దశాబ్దాలుగా కొనసాగుతున్న సమస్య. చెరువులు మాయమవడం, నాలాలు కుంచించుకుపోవడం, పార్కులు, ప్రభుత్వ స్థలాలు అక్రమ నిర్మాణాలకు గురికావడం వల్ల పర్యావరణం దెబ్బతినడమే కాకుండా, ప్రతి వర్షాకాలంలో నగరం వరదల బారిన పడుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసి, ఆక్రమణల తొలగింపు, చెరువుల పునరుద్ధరణ, ప్రభుత్వ ఆస్తుల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం ప్రజాహిత దృష్ట్యా స్వాగతించదగ్గ పరిణామమే. అయితే ప్రజాస్వామ్యంలో మంచి లక్ష్యం ఒక్కటే సరిపోదు. ఆ లక్ష్యాన్ని చేరుకునే ప్రతి అడుగు కూడా చట్టబద్ధంగా ఉండాలి. లోతుకుంట భూముల వ్యవహారంలో సుప్రీంకోర్టు స్టేటస్ కో అమల్లో ఉన్న సమయంలో అధికారులు అక్కడికి వెళ్లడంపై హైకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇప్పటికే హైడ్రాపై పలు కోర్టు ధిక్కరణ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తుచేస్తూ, చట్టాన్ని అమలు చేసే అధికారులే న్యాయస్థానాల ఆదేశాలను విస్మరిస్తే ప్రజల్లో న్యాయవ్యవస్థపై, ప్రభుత్వంపై తప్పుడు సంకేతాలు వెళ్తాయని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇది కేవలం ఒక అధికారిపై చేసిన వ్యాఖ్య కాదు, రాజ్యాంగ పాలనకు ఇచ్చిన హెచ్చరికగా చూడాలి. మరోవైపు హైడ్రా కమిషనర్ చేసిన వివరణ కూడా గమనించదగ్గదే. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, ఆర్టికల్ 48ఏ స్ఫూర్తితో ప్రజల జీవన ప్రమాణాలు, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వ భూములను కాపాడుతున్నామని ఆయన పేర్కొన్నారు. వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించామని, చెరువులను పునరుద్ధరించామని, భూ మాఫియా కోర్టులను ఆశ్రయించి ప్రభుత్వ చర్యలను అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వాదనలోనూ ప్రజాప్రయోజనం కనిపిస్తోంది.అయితే, అసలు సమస్య ఇక్కడే ఉంది. ఒకవైపు ప్రభుత్వ భూములను కబ్జా చేసే భూ మాఫియా చట్టంలోని లోపాలను ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తే, మరోవైపు ప్రభుత్వ యంత్రాంగం కూడా న్యాయపరమైన విధానాలను విస్మరించే పరిస్థితి ఏర్పడకూడదు. ప్రజాస్వామ్యంలో భూకబ్జాదారులకు చట్టం వర్తించినట్టే, అధికారులకు కూడా అదే చట్టం వర్తించాలి. "లక్ష్యం మంచిదే కాబట్టి విధానాన్ని పట్టించుకోనవసరం లేదు" అనే భావన ఎంత ప్రమాదకరమో, "కోర్టు కేసుల పేరుతో ప్రభుత్వ భూములను శాశ్వతంగా ఆక్రమించుకోవచ్చు" అనే భావన కూడా అంతే ప్రమాదకరం. ఈ పరిణామం ప్రభుత్వం, అధికారం, న్యాయవ్యవస్థమూడు వర్గాలకు ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తోంది. ప్రభుత్వ భూముల రక్షణపై ఎలాంటి రాజీ ఉండకూడదు. అదే సమయంలో ప్రతి చర్య పటిష్టమైన చట్టపరమైన ఆధారాలతో, న్యాయ స్థానాల ఆదేశాలను గౌరవిస్తూ కొనసాగాలి. అలా జరిగినప్పుడే హైడ్రా వంటి సంస్థలపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుంది. లేకపోతే అసలు లక్ష్యం గొప్పదైనా, అమలు విధానం వివాదాల్లో చిక్కుకుని ప్రజా మద్దతు బలహీనపడే ప్రమాదం ఉంటుంది.



# జాతీయం-అంతర్జాతీయం



# నిరుద్యోగ భారతం




- 28 శాతానికి పెరిగిన పట్టభద్రులు*పెరిగిన నిరుద్యోగం
- తగ్గిన పట్టభద్రుల సంపాదన
- ప్రతి ముగ్గురు యువకుల్లో ఇద్దరు గ్యాడ్యుయేట్లే
- ఇదీ నేటి భారత యువత నిరుద్యోగ ముఖచిత్రం
- 'స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా 2026' నివేదికలో వెల్లడి

**న్యూఢిల్లీ, జులై 29 (ఎ.ఎం.ఎస్) :** దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉన్నదని ప్రతిపక్షాలు, కేంద్ర గణాంకాలు తేటతెల్లం చేస్తున్నా మోడీ సర్కార్ లైట్ తీసుకుంటోంది. దీంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వాస్తవాలను దాచి అంకెలతో గారడీ చేస్తూ కాలాన్ని నెట్టుకువస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీకి చెందిన 'స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా 2026' నివేదిక..దేశంలోని యువతరం డిగ్రీలు చేతపట్టుకుని ఏ ఉద్యోగమైనా చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు చెబుతోంది. ఉపాధి కోసం భావితరం పడుతున్న ఈ ప్రయత్నం కాస్త ఆగ్రహంగా మారితే మరో యువోద్యమం జరిగే అవకాశాలు ఉన్నాయని స్పష్టమవుతోంది.

దేశంలో నాలుగు దశాబ్దాలుగా విస్తరించిన ఉన్నత విద్య సాధించిన విజయాలు , వైఫల్యాలకు ఈ గణాంకాల తారుమారే స్పష్టమైన నిదర్శనం. అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీకి చెందిన 'స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా 2026' నివేదిక ప్రకారం... 1983లో 50 లక్షలుగా ఉన్న 20 నుంచి 29 ఏండ్ల వయస్సు గల పట్టభద్రుల సంఖ్య నేడు 6.3 కోట్లకు పెరిగింది. అదే కాలంలో వారిలో నిరుద్యోగుల సంఖ్య 7 లక్షల నుంచి 1.1 కోట్లకు పెరిగింది. పట్టభద్రుల సంఖ్య 13 రెట్లు పెరిగితే.. ఉద్యోగం లేని పట్టభద్రుల సంఖ్య 16 రెట్లు పెరిగింది.అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీకి చెందిన 'స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా 2026' నివేదిక ప్రకారం.. 25 ఏండ్లలోపు వయస్సు ఉన్న పట్టభద్రులలో నిరుద్యోగం 1983లో 35 శాతంగా ఉండగా, 2023లో 39.3 శాతంగా ఉంది. అంటే నాలుగు దశాబ్దాల కాలంలో ఈ సంఖ్య నాలుగు శాతం మాత్రమే మారింది. నిజానికి పెరిగింది ఆ నిరుద్యోగ వర్గంలో ఉన్న వ్యక్తుల సంఖ్య మాత్రమే. యువ పట్టభద్రులకు ఉద్యోగాలు కల్పించలేకపోయింది. వారిని తయారు చేయడంలో (విద్యను అందించడంలో) ఎంతో పురోగతి సాధించినా ఉద్యోగ కల్పనను మాత్రం పరిష్కరించలేకపోయింది.1983లో 2029 ఏండ్ల వయసున్న భారతీయులలో పట్టభద్రులు నాలుగు శాతం మాత్రమే ఉండేవారు. ఇప్పుడు వారు 28 శాతానికి పెరిగారు. భారతదేశం వంటి ఆదాయ స్థాయి ఉన్న దేశానికి ఆశించిన స్థాయిలోనే ఉన్నత విద్యలో నమోదు ఉంది. పురుషులతో పోలిస్తే మహిళల్లో ఈ పెరుగుదల అధికంగా ఉన్నట్టు నివేదిక పేర్కొంది. అయితే చదువు పూర్తయ్యాక లభించే ఉద్యోగాల రకం మాత్రం ఆ వేగాన్ని అందుకోలేకపోయింది. 2004 నుంచి 2023 మధ్య, భారతదేశంలో ఏడాదికి సుమారు 50 లక్షల మంది పట్టభద్రులు చేరారు. వారిలో సుమారు 28 లక్షల మంది ఏదో ఒక రకమైన ఉద్యోగాన్ని పొందగా 17 లక్షల మంది మాత్రమే జీతంతో కూడిన ఉద్యోగాలను సంపాదించారు. నివేదికలోని ప్యానెల్ డేటా ప్రకారం.. తాము నిరుద్యోగులమని ప్రకటించుకున్నప్పటి నుంచి ఒక సంవత్సరం పాటు పరిశీలించినప్పుడు యువ పట్టభద్రులలో సగం మంది ఏదో ఒక రకమైన ఉద్యోగాన్ని పొందుతున్నారు. వారిలో కేవలం ఏడు శాతం మంది మాత్రమే శాశ్వత జీతంతో కూడిన ఉద్యోగాన్ని పొందుతుండగా, 3.7 శాతం మంది వైట్ కాలర్ ఉద్యోగాలను పొందుతున్నారు.

30 ఏండ్లలోపు పట్టభద్రులైన పురుషులలో నిరుద్యోగం ఢిల్లీలో 8.8 శాతం ఉండగా ఒడిశాలో 40.3 శాతం వరకు ఉంది. పట్టభద్రులైన మహిళలలో ఇది జమ్మూ కాశ్మీర్‌లో 73.5 శాతానికి, తెలంగాణలో 52.3 శాతానికి, ఏపీలో 51.6 శాతానికి చేరుకుంది. జాతీయ గణాంకాల ప్రకారం పురుషులలో 25.1 శాతం, మహిళలలో 36.6 శాతం ఉంది. చాలా రాష్ట్రాలలో మహిళల పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. అయితే మహారాష్ట్ర, కర్నాటక, పశ్చిమ బెంగాల్‌లలో పురుషుల కంటే మహిళలల్లో పట్టభద్రుల నిరుద్యోగ రేటు తక్కువగా ఉంది. తాజా అధికారిక గణాంకాలు ఈ నివేదికతో పాటు ఇదే విషయాన్ని సూచిస్తున్నాయి. 2025 క్యాలెండర్ ఇయర్ వరకు కొనసాగే ప్రభుత్వ ఆవర్తన కార్మిక శక్తి సర్వే వార్షిక శ్రేణి నుంచి సేకరించిన సమాచారం ప్రకారం... అన్ని వయస్సుల వారిలో పట్టభద్రుల నిరుద్యోగం 11.2 శాతంగా (పురుషులలో 9 శాతం , మహిళలలో 17.4 శాతం) ఉంది. యువత గణాంకాలతో పోలిస్తే ఇది చాలా విస్తృతమైన జనాభా. ఇందులో నలభై, యాభై ఏండ్ల వయసులో ఉన్న, చాలావరకు ఉద్యోగాలలో స్థిరపడిన పట్టభద్రులూ ఉన్నారు. ఆ ఉదారమైన ప్రాతిపదికన చూసినా కూడా, పట్టభద్రులైన పురుషుల రేటు కంటే పట్టభద్రులైన మహిళల రేటు దాదాపు రెట్టింపుగా ఉంది.డిగ్రీ ఇప్పటికీ పొందదగినదే అయినా ఉద్యోగ మార్కెట్‌లోకి ప్రవేశించేటప్పుడు పట్టభద్రుల జీతాలు పట్టభద్రులు కాని వారి కంటే ఎక్కువగా ఉంటాయి. అంతేకాక, పట్టభద్రుల జీతాలు పట్టభద్రులు కాని వారి జీతాలకన్నా రెట్టింపుతో ప్రారంభమవుతాయి. ప్రస్తుతం ఈ ఆధిక్యత తగ్గుతోంది. సుమారు 2017 నుంచి పట్టభద్రుల సంపాదన స్తంభించిపోయింది. కానీ అది పూర్తిగా కనుమరుగవలేదు. డిగ్రీ ఇప్పటికీ ప్రతిఫలాన్ని ఇస్తుంది. ఆ ప్రతిఫలం లభించడం మొదలయ్యే ముందు పట్టే నిరీక్షణ, ఆ నిరీక్షణ తర్వాత లభించే మొదటి ఉద్యోగం గతంలో కంటే అధ్వాన స్థితిలో ఉంది. ఈ నిరీక్షణకు నిధులు సమకూర్చే కుటుంబాలకు ఇది చాలా ఖరీదైనది. జాతీయ నమూనా సర్వే యొక్క విద్యా మాడ్యూల్ ప్రకారం.. 2025లో సుమారు 37.8 శాతం సెకండరీస్కూల్ విద్యార్థులు ప్రయివేట్ కోచింగ్‌లో చేరారు.ప్రాథమిక స్థాయిలో 22.9 శాతంగా ఉన్న ఈ సంఖ్య, ఉన్నత సెకండరీ విద్యార్థులలో 37 శాతంగా ఉంది. డబ్బు కూడా ఇదే వక్రరేఖను అనుసరిస్తుంది. ఉన్నత మాధ్యమిక విద్యలో ఉన్న పిల్లల కుటుంబాలు 2025లో పాఠశాల విద్య కోసం ఖర్చు చేస్తున్న రూ. 20,130కు అదనంగా ఒక్కో విద్యార్థికి కోచింగ్ కోసం సుమారు రూ. 6,380 ఖర్చు చేశాయి. అంటే, ఆ పిల్లల చదువు కోసం వారు చేసే ఖర్చులో దాదాపు నాలుగో వంతు కోచింగ్‌కే వెచ్చిస్తున్నారు. ప్రాథమిక స్థాయిలో అయితే, ఇది సుమారు పదో వంతు ఉంటుంది. ఇటీవల నిటి ఆయోగ్ 11వ పాలక మండలి సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాట్లాడుతూ "భారతదేశ యువత దేశానికి గొప్ప ఆస్తి అని, వారిని జనాభా లాభం నుంచి అభివృద్ధి లాభంగా మార్చాలి" అని అన్నారు. " భవిష్యత్ అవకాశాలు, సవాళ్లకు యువతను సిద్ధం చేయడానికి విద్య, నైపుణ్యాభివృద్ధి , సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని" ఆయన రాష్ట్రాలను కోరారు. కానీ కేంద్రంలో ఉన్న ప్రభుత్వశాఖల్లో ఉన్న ఖాళీలను మాత్రం భర్తీ చేయటం లేదు. ప్రభుత్వరంగంలోని వాటాలను హోల్ సేల్ గా ప్రయివేటుకు కట్టబెట్టడంపై చూపుతున్న శ్రద్ధ యువత ఉపాధి పై చూపితే బాగుంటుందని జెన్ జీ డిమాండ్ చేసింది.కొంచెం వయస్సు పైబడిన పట్టభద్రుల విషయంలో పరిస్థితి మరింత దిగజారింది. 25 29 ఏండ్ల వయస్సు గల వారిలో నిరుద్యోగం 1983లో 12.2 శాతం నుంచి 2023 నాటికి దాదాపు రెట్టింపు (20 శాతం) అయ్యింది. గతంతో పోలిస్తే ఇప్పుడు పట్టభద్రులు ఉద్యోగం కోసం వేచి ఉండే కాలం వారి 20 ఏండ్ల వయస్సు చివరి దశ వరకు కొనసాగుతోంది.

# ముందు నుయ్యి.. వెనుక గొయ్యి

- ఇదీ అమెరికా దుస్థితి
- పొంతన లేని ట్రంప్ వ్యాఖ్యలు
- పూటకో మాట, రోజుకో పోస్టుతో సరి



**వాషింగ్టన్, జులై 29 :** ముందు నుయ్యి..వెనుక గొయ్యి అన్న చందాన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పరిస్థితి మారింది. యుద్ధంలో భారీగా నష్టపోయిన ట్రంప్ ..ఇరాన్ చర్చలంటూ..మరో వైపు హెచ్చరికలు చేస్తున్నారు. చివరికి ఏం చేయలేని స్థితిలో ఏఐ చిత్రాలు పోస్టు చేసుకుంటూ కాలం గడుపుతున్నారు.

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి వివాదాస్పద పోస్టు పెట్టారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతోన్న వేళ తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో షేర్ చేసిన ఏఐ జనరేటెడ్ ఫొటోలు చర్చనీయాంశంగా మారాయి. "గార్డియన్స్ ఆఫ్ ద వరల్డ్" పేరుతో షేర్ చేసిన తొలి ఫొటోలో ట్రంప్ ప్రపంచాన్ని పరిశీలిస్తున్నట్టు గా కనిపించారు. ముందు భాగంలో అమెరికా యుద్ధవిమానాలు ఎగురుతుండగా, రెండు వైపులా ఇరాన్‌పై భారీ పేలుళ్లు, మంటలు ఎగిసిపడుతున్న దృశ్యాలు ఉన్నాయి. సముద్రంలో అమెరికా యుద్ధనౌకలు మోహరించినట్టు కూడా ఈ ఫొటోలో చూడొచ్చు. "స్ట్రైక్ ఆన్ ఖర్గ్" పేరుతో ఉన్న మరో చిత్రంలో ఖర్గ్ ద్వీపంలోని ప్రధాన చమురు ఎగుమతి టెర్మినల్‌పై అమెరికా యుద్ధ విమానాలు దాడి చేస్తున్నట్టుగా చూపించారు. చమురు నిల్వ ట్యాంకులు పేలిపోవడం, సముద్రంలో నౌకల మధ్య భారీ అగ్నికీలలు ఎగిసిపడడం వంటి దృశ్యాలతో ఈ ఫొటోను రూపొందించారు. ఇరాన్ చమురు ఎగుమతికి కీలకమైన ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటామని ట్రంప్ ఎప్పటినుంచో హెచ్చరిస్తున్న విషయం తెలిసిందే."It's Our Oil Tanker Now" అనే మరో చిత్రంలో ట్రంప్ అమెరికా జెండా పట్టుకుని ఇరాన్ చమురు ట్యాంకర్‌పై నిలబడి ఉండగా.. పక్కనే అమెరికా సైనికులు ఆయుధాలతో ఉంటారు. కొందరు వ్యక్తులు సముద్రంలోకి దూకుతున్నట్లు ఆ ఫొటోలో ఉంది. దీంతో ఇరాన్ ఓడను అమెరికా స్వాధీనం చేసుకుందనే భావన కల్పించే ప్రయత్నం చేశారు. అలాగే, ట్రంప్ 2028, అమెరికా ఫస్ట్, ప్లాన్ ట్రస్టెడ్ వంటి నినాదాలతో పోస్టర్లను షేర్ చేశారు. ట్రంప్ పంచుకున్న ఈ ఏఐ చిత్రాలు వాస్తవాల కంటే రాజకీయ ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే విధంగా ఉన్నాయని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# చర్చలు భేష్..

- ఒప్పందం కుదరకపోతే మాత్రం దాడులే
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వితండ వాదన



**వాషింగ్టన్, జులై 29ః** ఇరాన్‌తో చర్చలు బాగా జరుగుతున్నాయని, ఒప్పందం కుదిరేందుకు మంచి అవకాశాలు ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. అయితే చర్చలు విఫలమైతే ఇరాన్‌పై తిరిగి సైనిక దాడులు మొదలవుతాయని హెచ్చరించారు. 'మా మధ్య చర్చలు బాగా జరుగుతున్నాయి. ఒప్పందం కుదిరేందుకు మంచి అవకాశాలు ఉన్నాయని నేను భావిస్తున్నాను. అయితే అది కుదరని పక్షంలో రెండు రోజుల క్రితం మేము ఏం చేశామో ఆ పనే చేస్తాం' అని ఆయన విలేకరులతో అన్నారు. ఆ తర్వాత కొద్ది గంటల వ్యవధిలోనే మిచిగాన్‌లో జరిగిన ప్రచార సభలో ట్రంప్ ప్రసంగిస్తూ స్వరం పెంచారు.

ఇరాన్‌కు 'లంచం' ఇవ్వలేమని, దౌత్యం ఫలించకపోతే వారిని అమెరికా చిత్తుగా ఓడిస్తుందని చెప్పారు. సౌదీ అరేబియా, ఇరాక్, జోర్డాన్‌లపై సోమవారం డ్రోన్ దాడులు జరిగాయంటూ వార్తలు వచ్చిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా సైన్యం ఆయుధ కొరతను ఎదుర్కొంటోందంటూ వస్తున్న వార్తలను ట్రంప్ తోసిపుచ్చారు. ఆయుధ నిల్వలను వేగవంతంగా పెంచుకుంటున్నామని, తాము మరింత ఆధునిక ఆయుధ వ్యవస్థలను కోరుకుంటున్నామని ట్రంప్ చెప్పారు.



## పార్లమెంటు వద్ద ఎస్పీ ఎంపీల ఆందోళన

- అయోధ్య కేసుపై ఉన్నతస్థాయి
- విచారణకు డిమాండ్

**న్యూఢిల్లీ, జులై 29 (ఎ.ఎం.ఎస్)ః** పార్లమెంట్ మకర ద్వారం ఎదుట సమాజ్‌వాదీ పార్టీ ఎంపీలు ఆందోళనలు చేపట్టారు. అయోధ్య రామమందిర్ ఆలయంలో విరాళాల చోరీని వ్యతిరేకిస్తూ మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు.

ఆలయ నిధుల విషయంలో జరిగిన ఆర్థిక అవకతవకలపై ఉన్నత స్థాయి విచారణ జరపాలని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ డిమాండ్ చేశారు. "చదావా చోర్, గద్దీ చోర్" అంటూ నినాదాలు చేశారు. పార్లమెంటులో జరుగుతున్న వర్షాకాల సమావేశాల సందర్భంగా, మంగళవారం నాడు ఈ అంశాన్ని లేవనెత్తడానికి సమాజ్‌వాదీ పార్టీ (SP) సిద్ధమైంది. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్ల మంది ప్రజల విశ్వాసానికి సంబంధించిన అంశమని సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రామ్‌గోపాల్ యాదవ్ అన్నారు. ఆలయ నిధుల దుర్వినియోగంపై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. రామాలయ నిర్మాణానికి మద్దతుగా లాల్ కృష్ణ అద్వానీ రథయాత్రను ప్రారంభించిన 1990 నుండే ఇలాంటి దొంగతనాల ఘటనలు జరుగుతున్నాయని, అయితే ప్రస్తుతం వెలుగులోకి వచ్చిన గణాంకాలు కేవలం 45 నుండి 50 రోజుల కాలానికి సంబంధించినవి మాత్రమేనని ఆయన ఆరోపించారు.

# మళ్లీ రైతన్నల పోరు గర్జన

- నవంబరు 26న కిసాన్ మార్చ్
- ఢిల్లీ సహా దేశవ్యాప్తంగా ఆందోళనలు
- ఐక్యంగా పోరాడాలని ఎస్‌కేఎం పిలుపు



**న్యూఢిల్లీ, జులై 29 (ఎ.ఎం.ఎస్)ః** విద్యార్థుల ఉద్యమం తరువాత దేశవ్యాప్తంగా రైతులు కూడా వీధుల్లోకి రానున్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల (ఎఫ్‌టీఏ)ను ఉపసంహరించుకోవడం, పంటలకు స్వామినాథన్ కమిషన్ ప్రకారం మద్దతు ధర (ఎంఎస్‌పీ) కల్పించడం, సమగ్ర రుణమాఫీ, ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం, విద్యుత్ ప్రయివేటీకరణ రద్దు వంటి డిమాండ్లను లేవనెత్తుతూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) నవంబర్ 26న కిసాన్ మార్చ్‌లను నిర్వహించనుంది. ఢిల్లీతో సహా 100 కేంద్రాల్లో ఈ ఆందోళన నిర్వహించనున్నారు. ఢిల్లీలో మింటో రోడ్, సివిక్ సెంటర్ ఆడిటోరియంలో జరిగిన ఎస్‌కేఎం అఖిల భారత సదస్సు ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని రైతులకు పిలుపునిచ్చింది. ఈ సదస్సు రెండు తీర్మానాలను ఆమోదించింది. అందులో మొదటిది.. ఢిల్లీ సరిహద్దుల్లో ఏడాది పాటు సాగిన చారిత్రాత్మక రైతు పోరాటంలో అమరులైన 736 మంది రైతుల స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేయడానికి సింఘూ సరిహద్దులో తగినంత భూమిని కేటాయించాలని ఢిల్లీ ప్రభుత్వాన్ని కోరడం, రెండవది.. తీవ్రమైన కరువు, వరదలు, పర్యావరణ సంక్షోభం, అలాగే పంటలు, పశువులు, ఇండ్లు, జీవనోపాధి నష్టాలకు పరిహారం అందించేందుకు ప్రభుత్వ రంగ బీమా సంస్థలతో కూడిన సమర్థవంతమైన విపత్తు నిర్వహణ వ్యవస్థ ఆవశ్యకతగా ఉండాలనేది కూడా కీలకాంశంగా ఉంది. దేశ వ్యతిరేక ఎఫ్‌టీఏలకు వ్యతిరేకంగా, ఆగస్టు 10న 'క్విట్ ఇండియా' ఉద్యమ 84వ వార్షికోత్సవం సందర్భంగా రైతులు దేశవ్యాప్తంగా 1,000 ప్రాంతాల్లో 'జైల్ భరో', 'రైల్ రోకో', 'రోడ్ రోకో' వంటి కార్యక్రమాలతో భారీ నిరసన దినాన్ని పాటించాలని పిలుపు ఇచ్చింది. ఇతర సంఘాలు, వేదికలు మద్దతు ఇవ్వాలని, వారితో ఎస్‌కేఎం సమన్వయం చేసుకోవాలని సదస్సు నిర్ణయించింది. ఆగస్టు 17న ఎస్‌కేఎం ప్రతినిధి బృందాలు ప్రధాన మంత్రి, ప్రతిపక్ష నాయకుడు, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రతిపక్ష నాయకులు, ఎంపిలు, ఎమ్మెల్యేలకు డిమాండ్ల పత్రాన్ని సమర్పించి, తమ ప్రధాన డిమాండ్లపై సానుకూల చర్యలు తీసుకోవాలని కోరాలని నిర్ణయించింది. దీర్ఘకాలం పాటు సాగే స్వతంత్ర, సమన్వయ పోరాటాలకు సన్నద్ధమయ్యేందుకు ఎస్‌కేఎం రాబోయే రెండు నెలల్లో రాష్ట్ర స్థాయి సమావేశాలను నిర్వహించనుంది. సభ్య సంఘాలన్నీ సామూహిక పాదయాత్రలు, వాహన జాతాలు, ట్రాక్టర్ ర్యాలీల వంటి స్వతంత్ర, సమన్వయ కార్యక్రమాలను చేపట్టాలని సూచించింది. ఇవి బహిరంగ సభలు, మహా పంచాయతీలు, రాష్ట్ర స్థాయి ర్యాలీలతో ముగిస్తాయని స్పష్టం చేసింది. అక్టోబర్ 3న 'లఖింపూర్ ఖేరీ అమరవీరుల దినోత్సవ గ్రామ మహా పంచాయతీ' జరుగుతుంది. అలాగే, కీలక డిమాండ్లు నెరవేరే వరకు సాగే సుదీర్ఘ పోరాటం కోసం సభ్య సంఘాలు వాలంటీర్ల జాబితాను సిద్ధం చేస్తాయని తెలిపింది. కనీస మద్దతు ధర, రుణ మాఫీతో సహా 2021 డిసెంబర్ 9న ఇచ్చిన లిఖితపూర్వక హామీని కేంద్ర ప్రభుత్వం ఉల్లంఘిస్తూ, డిమాండ్ల పత్రాన్ని అంగీకరించకపోతే, ఎస్‌కేఎం పోరాటాలను ఉధృతం చేయనున్నట్టు స్పష్టం చేసింది.కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధి అశుతోష్ రంకా మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీసిన విజయవంతమైన విద్యార్థి పోరాట అనుభవాన్ని ఆయన పంచుకున్నారు. అలాగే రాబోయే పోరాటాలలో విద్యార్థులు, రైతుల మధ్య మరింత ఐక్యత ఉండాలని పిలుపునిచ్చారు. భారత్ అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు వద్దు, అన్ని ఎఫ్‌టీఏల రద్దు, అన్ని పంటలకు సి2+50 శాతం పద్ధతిలో ఎంఎస్‌పీ, ప్రభుత్వ కొనుగోలుకు హామీనిచ్చే చట్టం చేయడం, గ్రామీణ రుణభారాన్ని, రైతులు, కూలీల ఆత్మహత్యలను అరికట్టడానికి సమగ్ర రుణ మాఫీ, ఆత్మహత్య చేసుకున్న ప్రతి రైతు కుటుంబానికి రూ. 25 లక్షల పరిహారం, నాలుగు కార్మిక చట్టాల రద్దు, కార్మికులందరికీ రూ. 26 వేల కనీస వేతనం, 200 రోజుల పని, రూ. 700 వేతనంతో ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరణ, విద్యుత్ ప్రయివేటీకరణ బిల్లు2025, విత్తన బిల్లు 2025, ఎన్ఎఫ్ఎస్ఏ సవరణ బిల్లుల ఉపసంహరణ, బలవంతపు భూసేకరణ వద్దు, కార్పొరేట్ అనుకూల భూ సమీకరణ వద్దు, గిరిజనులు, గిరిజనేతర అటవీ నివాసితులకు ఎల్ఏఆర్ఆర్ చట్టం2013, ఎఫ్ఆర్ఏ చట్టం2006 ఆధారంగా భూ హక్కుల పరిరక్షణ వంటి డిమాండ్లను ఆమోదించింది.

# పీవోకేలో ఎన్నికల ప్రక్రియ హింసాత్మకం

- భద్రతా దళాల కాల్పులకు పాక్ మంత్రి సమర్థన
- నిరసనకారులంతా శత్రువులేనంటూ వ్యాఖ్యలు
- ఎట్టి పరిస్థితుల్లోనూ చర్చలు జరపబోమంటూ వెల్లడి



**ఇస్లామాబాద్, జులై 29ః** పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో సాగుతున్న శాసనసభ ఎన్నికల ప్రక్రియ నడుమ అక్కడ హింసాత్మక వాతావరణం నెలకొంది. నిరసనకారులపై భద్రతా దళాలు జరిపిన కాల్పులు, అణచివేత చర్యలను సమర్థిస్తూ పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ స్థానిక టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో సంచలన కామెంట్లు చేశారు. ప్రస్తుతం ఇక్కడ నిరసన చేస్తున్న వారంతా.. భారతీయుల్లాగే తమకు శత్రువులు అని పేర్కొన్నారు. అంతటితో ఆగకుండా.. ఇలాంటి వారితో ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ చర్చలు జరపదని స్పష్టం చేశారు. "పాకిస్థాన్ పాలనకు వ్యతిరేకంగా పీఓకే వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేస్తున్న వారికి, శత్రు దేశమైన భారత్‌కు మధ్య ఎలాంటి వ్యత్యాసం లేదు. నిరసనకారులను మేము భారత్ లాంటి శత్రువుల జాబితాలోనే జమకడతాం. అలాంటి వారితో ప్రభుత్వం ఎలాంటి చర్చలు జరిపే ప్రసక్తే లేదు" అని ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యానించారు. సొంత భూభాగంగా చెప్పుకునే ప్రాంతంలో పౌరులపై కాల్పులను న్యాయమైనవిగా చిత్రీకరించేందుకు ఆయన ఈ రకమైన కామెంట్లు చేయడం చూసి అంతా షాక్ అవుతున్నారు. పీఓకే శాసనసభలోని మొత్తం 45 స్థానాలకు గాను మూడు దశల్లో పోలింగ్ నిర్వహించేలా పాక్ నిర్ణయించింది. ఇందులో భాగంగానే జూలై 27వ తేదీన 13 స్థానాలకు తొలి విడత ఓటింగ్ జరిగింది. ఈ పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం, నిషిద్ధ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనల్లో తీవ్ర హింస చెలరేగింది. భద్రతా దళాల కాల్పులు, ఘర్షణల వల్ల జేఏఏసీకి చెందిన 14 మంది కార్యకర్తలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. మరో 24 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారని సదరు సంస్థ వెల్లడించింది. అయితే మృతులలో జేఏఏసీ వ్యవస్థాపక సభ్యుడైన ఉమర్ నజీర్ తమ్ముడు ఉస్మాన్ నజీర్ కూడా ఉన్నట్లు పేర్కొంది. ముఖ్యంగా జాయింట్ అవామీ యాక్షన్ కమిటీతో సహా పలు సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో పోస్ట్ చేసిన వీడియోల్లో.. స్థానికులు తమను తాము రక్షించుకోవడానికి పరుగెడుతుండగా పాకిస్థానీ దళాల క్రూరత్వం కళ్లకు కట్టింది. ఎక్స్‌లో షేర్ చేసిన మరి కొన్ని వీడియోల్లో రోడ్లపై పడి ఉన్న మృతదేహాలు, ఎక్కడ చూసినా కూలిపోయిన మోటార్‌బైక్‌లు కనిపించాయి. ఇలా రెండు రోజుల్లో జరిగిన దాడుల్లో మొత్తంగా 32 మంది నిరసనకారులు ప్రాణాలు కోల్పోగా.. జేఏఏసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదిలా ఉండగా.. ఫలితాల్లో పాకిస్థాన్ ముస్లిం లీగ్ నవాజ్ (పీఎమ్ఎల్ఎన్) 9 చోట్ల, పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) 4 చోట్ల విజయం సాధించినట్లు పాక్ ఎన్నికల సంఘం ప్రకటించింది.

పీఓకేలో పాకిస్థాన్ నిర్వహిస్తున్న ఎన్నికలపై ఇప్పటికే భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఆక్రమిత ప్రాంతంలో దశాబ్దాలుగా జరుగుతున్న మానవ హక్కుల తీవ్ర ఉల్లంఘనలను, తమ అడ్మినిస్ట్రేటివ్ వైఫల్యాలను ప్రపంచం దృష్టి నుంచి మరల్చేందుకే పాకిస్థాన్ ఈ తరహా నాటకాలకు తెర లేపిందని భారత్ దుయ్యబట్టింది. పాక్ అక్రమ ఆక్రమణలో ఉన్న కశ్మీర్ ప్రాంతాలన్నీ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని, ఆ భూభాగంపై పాకిస్థాన్‌కు ఎలాంటి చట్టబద్ధమైన హక్కు లేదని న్యూఢిల్లీ స్పష్టం చేసింది.

## భద్రతా బలగాల చేతిలో మావోయిస్టు నేత

- మిసిర్ బేస్రా అరెస్టు
- ఝార్ఖండ్‌లో పట్టుకున్న పోలీసులు

**రాంచీ, జులై 29 (ఎ.ఎం.ఎస్)ః** మావోయిస్టు నేతల్లో ఒకరిగా గుర్తింపు పొందిన మిసిర్ బేస్రా భద్రతా బలగాలకు చిక్కాడు. ఆయన తలపై రూ.1 కోటి రివార్డు ఉండడం గమనార్హం. ఝార్ఖండ్‌లో జరిగిన సంయుక్త ఆపరేషన్‌లో ఆయనతో పాటు మరో ఇద్దరు కీలక మావోయిస్టు నాయకులను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. మావోయిస్టు వ్యతిరేక పోరులో ఇది అత్యంత కీలక విజయాల్లో ఒకటిగా భద్రతా సంస్థలు భావిస్తున్నాయి.

అధికారుల వివరాల ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి ఝార్ఖండ్ పోలీసులు, కేంద్ర రిజర్వ్ పోలీసు దళం (సీఆర్‌పీఎఫ్), కోబ్రా బెటాలియన్ సంయుక్తంగా ధన్‌బాద్, గిరిడిహ్ జిల్లాల సరిహద్దు ప్రాంతంలో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టాయి.మిసిర్ బేస్రా సంచారంపై అందిన నిఘా సమాచారంతో ఉచ్చు వేసిన బలగాలు ఆయన్ను అదుపులోకి తీసుకున్నాయి.

ఈ ఆపరేషన్‌లో మావోయిస్టు రీజినల్ కమిటీ సభ్యులు మోహనత్ అలియాస్ మొచ్చు, విభీషణ్ ముర్ము, గౌరవ్ అలియాస్ సౌరభ్‌లను కూడా అరెస్ట్ చేశారు. వీరిద్దరి తలపై చెరో రూ.15 లక్షల రివార్డు ఉంది.

ఈ ముగ్గురితో పాటు మరో ఇద్దరిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. వారికి మావోయిస్టు సంస్థతో ఉన్న సంబంధాలపై విచారణ కొనసాగుతోంది.

## అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు

**జోర్డాన్, జులై 29ః** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ పెరిగాయి. ఇరాన్ జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. అయితే, అమెరికా సెంట్రల్ కమాండ్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ దాడిని అమెరికా వైమానిక రక్షణ వ్యవస్థలు విజయవంతంగా తిప్పికొట్టాయి. అమెరికా



కాలమానం ప్రకారం మంగళవారం సాయంత్రం 5:45 గంటలకు ఇరాన్ భూభాగం నుంచి ఈ క్షిపణులను ప్రయోగించినట్లు CENTCOM వెల్లడించింది.

## ఖాకీలకు ఎంత ధైర్యం..?

- ఎస్.ఎఫ్.ఐ నేత అక్రమ అరెస్టుకు యత్నం
- అడ్డుకున్న ఎంపీ జాన్ బ్రిట్టాస్, ఇతర నేతలు
- విఫలమైన కేంద్రం కుయుక్తులు
- తిప్పికొట్టిన యువజన, విద్యార్థులు

**న్యూఢిల్లీ, జులై 29 (ఎ.ఎం.ఎస్)ః** జాతీయ పార్టీ సీపీఐ(ఎం) కేంద్ర కార్యాలయంలోకి పోలీసులు చొరబడ్డారు. ఎటువంటి అనుమతి తీసుకోకుండా ఎస్ఎఫ్ఐ నేతను అక్రమంగా అరెస్టు చేసేందుకు యత్నించారు. అయితే సీపీఐ(ఎం) రాజ్యసభ ఎంపీ జాన్ బ్రిట్టాస్, ఇతర నేతలు పోలీసులను అడ్డుకున్నారు. ప్రయివేట్ వాహనాల్లో వచ్చి సివిల్ డ్రస్‌లతో చొరబడ్డారు. అయితే సీపీఐ(ఎం) నేతలు అడ్డుకోవడంతో వెనుతిరిగారు. ఢిల్లీ యువజన ఉద్యమంలో ముందుండి పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ అఖిల భారత సంయుక్త కార్యదర్శి, జేఎన్‌యూ ఎస్‌యూ మాజీ అధ్యక్షురాలు ఐషీ ఘోష్‌ను సీపీఐ (ఎం) కేంద్ర కార్యాలయం (ఏకేజీ భవన్) నుంచి అక్రమంగా అరెస్టు చేసి జైలులో పెట్టాలన్న కేంద్ర ప్రభుత్వ చర్య విఫలమైంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఉద్యమకారులపై ఉక్కుపాదం మోపేందుకు, బలవంతపు చర్యలు చేపట్టేందుకు మోడీ ప్రభుత్వం సిద్ధపడింది. అందులో భాగంగానే మోడీ ప్రభుత్వ ఆదేశాల మేరకు, ఐదేండ్ల నాటి కేసులో కొన్ని నెలల క్రితం పాటియాలా హౌస్ కోర్టు జారీ చేసిన నాన్‌బెయిలబుల్ వారెంట్ కింద ఐషీ ఘోష్‌ను అరెస్టు చేయడానికి ఢిల్లీ పోలీసులు ప్రయత్నించారు. జంతర్ మంతర్ ఉద్యమానికి సంబంధించి యువతను అరెస్టు చేయకూడదని సుప్రీంకోర్టు ఆదేశించినందున, పాత కేసు నమోదు చేసి ఐషీఘోష్‌ను తీహార్ జైలులో పెట్టాలని కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు, యూనిఫాం, నేమ్‌ప్లేట్ లేని అధికారి నేతృత్వంలో ప్రయివేట్ వాహనంలో వచ్చిన పోలీసులను ఎంపీలు, పార్టీ కార్యకర్తలు అడ్డుకున్నారు. నిబంధనలు పాటించకుండా జాతీయ పార్టీ కేంద్ర కార్యాలయంలోకి చొరబడే అధికారం పోలీసు అధికారులకు ఎవరు ఇచ్చారని సీపీఐ(ఎం) రాజ్యసభ నాయకుడు జాన్ బ్రిట్టాస్ ప్రశ్నించారు. కోర్టు ఉత్తర్వును అమలు చేయడానికి వచ్చానని చెప్పిన అధికారిని, జాన్ బ్రిట్టాస్ తన యూనిఫాం, నేమ్‌ప్లేట్ ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించారు. వర్షం, రద్దీ కారణంగా తాను యూనిఫాం ధరించలేదని ఆమె చెప్పింది. అయినప్పటికీ, యూనిఫాంలో వచ్చి, నిర్దేశించిన పద్ధతులను పాటించాలని ఆమెకు సూచించారు. దీంతో, ఆ అధికారి, ఆమెతో ఉన్న పోలీసు అధికారులు ఇబ్బందిగా తిరిగి వెళ్లారు. ఐషీ ఘోష్‌ని అరెస్టు చేయడానికి పోలీసులు వచ్చారన్న వార్త విన్న తరువాత, ఢిల్లీలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, పార్టీ కార్యకర్తలు ఏకేజీ భవన్‌కు తరలివచ్చారు. సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, ఇతర నాయకులు కూడా వెంటనే పార్టీ కేంద్ర కార్యాలయానికి చేరుకున్నారు.2021లో బంగ్లా భవన్‌కు విద్యార్థులు నిర్వహించిన మార్చ్‌కు సంబంధించిన కేసులో, ఏప్రిల్ 15న పాటియాలా హౌస్ కోర్టు ఐషీ ఘోష్‌పై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. నెలలు గడిచినా, ఈ విషయమై ఆమెకు ఎలాంటి సమన్లు లేదా నోటీసులు అందలేదు. గురువారం కోర్టు ఈ కేసును మళ్లీ విచారించాల్సి ఉండగా, మంగళవారం ఉదయం ఢిల్లీ పోలీసులు ఆమెకు ఫోన్ చేసి వారెంట్ గురించి తెలియజేశారు. మరుసటి రోజు కేసు విచారణకు హాజరైనప్పుడు తాను హాజరవుతానని, బెయిలు లేని వారెంట్‌ను ఉపసంహరించుకోవాలని వెంటనే దరఖాస్తు చేసుకుంటానని ఐషీఘోష్ బదులిచ్చారు.

## ఫ్రాన్స్, స్పెయిన్ సరిహద్దుల్లో కార్చిచ్చు



**పారిస్, జులై 29ః** ఫ్రాన్స్, స్పెయిన్ సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో కార్చిచ్చు విధ్వంసం సృష్టిస్తోంది. ఫ్రాన్స్‌లో 420 చదరపు కిలోమీటర్లకుపైగా, స్పెయిన్‌లో 1,25,000 ఎకరాలకుపైగా అటవీ ప్రాంతం అగ్నికి ఆహుతైంది.

గిరాండ్ ప్రాంతంలో కోట్ల విలువచేసే 240కి పైగా విలాసవంతమైన ఇళ్లు కాలి బూడిదయ్యాయి.

యూరోపియన్ యూనియన్ అధికారులు నవంబర్ మొదటి వారం వరకు కార్చిచ్చు కొనసాగవచ్చని హెచ్చరించారు. ఉష్ణోగ్రతలు పెరగడంతో ఫ్రాన్స్, స్పెయిన్, గ్రీస్‌లలో ప్రమాదం పెరిగే అవకాశం ఉంది.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత- కలెక్టర్

**హనుమకొండ, జూలై 29 (వుదయం జిల్లా ప్రతినిధి):**



పర్యావరణ సమతుల్యత మరియు జీవ వైవిధ్య పరిరక్షణకు వన్యప్రాణులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పిలుపునిచ్చారు. బుధవారం హంటర్ రోడ్డులోని కాకతీయ జూ పార్కులో జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'అంతర్జాతీయ పులుల దినోత్సవం' కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అడవుల పరిరక్షణలో పులుల పాత్ర కీలకమైనదని, అటవీశాఖ కఠిన చర్యల వల్ల దేశంలో పులుల సంఖ్య పెరుగుతుండటం శుభపరిణామమని అన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే ప్రకృతి, వన్యప్రాణుల పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. జిల్లా అటవీశాఖ అధికారి ముకుంద రెడ్డి మాట్లాడుతూ, అంతరించిపోతున్న వన్యప్రాణులను కాపాడుకోవడానికి సమాజంలో విస్తృత అవగాహన అవసరమని తెలిపారు. అనంతరం వన్యప్రాణుల సంరక్షణ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్, అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్వోలు మయూరి, శిరీష, శ్రీనివాస్, ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ ప్రతినిధి శ్యామ్ సుందర్, అటవీ శాఖ సిబ్బంది, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**చీకుపల్లి–పెద్దగొల్లగూడెం ఇసుక వాగు రోడ్డు పరిస్థితి పరిశీలన**

**– జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

**ములుగు, జూలై 29 (వుదయం ప్రతినిధి) :**



జిల్లా లో మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ రావు తెలిపారు.బుధవారం వాజేడు మండలం చీకుపల్లి–పెద్దగొల్లగూడెం ఇసుక వాగు డైవర్షన్ రోడ్డు పరిస్థితిని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ రావు పరిశీలించి ప్రత్యామ్నాయ రహదారి పునరుద్ధరణకు తక్షణ చర్యలు చేపట్టాలని సంబధిత అధికారులను ఆదేశించారు.వాజేడు మండలాల పరిధిలో చీకుపల్లి–పెద్దగొల్లగూడెం గ్రామాల మధ్య ఇసుకవాగుపై నిర్మాణంలో ఉన్న వంతెన వద్ద ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు వరద నీరు రావడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు దెబ్బ తినడంతో తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను అనుసంధానించే జాతీయ రహదారి–163పై వాహనాల రాకపోకలు తాత్కాలికంగా నిలపడం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు వరద ప్రవాహం తగ్గిన అనంతరం ప్రత్యామ్నాయ రహదారిని అత్యవసరంగా పునరుద్ధరించి రాకపోకలను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రమాదాలు జరగకుండా పోలీస్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖలు సమన్వయంతో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.ప్రస్తుత వరద ఉధృతి అధికంగా ఉండటంతో పైపుల దెబ్బతినకుండా డైవర్షన్ రోడ్డుకు ఇరువైపులా కాల్వలు తవ్వి నీటిని మళ్లిస్తున్నట్లు తెలిపారు. వరద ప్రవాహం తగ్గిన వెంటనే రోడ్డును తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ లెనిన్ వత్సల్ టోప్పో, ఏటూరు నాగారం ఏ ఎస్పీ మనన్ భట్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కొండా కృపాకర్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రానున్న రెండు రోజులు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక: కలెక్టర్**

**జయశంకర్ భూపాలపల్లి జులై 29(వుదయం జిల్లా ప్రతినిధి):**



వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు రానున్న రెండు రోజులు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఇంటి నుండి బయటకు రావొద్దని, అత్యవసర అవసరాల కోసం వస్తే తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని, ఉధృతంగా ప్రవహించే వాగులు, వంకలు, చెరువులు, కల్వర్టుల వద్దకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లకూడదని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు కలెక్టరేట్‌లో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.హెల్ప్‌లైన్ నంబర్ 9030632608 అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ఈ నంబర్‌కు సంప్రదించి ప్రభుత్వ సహాయాన్ని పొందవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. వర్షాలకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు అత్యవసర సేవలకు అవసరమైన సహాయం అందించాలని ఆయన సూచించారు.ప్రజల భద్రత ముఖ్యమని, అందరూ జాగ్రత్తలు పాటిస్తూ అధికారులకు సహకరించాలని ప్రజలకు జిల్లా కలెక్టర్ సూచించారు.

## ఖమ్మం జిల్లా పర్యటనకు విచ్చేసిన జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాకు ఘన స్వాగతం

**పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికిన కలెక్టర్**

**ఎన్ఎస్పీ అతిథి గృహంలో పోలీస్ గౌరవ వందనం**

**స్వీకరించిన లెఫ్టినెంట్ గవర్నర్**

**ఖమ్మం, వుదయం బ్యూరో జూలై - 29**



జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనకు విచ్చేశారు. జిల్లా పర్యటన సందర్భంగా ఎన్ఎస్పీ అతిథి గృహానికి చేరుకున్న లెఫ్టినెంట్ గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఘనంగా స్వాగతం పలికారు. పుష్ప గుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా ఆహ్వానించిన కలెక్టర్, అధికారుల తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్ఎస్పీ అతిథి గృహం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీస్ అధికారుల గౌరవ వందనాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్ లతో పాటు పలువురు జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు లెఫ్టినెంట్ గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన లెఫ్టినెంట్ గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఖమ్మం జిల్లా సమగ్ర అభివృద్ధిపై విస్తృతంగా వివరించారు. జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, వ్యవసాయ అభివృద్ధి, పారిశ్రామిక పురోగతి, సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం, మౌళిక సదుపాయాల విస్తరణ, గ్రామీణ, పట్టణాభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహం తదితర అంశాలపై వివరించారు. అదేవిధంగా జిల్లా భౌగోళిక స్వరూపం, సహజ వనరులు, సాంస్కృతిక వారసత్వం, పారిశ్రామిక అవకాశాలు, ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల అమలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని కలెక్టర్ వివరించారు.

## క్షేత్రస్థాయి సమన్వయంపై బీఎల్ఏలకు పలు మార్గదర్శకాలు: ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**తొర్రూరు, జూలై 29( వుదయం ప్రతినిధి):**



పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తొర్రూరు మండల, పట్టణ బూత్ లెవల్ ఏజెంట్ల (BLA)తో పాలకుర్తి శాసన సభ్యురాలు శ్రీమతి యశశ్విని రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. బూత్ స్థాయిలో పార్టీ బలోపేతం, ఓటరు జాబితా సవరణలు, క్షేత్రస్థాయి సమన్వయంపై బీఎల్ఏలకు పలు మార్గదర్శకాలు అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి బూత్‌లో పార్టీ కార్యకలాపాలను మరింత చురుగ్గా నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఓటరు జాబితాలో కొత్తగా అర్హత పొందిన వారి పేర్లు నమోదు చేయడం, తప్పులను సరిదిద్దడం, మార్పులు, చేర్పులను సకాలంలో పూర్తి చేయాలనిఆదేశించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, వారి సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. బీఎల్ఏలు పార్టీకి వెన్నెముకలుగా పని చేస్తూ ప్రతి బూత్‌లో ముందుకు సాగాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

## ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలి: జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్




**మహాదేవపూర్/జయశంకర్ భూపాలపల్లి జులై 29 (వుదయం ప్రతినిధి)**

ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి నిస్పాక్షికంగా సేవలు అందించాలి అని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం జిల్లా జిల్లా మహాదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు. పోలీస్ వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలు, కేసుల దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలను నాట్యారు పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు రోడ్డు ప్రమాద కేసులకు సంబంధించిన వాహనాల స్థితిగతులు, వాటి పరిష్కార పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు రిసెప్షన్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అందిన ప్రతి ఫిర్యాదును వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల పురోగతిని సమీక్షించి దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.అదేవిధంగా స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధి నిర్వహణ, కేసు రికార్డుల నవీకరణ విధానాన్ని పరిశీలించి, అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ నిర్వహించాలని ఆదేశించారు. రౌడీ షీటర్లపై తీసుకుంటున్న చర్యలను సమీక్షించి, వారిపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి పౌరుడికి స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తూ, వారి సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించే విధంగా సేవలు అందించాలని అధికారులు, సిబ్బందికి ఆదేశించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం మరింత పెంపొందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ వార్షిక తనిఖీలలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, మహాదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సాంబమూర్తి తదితర అధికారులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇష్టం తో చదవండి

**ఎంతటి లక్ష్యం అయినా చిన్నదవు తుంది**

**ఏకలవ్య విద్యార్థులకు యంఎల్ఎ సూచన**



**చర్ల/భద్రాచలం, జూలై 29: (వుదయం ప్రతినిధి)**

భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు చర్ల మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించిన ఆయన, జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివితే తప్పకుండా విజయాన్ని సాధించవచ్చని సూచించారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివి వైద్య విద్యను అభ్యసించి డాక్టర్‌గా ఎదిగానని, అనంతరం ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని విద్యార్థులకు వివరించారు. లక్ష్యసాధనలో క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమ ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. అనంతరం పాఠశాల భోజనశాలను పరిశీలించిన ఎమ్మెల్యే, విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలో ఉన్న మౌలిక వసతులు, విద్యా బోధన, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. ఉపాధ్యాయులతో సమావేశమైన ఎమ్మెల్యే, పాఠశాలకు సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచిస్తూ, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చర్ల సీఐ రాజ్ వర్మ, ఎస్సై నరసింహారెడ్డి, డిసిసి ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళీకృష్ణ, అరవింద్, పుల్లారావు, రాయుడు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చెన్నారావుపేట ఉద్యమకారుల ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది కోలుకోవాలని శివాలయంలో ప్రత్యేక పూజలు



**చెన్నారావుపేట జూలై. 29 (వుదయం ప్రతినిధి)**

చెన్నారావుపేట మండల కేంద్రంలోని ఇటీవల అకస్మాత్తుగా గుండెపోటుతో బాధపడుతున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి యశోద హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న తరుణంలో వారి ఆరోగ్యం నిలకడగా ఉండి వీలైనంత త్వరగా కోలుకొని మళ్లీ నియోజకవర్గ ప్రజల మధ్యలోకి వచ్చి వారి సేవలను అందించాలని ఆకాంక్షిస్తూ చెన్నారావుపేట మండల ఉద్యమకారుల ఆధ్వర్యంలో చెన్నారావుపేట గ్రామ శివాలయంలో పెద్ది సుదర్శన్ రెడ్డి కోలుకోవాలని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ మాజీ శాసనసభ్యులు పెద్ది నర్సంపేట నియోజకవర్గంలో అనేక సంక్షేమ పథకాలు మరియు మెడికల్ కాలేజ్ గోదావరి జలాలు నర్సంపేటకు రప్పించడంలో ప్రధాన పాత్ర పోషించి నర్సంపేట రైతన్న అభివృద్ధి పథంలో నడిపించి ఎన్నో పథకాలను రూపకల్పన చేసి నర్సంపేట నియోజకవర్గ ప్రజలను అభివృద్ధి పరచడంలో ముందున్న పెద్ది గారు ఈనాడు ఇలాంటి పరిస్థితుల్లో ఉండడం చాలా బాధాకరం ప్రజల మనసును గెలిచిన పెద్ది సుదర్శన్ రెడ్డి గారు ప్రజల ఆశీర్వాదంతో తిరిగి కోలుకొని మళ్లీ ప్రజల మధ్యలోకి విచ్చేసి వారి సేవలను ప్రజలకు అందించాలని మనస్ఫూర్తిగా ఆ భగవంతున్ని కోరుకుంటూ అతి త్వరగా పెద్ది సుదర్శన్ రెడ్డి గారు ఆయన ఆయురారోగ్యంతో తిరిగి రావాలని ప్రత్యేక పూజలు మృత్యు నివారణ పూజలను నిర్వహించడం జరిగింది. ఈ పూజలు నిర్వహించిన వారిలో తెలంగాణ ఉద్యమకారుల చెన్నారావుపేట నాయకులు మహమ్మద్రఫీ మూడు రమేష్ ఎడ్ల మల్లయ్య గట్ల కృష్ణయ్య కుసుమ నరేందర్ బానోత్ గణేష్ సాధు నర్సింగరావు కడగండ్ల యాకయ్య అజ్మీర రాజ్ కుమార్ బోద కల్పనఅరుణ్ కుమార్ నర్మెడి సాంబయ్య గట్ల రాంబాబు తదితరులు ఉన్నారు.

## ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం.. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**రాయపర్తి/ వరంగల్, జూలై 29 (వుదయం ప్రతినిధి) :**



ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే ప్రధాన లక్ష్యమని, అందుకు బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) బాధ్యతాయుతంగా పనిచేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాయపర్తి మండల బీఎల్ఏల పనితీరుపై బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదు అయ్యేలా ఇంటింటి సర్వేను క్షుణ్ణంగా నిర్వహించాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, పేర్లలో తప్పుల సవరణ, మార్పులు, చేర్పులు వంటి ప్రక్రియలను వేగవంతం చేసి, ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలతో నిరంతరం మమేకమై ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు, గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో బీఎల్ఏలు కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బ్లాక్ అధ్యక్షులు హమ్య నాయక్, మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి, మండల నాయకులు ఉల్లెంగల యాదగిరి, రెంటాల గోవర్ధన్ రెడ్డి, సర్పంచ్ పెదగొని నాగరాజ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల ప్రజాప్రతినిధులు, బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు, సంబంధిత నాయకులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ జనగామకు ఐదు స్థాయిల తనిఖీ వ్యవస్థ- కలెక్టర్

**జనగామ, జూలై 29 (వుదయం ప్రతినిధి) :**



జనగామ జిల్లాను పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ప్రజారోగ్యంలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన 'స్వచ్ఛ జనగామ' (SJ-SCORE) కార్యక్రమంలో పారదర్శకత కోసం ఐదు స్థాయిల తనిఖీ వ్యవస్థను (5-Level Scrutiny) ప్రవేశపెట్టినట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ప్రత్యేకంగా రూపొందించిన SJ-SCORE యాప్ ద్వారా క్షేత్రస్థాయి సమాచారాన్ని సేకరించి, గ్రామాల్లో క్రమబద్ధమైన పర్యవేక్షణ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.ఐదు స్థాయిల పర్యవేక్షణ: గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు బాధ్యతలను స్పష్టంగా విభజించారు. పంచాయతీ సిబ్బంది, కార్యదర్శులు, డివిజన్ అధికారుల నుంచి మండల ప్రత్యేక అధికారుల వరకు ప్రతినెల క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి నివేదికలు సమర్పిస్తారు. 100 మార్కుల మూల్యాంకనం: ఘన/ద్రవ వ్యర్థాల నిర్వహణ, రహదారుల పరిశుభ్రత, తాగునీరు, ODF, దోమల నివారణ, నిధుల వినియోగం వంటి అంశాల ఆధారంగా గ్రామాలకు 100 మార్కులకు గానూ మూల్యాంకనం చేస్తారు.గ్రామాలకు గ్రేడింగ్: మార్కుల ఆధారంగా 'A' (85+), 'B' (70-84), 'C' (55-69), 'D' (55 కంటే తక్కువ) గ్రేడ్లను కేటాయిస్తారు.'రెడ్ ఫ్లాగ్' నిబంధన: బహిరంగ మలవిసర్జన, తాగునీటి లీకేజీలు, మురుగు నిల్వ, కార్మికుల వేతనాల ఆలస్యం వంటి 10 రకాల తీవ్రమైన సమస్యలు ఏ గ్రామంలోనైనా గుర్తిస్తే.. మార్కులతో సంబంధం లేకుండా ఆ గ్రామానికి నేరుగా 'D' గ్రేడ్ ఇస్తారు. సమస్య పరిష్కారానికి 24 గంటల్లో కలెక్టర్‌కు నివేదించాల్సి ఉంటుంది.ఆకస్మిక తనిఖీలు & సమీక్ష: ప్రతి నెలా 25 నుండి 2వ తేదీ వరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, నెలాఖరు నివేదికల ఆధారంగా ప్రతి నెల 10వ తేదీన కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం జరుగుతుంది.యాప్ పిన్ గోప్యత, నివేదికల సమర్పణలో అధికారులు బాధ్యతాయుతంగా ఉండాలని, ఉల్లంఘనలపై కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు. నాణ్యమైన శిక్షణ, సమర్థవంతమైన పర్యవేక్షణతో "స్వచ్ఛ జనగామ – ఆరోగ్యకర జనగామ" లక్ష్యాన్ని సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

## PACS నూతన పాలకవర్గ సమావేశంలో పాల్గొన్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**యాదాద్రి భువనగిరి జిల్లా. తేదీ :29/07/2026**



వలిగొండ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (PACS) నూతన పాలకవర్గ సమావేశంలో భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పీఏసీఎస్ చైర్మన్‌గా శ్రీ గరిసె రవికి మండల ప్రజలు గొప్ప బాధ్యతను అప్పగించారని తెలిపారు. ప్రజలు, రైతులు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పదవికి గౌరవం తీసుకొచ్చేలా నూతన పాలకవర్గం బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. రైతుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పారదర్శకతతో, జవాబుదారీతనంతో సేవలందించాలని కోరారు. వలిగొండ మండల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే గారు తెలిపారు. సుమారు రూ.200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. గత 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అనేక అభివృద్ధి పనులను ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో చేపడుతూ, భువనగిరి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యేగా వలిగొండ మండల అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు, విద్య, వ్యవసాయం, సంక్షేమ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త గర్వంగా భావించేలా పనిచేస్తామని, కార్యకర్తల బలమే తమ బలమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ శ్రీ గరిసె రవి మాట్లాడుతూ, తమపై విశ్వాసం ఉంచి అవకాశం కల్పించిన ఎమ్మెల్యే శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ రైతుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామని పేర్కొన్నారు. రైతులకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందిస్తూ సహకార సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గ సభ్యులకు వలిగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ (AMC) చైర్మన్ శ్రీ భీమానాయక్, వలిగొండ గ్రామ సర్పంచ్ శ్రీ కుంభం వెంకటపాపిరెడ్డి, ఉపసర్పంచ్ మల్గ మాధవి , మండల కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ బత్తిని సహదేవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ పాశం సత్తిరెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీమతి పద్మ అనంతరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, సహకార సంఘ సభ్యులు, అధికారులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, రైతులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రతి విద్యార్థి రాణించినప్పుడే విద్యా వ్యవస్థకు సార్థకత – కలెక్టర్

**సూర్యాపేట, జూలై 29, వుదయం ప్రతినిధి**



సూర్యాపేట జిల్లాను విద్యా రంగంలో మరింత అగ్రపథాన నిలిపేందుకు ఉపాధ్యాయులు నడుం బిగించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు.బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లకు నిర్వహిస్తున్న మూడు రోజుల సమగ్ర వృత్త్యంతర శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు.పీజీఐలో సూర్యాపేటకు ప్రథమ స్థానంఈ సందర్భంగా మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరానికి గానూ పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో సూర్యాపేట జిల్లా ప్రదేశ్లో మొదటి స్థానాన్ని సాధించడం పట్ల కలెక్టర్ హర్షం వ్యక్తం చేస్తూ విద్యాశాఖ బృందాన్ని అభినందించారు. ఆ పాత పద్ధతులు వద్దు.. కొత్తగా బోధించండిప్రపంచీకరణ వేగంగా విస్తరిస్తున్న తరుణంలో విద్యార్థుల భవిష్యత్ అవసరాలను గుర్తించి తరగతి గది బోధన సాగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా.. కృత్యాధార బోధన, ప్రయోగాలు, ప్రాజెక్టులు, గ్రూప్ డిస్కషన్స్ ద్వారా విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌ను ఉపాధ్యాయులు సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ఆదేశించారు. చదువుతో పాటు విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి సాధించేలా పర్యవేక్షించడానికి ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.తోటలో అన్ని పూలూ వికసించాలి"ఒక తోటలోని కొన్ని మొక్కలు మాత్రమే పూలిస్తే ఆ తోటకు అందం రాదు. అన్ని మొక్కలూ పూలు పూసి వికసిస్తేనే ఆ శోభ" అని ఉదాహరణతో వివరించారు. క్లాస్ రూమ్‌లో కేవలం కొందరు విద్యార్థులు మాత్రమే కాకుండా, ప్రతి ఒక్కరూ రాణించి ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే విద్యా వ్యవస్థ అసలైన లక్ష్యం నెరవేరుతుందని స్పష్టం చేశారు.ప్రతి విద్యార్థి నైపుణ్యాలు సాధించేలా చూడాల్సిన పూర్తి బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని, సూర్యాపేట జిల్లాను విద్యారంగంలో మరింత మెరుగైన స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. పాల్గొన్నవారు ఈ కార్యక్రమంలో డీఈవో కే. అశోక్, సెక్టోరియల్ అధికారులు హరికృష్ణ, రేణుక, సెంటర్ ఇంచార్జ్ నాగరాణి, జిల్లా రిసోర్స్ పర్సన్లు శ్రీహరి, శ్రవణ్, సత్యనారాయణ రెడ్డి, యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియ 100 శాతం పూర్తి: కలెక్టర్ అభినందనలు



**కామారెడ్డి, జూలై 29 (వుదయం ప్రతినిధి):**

ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఎన్యూమరేషన్ ఫారమ్‌ల ప్రక్రియను 100 శాతం విజయవంతంగా పూర్తి చేసినందుకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సంబంధిత అధికారులను, సిబ్బందిని అభినందించారు. నియోజకవర్గంలో మొత్తం 2,28,503 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2,06,220 మంది (90.25 శాతం) ఈఎఫ్ఎస్ డిజిటైజేషన్ పూర్తి చేశారు. మిగిలిన 22,283 మంది (9.75 శాతం) ఓటర్లకు సంబంధించిన ఫారమ్‌లు అందుబాటులో లేకపోవడంతో "అన్‌కలెక్టెడ్ ఫార్మ్స్"గా నమోదు చేయడం ద్వారా మొత్తం 2,28,503 మంది ఓటర్లకు సంబంధించిన ప్రక్రియను 100 శాతం పూర్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, నిర్దేశిత గడువులో లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేయడం అభినందనీయమని అన్నారు. ఈ విజయానికి కృషి చేసిన ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, తహసీల్దార్లు, బీఎల్‌వోలు, సూపర్వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఎన్నికల ప్రక్రియలో నాణ్యతను, పారదర్శకతను కొనసాగిస్తూ భవిష్యత్‌లో కూడా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

## భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి. .కలెక్టర్

**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**



జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కె. హరిత ప్రజలను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వట్టివాగు ప్రాజెక్టుకు వరద ఉధృతి కారణంగా వట్టివాగు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది.ప్రస్తుతం వట్టివాగు లోకి 4,000 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, 2,000 క్యూసెక్కుల నీటిని దిగువకు (అవుట్ ఫ్లో) విడుదల చేయాలని నిర్ణయించామని వట్టివాగు పరివాహక లోతట్టు ప్రాంతాల ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ వాగులు, వంతెనలు దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. అత్యవసరం అయితే తప్ప ఎవరూ బయటకు రావద్దని స్పష్టం చేశారు, అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉన్నాయని ప్రజలకు సహాయం అందించేందుకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు.

## విపత్తుల సమయాలలో సమర్ధవంతంగా సేవలు అందించాలి

**అదనపు కలెక్టర్ భుజంగరావు**

**'ఆపద మిత్ర' వాలంటీర్లకు కిట్లు పంపిణీ**



**నిజామాబాద్, జూలై 29 :**

విపత్తులు సంభవించిన సమయాల్లో ఆపద మిత్ర వాలంటీర్లు తక్షణమే స్పందిస్తూ సహాయక చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ వి.భుజంగరావు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో బుధవారం ఆపద మిత్ర వాలంటీర్లకు కిట్లు పంపిణీ చేశారు. విపత్తుల సమయాలలో సహాయక చర్యలు చేపట్టేందుకు ఉపకరించే 14 రకాల వస్తువులతో కూడిన ఈ కిట్ ను ఎలా ఉపయోగించాలి అనే విషయాల గురించి ఎస్ డీ ఆర్ ఎఫ్ అధికారులు తెలియజేశారు. విపత్తులు సంభవించిన సమయాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఆస్తి, ప్రాణ నష్టాన్ని ఎలా నివారించాలి, అత్యవసర సమయాలలో ప్రాథమిక చికిత్స పద్ధతులు, సీ.పీ.ఆర్ చేసే విధానం, తదితర అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అదనపు కలెక్టర్ భుజంగరావు మాట్లాడుతూ, విపత్తులను నిలువరించే శక్తి ఎవరికీ ఉండదని, అయితే ముందస్తు సన్నద్ధతతో ప్రాణ, ఆస్తి నష్టాల్ని చాలా వరకు నివారించవచ్చని అన్నారు. ఈ దిశగా క్షేత్రస్థాయిలో ఉండే ఆపద మిత్ర వాలంటీర్లు విపత్తుల సమయాలలో సమర్ధవంతంగా సేవలు అందించాలని సూచించారు. ఇప్పటికే వాలంటీర్లకు ప్రకృతి వైపరీత్యాల సమయాలలో ఎలా వ్యవహరించాలి అనే అంశాలపై నిపుణుల ద్వారా శిక్షణ అందించామని గుర్తు చేశారు. నేర్చుకున్న అంశాలను విస్మరించకుండా ఆపద సమయాలలో ప్రజలకు సహాయకారులుగా నిలవాలని ఉద్బోధించారు. అదే సమయంలో స్వీయ రక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. జిల్లా రెవెన్యూ అధికారి గీత మాట్లాడుతూ, ఆపద సమయాలలో ప్రజలకు సహాయపడే అవకాశం లభించడాన్ని అదృష్టంగా భావించాలని అన్నారు. ఆపద మిత్ర నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి సాయన్న మాట్లాడుతూ, ఆపద మిత్ర వాలంటీర్లకు ప్రభుత్వం ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు గుర్తింపు కార్డులు, ఉపకరణాలతో కూడిన కిట్లు అందజేసిందని, బీమా సదుపాయం వర్తింపజేస్తుందని గుర్తు చేశారు. ఈ తోడ్పాటును సద్వినియోగం చేసుకుని సమర్ధవంతంగా సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ డీ-సెక్షన్ పర్యవేక్షకులు శ్రీనివాస్ రావు, ఆర్ఎస్ఐ శ్రీనివాస్, అగ్నిమాపక శాఖ, 7వ పోలీసు బెటాలియన్ అధికారులు, ఆపద మిత్ర వాలంటీర్లు పాల్గొన్నారు.

## వర్షపాతం వివరాలు ఖచ్చితత్వంతో ఎప్పటికప్పుడు నమోదు చేయాలి: కలెక్టర్

**నూతన కలెక్టర్ క్యాంపు కార్యాలయ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం**



**నిర్మల్ జిల్లా 29 జూలై 2026 (వుదయం ప్రతినిధి)**

జిల్లా వ్యాప్తంగా నమోదయ్యే వర్షపాతం వివరాలను ఖచ్చితత్వంతో ఎప్పటికప్పుడు నమోదు చేసి సంబంధిత శాఖలకు సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.బుధవారం పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భూగర్భ జలాల కొలతల కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షపాతం, భూగర్భ జలాల వివరాల నమోదు విధానాన్ని పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా వివరాలను నమోదు చేయాలని సూచించారు.అనంతరం నిర్మల్ గ్రామీణ మండలం అక్కాపూర్ గ్రామంలోని విద్యుత్ ఉపకేంద్రం ప్రాంగణంలో ఉన్న వర్షపాత మాపక కేంద్రంను తనిఖీ చేశారు. వర్షపాతం కొలత, నమోదుకు అనుసరిస్తున్న విధానం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షపాతం వివరాలను ఖచ్చితంగా నమోదు చేయడంతో పాటు సంబంధిత శాఖలకు వేగంగా చేరవేయాలని ఆదేశించారు. ప్రతి నమోదు శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.అనంతరం ఎల్లపల్లి సమీపంలోని నిర్మాణంలో ఉన్న నూతన కలెక్టర్ క్యాంపు కార్యాలయాన్ని పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి, పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే పూర్తయిన పనుల వివరాలను తెలుసుకుని, మిగిలిన పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ తనిఖీలలో సీపీవో గంగారెడ్డి, తహసిల్దార్ ప్రభాకర్, ఆర్ అండ్ బి ఈఈ సుభాష్, హైడ్రో జియాలజిస్ట్ వంశీకృష్ణ, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విధులకు ఆటంకం కలిగించిన వారిపై చర్యలు తీసుకోగలరు

**-మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ**



**మంచిర్యాల /రామకృష్ణాపూర్/జూలై 29 (వుదయం ప్రతినిధి)**

క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్ పర్సన్ భర్త, బిఆర్ఎస్ నాయకులు రాజా రమేష్ పై చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ కమిషనర్ మురళీకృష్ణ రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోలీస్ స్టేషన్ లో రాజా రమేష్ పై ఫిర్యాదు చేసిన అనంతరం మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ మాట్లాడుతూ రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా వర్షం పడుతున్న నేపథ్యంలో స్థానిక ఒకటవ వార్డులలో తిరుగుతున్న సందర్భంగా చైర్ పర్సన్ భర్త రాజా రమేష్ దుర్భాషలాడుతూ మాకు తెలియకుండా వార్డులలో ఎలా తిరుగుతావు అంటూ బెదిరింపులకు గురి చేశారని అన్నారు. చైర్ పర్సన్ భర్త రాజా రమేష్ తానే చైర్ పర్సన్ అనే విధంగా వ్యవహరిస్తూ విధులలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులను అవమానించే విధంగా మాట్లాడారని మా విధులకు ఆటంకం కలిగించినందుకు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో అత్యవసర సేవలలో వార్డులలో తిరుగుతున్న మమ్మల్ని ఈ విధంగా అవమానించడం సరికాదని అన్నారు. బిఆర్ఎస్ నాయకులు రాజా రమేష్, రామిడి కుమార్ లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు.

## హెచ్ఐవి/ఎయిడ్స్ నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో చర్యలు-కలెక్టర్



**మంచిర్యాల/జూలై 29 (వుదయం ప్రతినిధి)**

జిల్లాలో హెచ్ఐవి / ఎయిడ్స్ నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో నిర్వహించిన జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ కమిటీ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేంద్ర రాథోడ్, ఎయిడ్స్ కోఆర్డినేటర్ నీలిమ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్ఐవి / ఎయిడ్స్ నివారణ, నియంత్రణ చర్యలను మరింత పటిష్టం చేసి, జిల్లాలో స్క్రీనింగ్ సేవలను విస్తృత స్థాయిలో నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో బహుళ రంగాల కార్యాచరణ వ్యూహం లక్ష్యాలను డిసెంబర్ 2026 నాటికి పూర్తి చేయాలని సూచించారు. చికిత్స పరిధిలోకి రాని హెచ్ఐవి పాజిటివ్ వ్యక్తులను గుర్తించేందుకు ప్రత్యేక స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించడంతో పాటు, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన బహిరంగ ప్రదేశాలలో స్వీయ ప్రమాద అంచనా క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేసి స్వచ్ఛంద పరీక్షలను ప్రోత్సహించాలని, తద్వారా ప్రజలు ప్రమాదాన్ని అంచనా వేసుకుని సమీపంలోని పరీక్షా కేంద్రాలకు స్వయంగా వెళ్తారని తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, మున్సిపల్ కార్మికులు, అధిక ప్రమాదం ఉన్న కార్మిక వర్గాల కోసం ప్రత్యేక ఆరోగ్య, హెచ్ఐవి స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించాలని సూచించారు. సామాజిక సంరక్షణ, మద్దతు, భద్రత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. హెచ్ఐవి బాధితుల సంక్షేమానికి సంబంధించి అర్హులైన లబ్ధిదారులు సంబంధిత ఆన్‌లైన్ పోర్టల్‌ల ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు. ఎయిడ్స్ బాధితుల సహాయార్థం, ప్రజల సౌకర్యం కొరకు టోల్ ఫ్రీ నంబర్ 1097 ఏర్పాటు చేయడం జరిగిందని, సందేహాల నివృత్తి, సమాచారం కొరకు సంప్రదించవచ్చని తెలిపారు. అనంతరం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి జిల్లాలో హెచ్ఐవి నియంత్రణ చర్యల పురోగతిని వివరించారు. మారుమూల ప్రాంతాల ప్రజలకు సేవలు మరింత చేరువయ్యేలా చెన్నూర్ లో నూతన ఐసీటీసీ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.ఈ సమావేశంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఐసీటీసీ కౌన్సిలర్లు, లింక్ ఆర్ట్ సెంటర్ సిబ్బంది, హెచ్ఐవి పాజిటివ్ నెట్‌వర్క్ ప్రతినిధులు పాల్గొన్నారు

## విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యం- కలెక్టర్



**ఆదిలాబాదు :**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం స్థానిక సరస్వతినగర్ లోనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బోధనా సామర్థ్యాల పెంపు, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కో-పైలట్ సాఫ్ట్‌వేర్ వినియోగం, పాఠశాలలు, రికార్డుల నిర్వహణ, విద్యార్థుల హాజరు శాతం పెంపు, విద్యా సంవత్సర ప్రణాళికలపై విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లు, కేజీబీవీ సమన్వయకర్తలతో నిర్వహించిన 3 రోజుల శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడం, విద్యార్థుల్లో ప్రాథమిక భాషా, గణిత సామర్థ్యాలను (ఎఫ్ఎల్ఎన్) మెరుగుపరచడమే ప్రధాన లక్ష్యంగా విద్యాశాఖ యంత్రాంగం పనిచేయాలని ఆదేశించారు. పాఠశాలల పనితీరు, ప్రగతిని అంచనా వేసేందుకు 'యు-డైస్ ప్లస్' ప్రామాణికంగా నిలుస్తుందని, దీని ఆధారంగానే పీజీఆర్ఐ ర్యాంకింగ్స్ నిర్ణయమవుతాయని స్పష్టం చేశారు. జిల్లాలోని 176 ఎఫ్ఎల్ఎన్ సామర్థ్య పాఠశాలలు, 133 ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు ద్వారా మౌలిక బోధన సరైన రీతిలో అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు అమలు చేయాలని పిలుపునిచ్చారు. బోధనలో ఉపాధ్యాయులు కృత్రిమ మేధ, 'శిక్షా కో-పైలట్' వంటి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పాఠ్యాంశ ప్రణాళికలు, ఇంటరాక్టివ్ ప్రజెంటేషన్లు తయారు చేయాలని సూచించారు. విద్యార్థుల్లో ఆంగ్ల సంభాషణ నైపుణ్యాలను పెంపొందించేందుకు 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక స్పోకెన్ ఇంగ్లీష్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పాఠశాల, మండల, జిల్లా స్థాయిల్లో ప్రతి నెల 'స్పోకెన్ ఇంగ్లీష్ ఛాంపియన్షిప్' పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. ఈ ఏడాది జిల్లా నుంచి ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో అత్యధికంగా 65 కి పైగా సీట్లు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఇదే స్ఫూర్తితో గురుకులాలు, సీఓఈలలో గరిష్ఠ సంఖ్యలో సీట్లు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. మౌలిక సదుపాయాలు కొరత లేకుండా పరిశీలిస్తామని, సమస్యలుంటే దృష్టికి తీసుకురావలన్నారు.అనంతరం శిక్షణను విజయవంతంగా నిర్వహించిన జిల్లా రిసోర్స్ పర్సన్లు దేవదాస్, రఘునాథ్ లను ముఖ్య అతిథులు ప్రత్యేకంగా సన్మానించారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, అకడమిక్ మోనిటరింగ్ ఆఫీసర్ లక్ష్మణ్, జీసిడిఓ, ఎంఈఓలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, వివిధ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పొంగిన వాగులు వంకలు

**ధర్మపురికి స్తంభించిన రాక పోకలు**

**అక్సాయ్‌పల్లె,అనంతారం వద్ద రోడ్లపైకి చేరిన వరద నీరు**

**నేరేళ్ల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసిన పోలీసులు**

**జలమయమైన లోతట్టు ప్రాంతాలు**



**ధర్మపురి,జులై 29 (వుదయం ప్రతినిధి):**

ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు,వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో జిల్లా కేంద్రమైన జగిత్యాల నుంచి ప్రముఖ పుణ్య క్షేత్రమైన ధర్మపురి మధ్య వాహనాల రాకపోకలు పూర్తిగాస్తంభించిపోయాయి. ధర్మపురి మండల పరిధిలోని అక్సాయ్‌పల్లె పసుల పాపన్న గుట్ట వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.మరో వైపు అనంతారం వాగు కూడా పొంగి పొర్లుతుండటంతో ప్రధాన రహదారిపై వరద నీరు చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న సీఐ రాం నర్సింహారెడ్డి, ఎస్సైలు మహేష్, రవీందర్, పోలీస్ సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి పరిస్థితిని నిరంతరంసమీక్షిస్తున్నారు.వరద ఉధృతి పెరగడంతో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ధర్మపురి మండలం నేరేళ్ల వద్ద వాహనాల రాకపోకలను నిలిపివేస్తూ బారికేడ్లను ఏర్పాటు చేశారు. వరద ప్రవాహం తగ్గేవరకు ఎవరూ వాగులు దాటే సాహసం చేయవద్దని, అత్యవసరమైతేనే తప్ప బయటకు వెళ్లరాదని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. తెరిపిలేకుండా కురుస్తున్న వానలతో పలు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

## శ్రీ రామలింగేశ్వర ఆలయంలో శంకర భగవత్పాదులకు గురుపౌర్ణమి విశేష పూజలు




**ధర్మపురి జులై 29(వుదయం ప్రతినిధి):**

గురుపౌర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీలక్ష్మి నరసింహా స్వామి అనుబంధ దేవాలయమైన శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థాన ప్రాంగణంలో వేడుకలు వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయంలో వెలసిన ఆదిశంకరాచార్యుల వారి విగ్రహానికి వేద పండితులు పాలేపు.ప్రవీణ్ కుమార్ శర్మ రుద్ర నమక చమక పారాయణాల నడుమ క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేష పూజలు, దివ్య మంగళ హారతి సమర్పించి మంత్రపుష్పం నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ అల్వాల శ్రీనివాస్, ఓంకార శర్మ, అభిషేకం పురోహితులు బొజ్జా రాజగోపాల్ శర్మ, ఆలయ సిబ్బంది, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

## జిల్లాను విద్యలో అగ్రగామిగా నిలపాలి

**-- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**-- పీజీఐ సూచీలపై విద్యాశాఖ అధికారులతో సమీక్ష**

**--నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి**

**-- ప్రతి 15 రోజులకు హెచ్ఎంలు, ఎంఈఓలతో సమీక్షించాలని ఆదేశం**




**రాజన్న సిరిసిల్ల, జూలై 29 (వుదయం ప్రతినిధి):**

విద్యారంగంలో రాజన్న సిరిసిల్ల జిల్లాను రాష్ట్రంలోనే అత్యుత్తమ జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. పీజీఐ (పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్)తో పాటు విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లా విద్యాధికారి మొండయ్యతో కలిసి పీజీఐ పురోగతి, పాఠశాలల పనితీరు, మౌలిక వసతులు, విద్యా నాణ్యతపై సమీక్షించారు.ప్రతి 15 రోజులకు ఒకసారి మండలాల వారీగా ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులతో సమావేశాలు నిర్వహించి పాఠశాలల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులకు పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుడు అంకితభావంతో పనిచేసి జిల్లాను విద్యారంగంలో అత్యుత్తమ స్థానంలో నిలపాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, కోఆర్డినేటర్లు సతీష్, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి...

**అధికారులు ప్రధాన కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలి...**

**గోదావరి పరీవాహక మండలాల్లో ప్రత్యేక అప్రమత్తత అవసరం...**

**పునరావాస కేంద్రాలు అన్ని వసతులతో సిద్ధంగా ఉంచాలి...**

**ప్రజల ప్రాణ ఆస్తి రక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలి...**

**భారీ వర్షాల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో పర్యటించిన జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్**

**జగిత్యాల జులై 29 (వుదయం ప్రతినిధి)**

జిల్లాలో భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ ఆదేశించారు జగిత్యాల జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ బుధవారం క్షేత్ర స్థాయిలో పర్యటించి అధికారులకు పలు సూచనలు చేశారు జగిత్యాల రూరల్ మండలం అనంతరం గొల్లపేట లో



ధర్మపురి మండలం నేరెళ్ల ఆక్సాయిపల్లి గ్రామాల పరిధిలో గల లో లెవల్ వంతెనల పై నుండి వరద నీరు ప్రవహిస్తున్నందున వరద పరిస్థితి ని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ పరిశీలించారు అనంతరం జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా అధికారులు తహసీల్దార్లు ఎంపీడీఓలు మున్సిపల్ కమిషనర్లు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు అన్ని శాఖల అధికారులు తమ ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండాలని ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయాలను విడిచి వెళ్లరాదని కలెక్టర్ స్పష్టం చేశారు వర్షాల కారణంగా ఎటువంటి సంఘటనలు నష్టాలు నీటి ముంపు ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినా వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని తీసుకున్న చర్యలను ఆలస్యం చేయకుండా జిల్లా కంట్రోల్ రూమ్‌తో పాటు జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలని ఆదేశించారు. ముఖ్యంగా గోదావరి పరివాహక ప్రాంత మండలాల అధికారులు ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని, 1 తరచూ క్షేత్ర.స్థాయిలో పర్యటిస్తూ గోదావరి నీటి మట్టాన్ని నిరంతరం పరిశీలించాలని సూచించారు.

ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న గ్రామాలు కాలనీలను ముందుగానే గుర్తించి ఎలాంటి ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్లు పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీల్లో ఏర్పడి న అడ్డంకులను వెంటనే తొలగించి వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో నీటిముంపు సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన సిబ్బంది యంత్ర సామగ్రిని సిద్ధంగా ఉంచాలని సూచించారు అదే విధంగా తహసీల్దార్లు ఎంపీడీఓలు తమ పరిధిలో ప్రత్యామ్నాయ పునరావాస కేంద్రాలను గుర్తించి తాగునీరు విద్యుత్ పారిశుద్ధ్యం ఆహారం తదితర మౌలిక వసతులతో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు అన్ని శాఖల అధికారులు జిల్లా యంత్రాంగంతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తూ 24 గంటలూ పరిస్థితిని పర్యవేక్షించాలని ప్రజల ప్రాణాలు ఆస్తుల రక్షణే అత్యంత ప్రాధాన్యతగా భావించి వేగవంతంగా సమర్థవంతంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఈ పర్యటనలో కలెక్టర్ బి సత్యప్రసాద్ తో పాటు జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ జగిత్యాల రూరల్ తహసిల్దార్ హకీం ధర్మపురి తాసిల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## గొడుగు గేరి హనుమాన్ మందిరంలో ఘనంగా మహర్షి జన్మదిన వేడుకలు

**నారాయణపేట, జూలై 29 (వుదయం ప్రతినిధి):**

స్థానిక గొడుగు గేరి అభయాంజనేయ స్వామి ఆలయంలో గురు పౌర్ణమి సందర్భంగా వేద వ్యాస మహర్షి జన్మదిన వేడుకలను బుధవారం ముదిరాజ్ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద వ్యాస మహర్షి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా గురు పౌర్ణమి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ ఆషాఢ మాస శుద్ధ పౌర్ణమిని గురు పౌర్ణమి లేదా వ్యాస పౌర్ణమి అని ఎంతో పవిత్రంగా జరుపుకుంటారని ఇందులో భాగంగా స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో వేద వ్యాస మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా వేడుకలు జరుపుకుంటున్నట్లు వారు తెలిపారు. అజ్ఞానమనే అంధకారాన్ని తొలగించి, జ్ఞానమనే వెలుగును ప్రసాదించే గురువులను పూజించడానికి కేటాయించిన విశిష్టమైన రోజు ఇది
వ్యాస పౌర్ణమి అని అంటారని వారు గుర్తు చేశారు.

సనాతన ధర్మానికి మూలపురుషుడైన వేదవ్యాస మహర్షి ఈ ఆషాఢ పౌర్ణమి నాడే జన్మించారన్నారు.

మానవాళి సంక్షేమం కోసం ఒకే రూపంలో ఉన్న వేదాలను ఆయన నాలుగు భాగాలుగా ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదంగా విభజించారు. పంచమ వేదంగా పిలవబడే మహాభారతంతో పాటు, 18 పురాణాలను, ఉపపురాణాలను లోకానికి అందించిన జగద్గురువు ఆయన. అందుకే ఈ రోజును ఆయన జ్ఞాపకార్థం వ్యాస పౌర్ణమి గా పిలుస్తారన్నారు.వ్యాస మహర్షిని మానవాళికి ఆదిగురువుగా భావిస్తారు. ఆయనతో ప్రారంభమైన గురు పరంపరకు ఈ రోజు కృతజ్ఞతలు తెలుపుకుంటారు.సృష్టిలో మొదటి గురువైన పరమశివుడు దక్షిణామూర్తి రూపంలో తన సప్తర్షులకు జ్ఞానబోధ ప్రారంభించిన రోజు కూడా ఇదే అన్నారు. గౌతమ బుద్ధుడు జ్ఞానోదయం పొందిన తర్వాత తన మొదటి ధర్మబోధను ధర్మచక్ర ప్రవర్తనం ఈ ఆషాఢ పౌర్ణమి నాడే శిష్యులకు ఉపదేశించినట్లు వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఓటరు నమోదులో ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి

- **ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి**
- **జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**

**నాగర్ కర్నూల్, జులై 29 (వుదయం ప్రతినిధి) :**

ఓటరు జాబితా రూపకల్పనలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు.ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియ పురోగతిపై బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ.లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. బూత్ లెవెల్ ఆఫీసర్స్ యాప్‌లో ప్రతి ఓటరు వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. యాప్‌లో నమోదు చేసిన వివరాలే ముసాయిదా ఓటరు జాబితాలో ప్రతిబింబిస్తాయని, అందువల్ల చిన్న పొరపాటు కూడా జరగకుండా ప్రతి నమోదును పర్యవేక్షించి, తప్పులు ఉంటే వెంటనే సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి అదనపు కలెక్టర్ చెన్నయ్య, జిల్లా అధికారులతో కలిసి వీసీలో పాల్గొన్న కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, వీసీ అనంతరం అధికారులతో మాట్లాడారు. ఎస్ఐఆర్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, తప్పులు లేకుండా నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటరు జాబితా ఎన్నికల నిర్వహణ కోసం మాత్రమే రూపొందించబడుతుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హతతో దీనికి ఎలాంటి సంబంధం లేదని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.
జిల్లాలో డిజిటలైజేషన్ నిర్దేశిత గడువులోగా 100 శాతం పూర్తి చేయాలని, బిఎల్ఓ యాప్‌లో వివరాలను ఖచ్చితంగా నమోదు చేయడంతో పాటు ప్రతి నమోదును క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు లేకుండా ధృవీకరించాలని ఆదేశించారు. డిజిటలైజేషన్ ప్రక్రియలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి నమోదును సూపర్వైజర్లు క్షుణ్ణంగా తనిఖీ చేసి ధృవీకరించాలని పేర్కొన్నారు.గైర్హాజరు, వలస వెళ్లిన, మృతి చెందిన ఓటర్ల వివరాలకు సంబంధించిన జాబితాపై బీఎల్ఏల సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు.పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణను కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు, ఓటర్ల సంఖ్య, భౌగోళిక పరిస్థితులు, అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిగణనలోకి తీసుకుని చేపట్టాలని సూచించారు. అలాగే, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు .ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి' ముసుగులో జంపింగ్...సొంత సర్కార్‌పైనే ధర్నా డ్రామాలు!

- **గద్వాల ఎమ్మెల్యే 'వైఫల్యాల రాజకీయాల'పై బీజేపీ నాయకురాలు డీకే స్నిగ్ధా రెడ్డి నిప్పులు**
- **పదేళ్లు బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్... మారిన పార్టీలు తప్ప మారని నియోజకవర్గ తలరాత!**
- **చేతకానితనానికి రైతుల అడ్డంకా? ప్రజాక్షేత్రంలో గద్వాల ప్రజల తిరుగుబాటు తప్పదు!**



**గద్వాల జూలై 29 (వుదయం బ్యూరో)**

ఏళ్ల తరబడి నియోజకవర్గాన్ని వేధిస్తున్న ప్రజా సమస్యలను, సాగునీటి తిప్పలను పూర్తిగా గాలికొదిలేసి... ఇప్పుడు సొంత ప్రభుత్వంపైనే ధర్నాలకు దిగడం అత్యంత దిగజారుడు రాజకీయ నాటకమని బీజేపీ జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధా రెడ్డి విరుచుకుపడ్డారు. శనివారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గద్వాల ఎమ్మెల్యే తీరుపై ఆమె తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. తన ఘోర వైఫల్యాలను, పాలనా చేతకానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే ఎమ్మెల్యే ఈ వీధి నాటకాలకు తెరలేపారని తీవ్రంగా ధ్వజమెత్తారు. పార్టీలు మారడమే తప్ప గద్వాలకు సాధించిందేమిటి? పదేళ్లపాటు బీఆర్ఎస్ హయాంలో ఎమ్మెల్యేగా వెలగబెట్టి నియోజకవర్గానికి చేసిందేమీ లేదని స్నిగ్ధా రెడ్డి మండిపడ్డారు. "అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరుతున్నా" అని సొంత లాభం కోసం కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఎమ్మెల్యే... అధికార పార్టీలోకి వెళ్లాక గద్వాలకు తెచ్చిన ఒక్క కొత్త ప్రాజెక్ట్ గానీ, సాధించిన ప్రయోజనం గానీ ఏముందో తెలపాలని సవాల్ విసిరారు.పేదలకు ఇచ్చిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల హామీని నీటిమూట చేశారని మండిపడ్డారు.12 ఏళ్లుగా 'గట్టు ఎత్తిపోతల' పథకాన్ని ఎందుకు సమాధి చేశారో చెప్పాలని నిలదీశారు. గుర్రంగడ్డ వంతెన నిర్మాణం ఏళ్ల తరబడి నత్తనడకన సాగుతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నియోజకవర్గంలో రోడ్లు గొయ్యిలుగా మారినా, పేదల ఇంటి స్థలాలు ఆక్రమణల పాలైనా కనీస పట్టింపు లేదని ధ్వజమెత్తారు. ప్రాజెక్టుల్లో నీళ్లున్నా ఇవ్వలేని దౌర్భాగ్యం... ధర్నాల పేరిట సానుభూతి గిమ్మిక్కులు! గతంలో డీకే అరుణమ్మ భగీరథ యత్నంతో నెట్టెంపాడు ద్వారా సాగునీరు అందిస్తే... నాటి ప్రతిపక్షంలో ఉండి కాలువల్లో జమ్ము పేరుకుపోయిందని గొంతు చించుకున్న నాయకులు, నేడు అధికారంలోకి వచ్చినా ఆ కాలువలను శుభ్రం చేసే దిక్కులేదని ఎద్దేవా చేశారు. ఎగువన వర్షాలు పడి రిజర్వాయర్లలో నిండుగా నీళ్లున్నా, రైతులకు సాగునీరు అందించలేని చేతకానితనంలో ఎమ్మెల్యే ఉన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా కనీసం కాలువల నిర్వహణ చేతకాక, గ్రామాల్లో ప్రజలు గులకరాళ్లతో ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పలేక... ఇప్పుడు రైతుల భుజంపై తుపాకీ పెట్టి సొంత ప్రభుత్వంపైనే ధర్నాలు చేస్తున్నారు. ఇది ప్రజా సానుభూతి కోసం ఆడుతున్న చౌకబారు డ్రామా కాకపోతే మరేమిటి?" అని నిప్పులు చెరిగారు. ప్రజా తీర్పుతో రాజకీయ సమాధి తప్పదు! విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక, సరిపడా విద్యుత్ లేక, అధ్వాన్నమైన రోడ్లు, మౌలిక సదుపాయాల లేమితో గద్వాల ప్రజలు నరకం చూస్తున్నారని స్నిగ్ధా రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో ఉండి సమస్యలు తీర్చాల్సిన బాధ్యతను విస్మరించి, ధర్నాల పేరిట గిమ్మిక్కులు చేస్తే ప్రజలు నమ్మరన్నారు. గద్వాల ప్రజలకు కావాల్సింది ఈ రాజకీయ విన్యాసాలు కాదని, సాగునీరు, అభివృద్ధి అని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ఆడుతున్న ప్రతీ నాటకాన్ని ప్రజలు సూక్ష్మంగా గమనిస్తున్నారని, త్వరలోనే ప్రజాక్షేత్రంలో తగిన బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు.

## హత్నూర్ మండలం కాసా ల రైతు వేదికలో న్యాయ అవగాహన కార్యక్రమం

**సంగారెడ్డి, వుదయం:**

జాతీయ న్యాయ సేవధికార సంస్థ మరియు రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ హైదరాబాద్ వారి ఆదేశాల ప్రకారం జిల్లా అధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గారి సూచనల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి బి సౌజన్య గారు హత్నూర్ మండలం కాశాల రైతు వేదికలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి బి. సౌజన్య గారు ముఖ్య అతిథిగా పాల్గొని రైతులు, మహిళలు, గ్రామస్థులకు న్యాయపరమైన అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె నాల్సా జాగృతి (JAGRITI) పథకం గురించి వివరిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు తమ న్యాయ హక్కులను తెలుసుకొని అవసరమైనప్పుడు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం, న్యాయ సలహాలు, మధ్యవర్తిత్వ సేవలు మరియు ఇతర న్యాయ సేవలను పొందవచ్చని తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన పెంపొందించుకోవాలని, మహిళలు, చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులు మరియు ఇతర అర్హులైన వర్గాలు తమకు చట్టపరంగా కల్పించిన హక్కులను వినియోగించుకోవాలని సూచించారు.అలాగే రైతు వేదికలలో నిర్వహిస్తున్న విత్తన మేళా ప్రాముఖ్యతను వివరించి, ధృవీకరించిన నాణ్యమైన విత్తనాలను వినియోగించడం, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించడం, ఆధునిక సాగు పద్ధతులను అనుసరించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు సూచించారు.



వివాదాలు తలెత్తినప్పుడు కోర్టులను ఆశ్రయించడంతో పాటు, సాధ్యమైనంత వరకు మధ్యవర్తిత్వం, లోక్ అదాలత్ వంటి ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాలను వినియోగించుకోవాలని కోరారు. ప్రజలు న్యాయ సేవల కోసం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి బి సౌజన్య గారు, మండల రెవెన్యూ అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళలు, గ్రామస్థులు ,ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.మంత్రినీ మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు.

## కోటకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**నారాయణపేట, జూలై 29 (వుదయం ప్రతినిధి):**

నారాయణపేట మండలంలోని కోటకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రియాంక బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మహిళా వార్డు, ప్రయోగశాల, ఫార్మసీ, టీకాల నిల్వ గది, వ్యాక్సినేషన్ విభాగాలను పరిశీలించి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.
ఆరోగ్య కేంద్రంలో ఎంఎల్‌హెచ్‌పీ విధుల్లో లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్, సంబంధిత అధికారులను వివరణ కోరారు. నారాయణపేటలో జరుగుతున్న సమావేశానికి హాజరైనట్లు మెడికల్ ఆఫీసర్ తెలిపారు.
మహిళా వార్డులో చికిత్స పొందుతున్న గర్భిణితో కలెక్టర్ మాట్లాడి ఆమె ఆరోగ్య పరీక్షల నివేదికలను పరిశీలించారు. గర్భిణి రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించిన కలెక్టర్, వెంటనే అప్పక్‌పల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో ఫోన్‌లో మాట్లాడి గర్భిణికి అవసరమైన టిఫా స్కానింగ్ పరీక్షలు నిర్వహించి, నివేదికను మెడికల్ ఆఫీసర్ ద్వారా తనకు పంపించాలని సూచించారు.
ఆరోగ్య కేంద్రంలో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై కలెక్టర్ ఆరా తీశారు. గతంలో బయోమెడికల్ వ్యర్థాల సేకరణకు వాహనం వచ్చేదని, ప్రస్తుతం రావడం లేదని వైద్య సిబ్బంది తెలిపారు. అలాగే విద్యుత్ సరఫరా లేకపోవడంతో వ్యాక్సినేషన్ సేవలకు అంతరాయం ఏర్పడుతున్నట్లు వివరించారు.దీనిపై స్పందించిన కలెక్టర్ బయోమెడికల్ వ్యర్థాల సేకరణ వాహనం ఎందుకు రావడం లేదని డీఎంఅండ్‌హెచ్‌వోను ప్రశ్నించారు. సంబంధిత ఏజెన్సీకి వెంటనే నోటీసు జారీ చేయాలని జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి బయోమెడికల్ వ్యర్థాలను క్రమం తప్పకుండా సేకరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



**జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సందర్శన**

అనంతరం కోటకొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వివరాలను తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడితో పాటు మరో ఉపాధ్యాయుడు జాజాపూర్‌లో జరుగుతున్న శిక్షణకు హాజరయ్యారని, ఒక ఉపాధ్యాయుడు సెలవులో ఉండగా, మరో ఉపాధ్యాయురాలు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా గైర్హాజరైనట్లు ఉపాధ్యాయులు వివరించారు.
ఆరో తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖి నిర్వహించి, వారి అభ్యాస సామర్థ్యాలను పరిశీలించి అభినందించారు. అనంతరం డైనింగ్ హాల్‌ను పరిశీలించి, పదో తరగతి విద్యార్థులతో భౌతిక శాస్త్రం పాఠ్యాంశానికి సంబంధించిన ప్రశ్నలు అడిగి వారి ప్రతిభను పరీక్షించారు.
గత విద్యా సంవత్సరంలాగే ఈసారి కూడా పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. విద్యార్థులు 550కు పైగా మార్కులు సాధించే లక్ష్యంతో చదవాలని, జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ప్రోత్సహించారు. తరగతి గదిలోని విద్యార్థులతో మాత్రమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థులతో పోటీ ఉంటుందని గుర్తుంచుకుని పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు.
ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను అదే రోజు పునశ్చరణ చేస్తే పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు నిరాశ చెందకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యంగా బాలికలు ఆర్థిక స్వావలంబన సాధించి, తమకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకోవాలని ప్రోత్సహించారు.
చివరగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్ మెనూ ప్రకారమే భోజనం అందిస్తున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే వంటగది వద్ద అపరిశుభ్రతను గమనించి శుభ్రత పాటించాలని సూచించారు. ఎంపీడీవో పాఠశాలను తరచూ సందర్శించాలని ఆదేశించడంతో పాటు, వంటగదిలో తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు.అనంతరం గ్రామంలోని చేనేత కార్మికుడి ఇంటిని సందర్శించిన కలెక్టర్, అక్కడ తయారవుతున్న సిల్క్ చీరలను పరిశీలించారు. చీరల తయారీకి అవసరమైన ముడిసరుకు, ఉత్పత్తి వ్యయం, మార్కెటింగ్, విక్రయాల వివరాలను గ్రామానికి చెందిన మాస్టర్ వీవర్ పడాకుల శ్రీనివాస్ కలెక్టర్‌కు వివరించారు.



## గురువు చూపిన మార్గమే విజయానికి పునాది

**మెదక్ జిల్లా29 (వుదయం )ప్రతినిధి/**

అల్లదుర్గం మండల్ గడి పెద్దాపూర్ గ్రామ ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ నరసింహులు సార్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించి గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేయడం ఎంతో ఆనందంగా భావిస్తున్నాము.

**ఈ సందర్భంగా కృష్ణ గౌడ్ గారు మాట్లాడుతూ**

"గురువు అనేది కేవలం పాఠాలు చెప్పే వ్యక్తి కాదు... భవిష్యత్తును తీర్చిదిద్దే శిల్పి."

మన గ్రామ పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల విద్యాభివృద్ధి, వారి క్రమశిక్షణ మరియు ఉన్నత భవిష్యత్తు కోసం ప్రతిరోజూ అంకితభావంతో ఆలోచిస్తూ కృషి చేస్తున్న నరసింహులు సార్ గారి సేవలు నిజంగా అభినందనీయం.
ఇలాంటి ఆదర్శ గురువులు మరెందరికో స్ఫూర్తిగా నిలవాలని కోరుకుంటూ, వారికి హృదయపూర్వక గురు పౌర్ణమి శుభాకాంక్షలు మరియు శుభాభినందనలు తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో బియాస్ నాయకులు రజినీకాంత్ ,అనిల్ తదితరులు పాల్గొన్నారు

## విశ్వవిద్యాలయంలో పుస్తకావిష్కరణ



**మహబూబ్ నగర్ జిల్లా 29 జూలై(వుదయం బ్యూరో)**

పాలమూరు విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎస్.ఎన్. అర్జున్ కుమార్, డాక్టర్ కె. నాగసుధ సంయుక్తంగా రచించిన "డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఇన్ ఫైనాన్షియల్ మార్కెట్స్ అండ్ సర్వీసెస్" ఈ పుస్తకాన్ని పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.ఎన్. శ్రీనివాస్ , రిజిస్ట్రార్ ఆచార్య పి. రమేష్ బాబు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ, నేటి ఆర్థిక వ్యవస్థలో డిజిటల్ పరివర్తన కీలక పాత్ర పోషిస్తోందని, ఫైనాన్షియల్ మార్కెట్లు మరియు సేవల్లో చోటుచేసుకుంటున్న సాంకేతిక మార్పులను విద్యార్థులు, అధ్యాపకులు లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇటువంటి సమకాలీన అంశాలపై అధ్యాపకులు పరిశోధనాత్మక గ్రంథాలను రచించడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమని పేర్కొన్నారు.
రిజిస్ట్రార్ మాట్లాడుతూ, అధ్యాపకులు బోధనతో పాటు పరిశోధన, గ్రంథ రచనలోనూ ముందుండాలని, ఈ పుస్తకం మేనేజ్‌మెంట్ విద్యార్థులు, పరిశోధకులు మరియు అధ్యాపకులకు విలువైన మార్గదర్శకంగా ఉపయోగపడుతుందని అభినందించారు.
ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ టు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి. మధుసూదన్ రెడ్డి,పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ కె. ప్రవీణ, ఎస్సీ/ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ నాగం కుమారస్వామి, న్యాయ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. భూమయ్య, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. రవికుమార్, డాక్టర్ కె. శ్రీధర్ రెడ్డి, రామ్మోహన్ జి తదితర అధ్యాపకులు, అధికారులు, ఎం బి ఏ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

- **పంది రాజు**
- **మహిళా సమాఖ్య భవనాల మంజూరుపై హర్షం**
- **సీఎం రేవంత్ రెడ్డి, చెరుకు శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు**

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి**

మహిళా సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని తొగుట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పంది రాజు అన్నారు. బుధవారం మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ మహిళా సమాఖ్య భవనాలను మంజూరు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అభివృద్ధికి కృషి చేస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండారు రమేష్‌గౌడ్, ఆత్మ కమిటీ డైరెక్టర్ బెజ్జనబోయిన ప్రవీణ్, సీనియర్ నాయకులు పత్కుల వెంకటేశం, యూత్ అధ్యక్షులు నరేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బాలకృష్ణ, నాయకులు అర్జున్, వద్దే నాగరాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ వికారాబాద్ 4వ జిల్లా మహాసభలు ప్రారంభం

**తాండూరు జులై 29 వుదయం ప్రతినిధి:**

వికారాబాద్ జిల్లా ఏఐటీయూసీ (ఏఐటీయూసీ ) 04 వ జిల్లా మహాసభలు పెన్నా సిమెంట్ మైసమ్మ గుడి ప్రాంగణంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించగా, ర్యాలీతో మహాసభలు ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. అనంతరం ఏఐటీయూసీ జెండాను రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ ఎస్. విలాస్ ఆవిష్కరించారు.
ఈ మహాసభలకు కామ్రేడ్లు విజయలక్ష్మి పండిట్, బాల శంకర్, దశరత్ గౌడ్ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఇటీవల మరణించిన కార్మికుల స్మరణార్థం రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.100 ఏళ్ల చరిత్ర ఉన్న కార్మిక చట్టాలను రద్దు చేయడం దుర్మార్గం: కామ్రేడ్ ఎస్. విలాస్మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ ఎస్. విలాస్ మాట్లాడుతూ... భారతదేశంలో 1920లో ముంబై వేదికగా లాలా లజ్పత్ రాయ్ అధ్యక్షతన ఆవిర్భవించిన తొలి కార్మిక సంఘం ఏఐటీయూసీ అని గుర్తుచేశారు. బ్రిటిష్ కాలంలోనే ఏఐటీయూసీ పోరాడి 34 ముఖ్యమైన కార్మిక చట్టాలను సాధించిందని, అందులో 8 గంటల పని దినం, పారిశ్రామిక వివాదాల చట్టం (ఐడి యాక్ట్), కార్మికుల నష్టపరిహార చట్టం, ట్రేడ్ యూనియన్ చట్టాలు అత్యంత కీలకమైనవని పేర్కొన్నారు.

**ప్రధాన డిమాండ్లు:**

పెన్నా సిమెంట్ కార్మికులకు: వేతనాన్ని



₹17,009/ పెంచాలి. ఆదాని లో ఏ కార్మికుడూ రాజీనామా చేయకూడదని, కొత్త కాంట్రాక్టర్‌కు గతంలో మాదిరిగానే ట్రాన్స్‌ఫర్ ప్రక్రియ చేపట్టాలి. సిసిఐ ) కార్మికులకు: సివిల్ లేబర్లకు పెంచిన కనీస వేతనాలు చెల్లించాలి.
కార్మికుల హక్కుల సాధనకు ఎల్లవేళలా మద్దతు: మాజీ ఎంపీపీ శరణు బసప్ప కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ శ్రీ శరణు బసప్ప మాట్లాడుతూ, కార్మికులు తమ హక్కుల సాధన కోసం సాగించే పోరాటాలకు ఎల్లవేళలా ఏఐటీయూసీకి తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. స్వార్థం, స్వలాభం కోసం కొందరు వ్యక్తులు కార్మికులను విడదీసేందుకు ప్రయత్నిస్తుంటారని, అటువంటి కుట్రలను కార్మికులు తిప్పికొట్టి ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఐసీఎల్, పెన్నా, సిసిఐ కార్మికుల తరపున నిరంతరం పోరాటం: విజయలక్ష్మి పండిట్
అధ్యక్ష ఉపన్యాసం చేసిన కామ్రేడ్ విజయలక్ష్మి పండిట్ మాట్లాడుతూ... ఏఐటీయూసీ పోరాటాల వల్ల మాత్రమే కార్మికులకు న్యాయం జరుగుతుందని, వికారాబాద్ జిల్లాలో ఏఐటీయూసీ రోజురోజుకూ బలోపేతమవుతోందని అన్నారు. ఐసీఎల్ అల్ట్రాటెక్ ఫ్యాక్టరీలో ఏఐటీయూసీ తిరిగి పుంజుకుంటోందని, ఆదాని, సిసిఐ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడతామని స్పష్టం చేశారు.

**ఘనంగా ముగిసిన మహాసభలు**

మహాసభ విజయవంతానికి సహకరించిన నాయకులకు, ఆదాని , సిసిఐ, మున్సిపల్ కార్మికులకు నాయకులు విప్లవాత్మక అభినందనలు తెలిపారు. సభకు హాజరైన వారికి భోజన వసతులు కల్పించిన ఆదాని వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, కామ్రేడ్ వంశీకృష్ణ మహాసభ ముగిసిందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఎం. జైపాల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ రవీందర్, నాయకులు తహర్ పాషా, జగయ్య, అజయ్, రాజేశ్వర్ రెడ్డి, పాండు, అశోక్, పి. నర్సిములు మరియు పెన్నా, సిసిఐ, మున్సిపల్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గుట్టలు మాయం... ఎర్రమట్టి మాఫియా రాజ్యం!

- **వికారాబాద్‌లో యథేచ్ఛగా ఎర్రమట్టి అక్రమ తవ్వకాలు**
- **శని, ఆదివారాల్లో టిప్పర్లతో భారీ రవాణా జరుగుతోందని ఆరోపణలు**
- **పోలీసులు–రెవెన్యూ–మైన్స్ శాఖల మౌనంపై ప్రశ్నలు**

**వికారాబాద్ జూలై 29 (వుదయం బ్యూరో)**

వికారాబాద్ జిల్లాలో సహజ సంపదగా ఉన్న ఎర్రమట్టి గుట్టలు క్రమంగా కనుమరుగవుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న గ్రామాలతో పాటు మండలంలోని పలు ప్రాంతాల్లో ఎర్రమట్టి అక్రమ తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండానే కొండలు, గుట్టలను తవ్వి టిప్పర్లలో ఎర్రమట్టిని తరలిస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు.
స్థానికుల సమాచారం ప్రకారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని గెరిగేటిపల్లి, దన్నారం, కొంపల్లి, అనంతగిరిపల్లి, పులుసుమామిడి పరిసర ప్రాంతాలతో పాటు వికారాబాద్ మండలంలోని మరికొన్ని గ్రామాల్లో ఈ అక్రమ కార్యకలాపాలు ఎక్కువగా జరుగుతున్నాయని అంటున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా టిప్పర్లు తిరుగుతూ ఎర్రమట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నాయని ఆరోపిస్తున్నారు.



సెలవు రోజుల్లోనే ఎక్కువ దందా?
ముఖ్యంగా శనివారం, ఆదివారం ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ఉండటాన్ని ఆసరాగా చేసుకుని భారీ స్థాయిలో తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఒక్కో రోజు లక్షల రూపాయల విలువైన ఎర్రమట్టి అక్రమంగా తరలిపోతున్నప్పటికీ, సంబంధిత శాఖలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

**గుట్టలు మాయం... పర్యావరణానికి ముప్పు**

అక్రమ తవ్వకాలతో సహజ గుట్టలు వేగంగా క్షీణిస్తున్నాయని పర్యావరణంపై ఆందోళన వ్యక్తమవుతోంది. భూగర్భ జలాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని, వర్షపు నీటి నిల్వ వ్యవస్థ దెబ్బతింటుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. పచ్చదనం తగ్గిపోవడంతో భవిష్యత్తులో తీవ్ర పర్యావరణ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు.

**మైన్స్ శాఖ మౌనం ఎందుకు?**

ఇంత పెద్ద ఎత్తున తవ్వకాలు, రవాణా జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నప్పటికీ మైన్స్ శాఖ, రెవెన్యూ శాఖ, పోలీసు అధికారులు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అక్రమ మట్టి దందాపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్**

ఎర్రమట్టి అక్రమ తవ్వకాలపై జిల్లా యంత్రాంగం వెంటనే ప్రత్యేక దృష్టి సారించాలని, ఉన్నతస్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సహజ వనరులను పరిరక్షించి, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అక్రమ మట్టి మాఫియాను పూర్తిగా అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.సహజ సంపదను కబళిస్తున్న మట్టి దందా గ్రామాల్లో ప్రజలకు ప్రాణభయం.



## భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక పటాన్చెరు

- **ఎస్ఐఆర్ లో పాల్గొనడం ప్రతి ఒక్కరి బాధ్యత..**
- **ఇతర రాష్ట్రాల ప్రజలు సైతం స్థానికంగానే ఓటరు నమోదు చేయించుకోండి..**
- **ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి**

**పటాన్చెరు, (వుదయం):**

మినీ ఇండియగా పేరుందిన పటాన్చెరు నియోజకవర్గంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న ఇతర రాష్ట్రాల ఓటర్లు స్థానికంగానే తమ ఓటు వివరాలను నమోదు చేసుకుని.. పటాన్చెరు నియోజకవర్గం అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై దిశ నిర్దేశం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం 25 సంవత్సరాల తర్వాత ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని చేపడుతోందాన్ని తెలిపారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రజలు స్థానికంగా నివాసమే ఏర్పాటు చేసుకొని తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారని.. వారందరూ విధిగా స్థానికంగానే ఓటరు వివరాలు నమోదు చేసుకోవాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. మినీ ఇండియా గా పేరొందిన పటాన్చెరు నియోజకవర్గంలోని ప్రజలందరినీ సొంత బిడ్డల వలె చూసుకుంటున్నామని తెలిపారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రత్యేకంగా నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ముగియడానికి మరో ఐదు రోజుల సమయం మాత్రమే ఉందని.. వివరాలు నమోదు చేయించుకొని వారందరూ తప్పనిసరిగా వివరాలు అందించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మెట్టు కుమార్ యాదవ్, బాల్ రెడ్డి, విజయ్ కుమార్, బిక్షపతి, పృథ్వీరాజ్, వెంకటేష్, దామోదర్ రెడ్డి, తేజ, రాజు, రామ్మోహన్, వివిధ సంఘాల అధ్యక్షులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



# విద్యార్థి తరుణ్ని బలితీసుకున్న లెక్చరర్ వేధింపులు?

- **గద్వాలలో మిన్నంటిన ఆగ్రహజ్వాలలు.. ఆసుపత్రి ప్రాంగణం దిగ్బంధం!**
- **లెక్చరర్‌ను అరెస్టు చేయాలని కదంతొక్కిన విద్యార్థి లోకం.. భారీగా పోలీసుల మోహరింపు**

**గద్వాల, జూలై 29 (వుదయం బ్యూరో):**

ఓ కాంట్రాక్ట్ లెక్చరర్ అనాలోచిత వైఖరి, వేధింపులే ఇంటర్ విద్యార్థి తరుణ్ ప్రాణాలను బలిగొన్నాయన్న వార్త జిల్లావ్యాప్తంగా తీవ్ర ఆగ్రహ జ్వాలలను రగిల్చింది. ఈ ఘోరానికి కారణమైన సదరు లెక్చరర్‌ను వెంటనే ఉద్యోగం నుంచి బర్తరఫ్ చేసి, క్రిమినల్ కేసు నమోదుతో పాటు కటకటాల్లోకి నెట్టాలని డిమాండ్ చేస్తూ గద్వాల రణ రంగంగా మారింది. కొత్తపల్లి గ్రామానికి చెందిన తరుణ్ ఆత్మహత్యతో రగిలిపోయిన కుటుంబ సభ్యులు, బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం గద్వాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట కదంతొక్కారు.

**న్యాయం జరిగే వరకు తగ్గేదే లే!**

బాధిత కుటుంబంతో కలిసి ఆసుపత్రి ప్రధాన ద్వారాన్ని దిగ్బంధించిన ఆందోళనకారులు, ప్రభుత్వం మరియు కళాశాల యాజమాన్యానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ దారుణంపై తక్షణమే ఉన్నతస్థాయి సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై నిర్దాక్షిణ్యంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థి నేతలు విజ్ఞప్తి చేశారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే భారీ ఆర్థిక సాయం ప్రకటించి, అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఉద్రిక్తంగా ఆసుపత్రి పరిసరాలు

ధర్నా రోజురోజుకూ ఉధృతం కావడంతో ఆసుపత్రి ప్రాంగణంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న ఆందోళన వ్యక్తమవడంతో పోలీసులు రంగంలోకి దిగి ఆసుపత్రి చుట్టూ భారీగా బందోబస్తును మోహరించారు. తరుణ్ మృతికి కారణమైన వారికి కఠిన శిక్ష పడి, బాధిత కుటుంబానికి పరిపూర్ణ న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగేది లేదని విద్యార్థి సంఘాలు హెచ్చరించాయి.

# సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే



గురు పౌర్ణమి సందర్భంగా నేడు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని శ్రీనగర్ కాలనీ డివిజన్ ఎల్లారెడ్డిగూడలోని శ్రీ సాయిబాబా ఆలయంలో నిర్వహించిన గురు పౌర్ణమి వేడుకల్లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే శ్రీ వి. నవీన్ యాదవ్ గారు పాల్గొన్నారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు శ్రీ సాయిబాబా వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, జూబ్లీహిల్స్ నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని బాబా వారి ఆశీస్సులు కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే గారికి ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు..ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు,తదితరులు, పాల్గొన్నారు.

# యువత రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి



- **జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక**

**నారాయణపేట టౌన్ జూలై 29 (వుదయం ప్రతినిధి)**

యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక పిలుపునిచ్చారు.

గురు పౌర్ణమి సందర్భంగా నారాయణపేట జిల్లా కేంద్రంలోని షిరిడి సాయిబాబా మందిర ఆవరణలో స్నేహ మిత్ర మండలి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా అవసరమైన వారికి సకాలంలో రక్తం అందించడంతో పాటు, రక్తదాత ఆరోగ్యానికి కూడా ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం ఈ తరహా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తూ సామాజిక సేవలో భాగస్వాములవుతున్న స్నేహ మిత్ర మండలి నిర్వాహకులను ఆమె అభినందించారు.

అనంతరం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ వినీత్ శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా సమాజానికి సేవ చేయడంతో పాటు ఆరోగ్యపరమైన ప్రయోజనాలు కూడా పొందవచ్చని పేర్కొన్నారు. రక్తదాతలను, శిబిర నిర్వాహకులను ఈ సందర్భంగా అభినందించారు.ఈ రక్తదాన శిబిరాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మంజుల జి ఆర్ రెడ్డి, ఆర్డీఓ రమేష్, డాక్టర్ మదన్మోహన్ రెడ్డి ,డాక్టర్ బాలాజీ, ఆత్మారాం ఎడికె, శివచందర్ గౌడ్ ,జొన్నల సుభాష్, సత్య యాదవ్, జింగిటి వెంకటేష్, టౌన్ బిల్డర్ వెంకట్ రాములు ,మాధవరెడ్డి లతో పాటు తదితరులు హాజరు అయ్యారు.

# అధికారిణి కి బెదిరింపులకు పాల్పడిన వారిపై కేసు నమోదు

**వుదయం న్యూస్ శివంపేట జూలై 29**

విద్యుత్ చోరీ పై తనిఖీలకు వెళ్లిన ట్రాన్స్‌కో సహాయ ఇంజనీర్ విధులకు ఆటంకం కలిగించి, దాడికి యత్నించి, చంపేస్తామని బెదిరించిన ఘటన శివంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మధుకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తూప్రాన్ ఉపవిభాగ ట్రాన్స్‌కో సహాయ ఇంజనీర్ కొమ్ము శివ స్రవంతి ఈ నెల 28న మధ్యాహ్నం సమయంలో పెద్ద గొట్టిముక్క పరిధిలోని దేవమ్మగూడెం తండాలో కోళ్ల పారాలకు అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నారనే సమాచారంతో తనిఖీలకు వెళ్లారు. ఈ సందర్భంగా దేవమ్మగూడెం తండాకు చెందిన కొర్ర చందర్, విఠల్‌తో పాటు మరికొందరు కలిసి ఆమె విధులకు ఆటంకం కలిగించి, చంపేస్తామని బెదిరిస్తూ రాళ్లతో దాడికి యత్నించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై సహాయ ఇంజనీర్ ఫిర్యాదు మేరకు శివంపేట పోలీసులు సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

# అధికారుల అరాచకం.. భీంనగర్‌లో నరకం!

- **కూల్చివేతల పేరిట కొంపముంచిన మున్సిపాలిటీ!**
- **సగంలోనే పనులు బంద్.. వర్షా నికి మునిగిన రోడ్లు, కుదేలైన వ్యాపారాలు**

**గద్వాల, జూలై 29 (వుదయం బ్యూరో):**



ఆక్రమణల తొలగింపు పేరిట మున్సిపల్ అధికారులు ప్రదర్శించిన ఆతురత, ఆ తర్వాత చూపిన అలసత్వం గద్వాల పట్టణంలోని భీంనగర్ పౌరులకు నరకం చూపుతోంది. ముందస్తు ప్రణాళిక, కనీస ముందస్తు సమాచారం లేకుండా చేపట్టిన 'ఎన్క్రోచ్‌మెంట్ డ్రైవ్' స్థానికుల పాలిట శాపంగా మారింది. అంబేద్కర్ చౌరస్తా నుండి పరిసర ప్రాంతాల వరకు దుకాణాల ముందున్న మెట్లను, నిర్మాణాలను బుల్డోజర్లతో ధ్వంసం చేసిన అధికారులు.. ఆ తర్వాతి అభివృద్ధి పనులను మాత్రం గాలికి వదిలేశారు. బాగున్న రోడ్లను సైతం తవ్వి పారేసి పనులు మధ్యలోనే నిలిపివేయడంతో ప్రజలు అరిగోస పడుతున్నారు. బురదగుంటలుగా మారిన రహదారులు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తవ్వి వదిలేసిన రోడ్లన్నీ బురదకుప్పలుగా మారాయి. పాదచారులు అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొనగా, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. డ్రైనేజీ పనులను సమగ్రంగా పునర్నిర్మిస్తామని గొప్పలు చెప్పిన మున్సిపల్ పాలకులు, క్షేత్రస్థాయిలో రూపాయి పని కూడా ముందుకు తీసుకెళ్లకపోవడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. వ్యాపారులకు కోలుకోలేని దెబ్బ షాపుల ముందు మెట్లు కూల్చివేయడం, రోడ్లన్నీ బురదమయం కావడంతో వినియోగదారులు అటువైపు రావడానికే భయపడుతున్నారు. దీంతో క్రయవిక్రయాలు నిలిచిపోయి వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, చేతి వృత్తుల వారు, చిన్న వ్యాపారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారని వాపోతున్నారు. కలెక్టర్ గారూ.. తక్షణమే స్పందించండి! సౌకర్యాలు కల్పించాల్సిన మున్సిపాలిటీయే మా పొట్టకొడుతోంది. ఈ రాతియుగం నాటి పరిస్థితుల నుంచి మమ్మల్ని గట్టెక్కించాలి. అసంపూర్తిగా ఉన్న రోడ్లు, డ్రైనేజీ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి. నిర్లక్ష్యం వహించిన అధికారులపై జిల్లా కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకోవాలి.— బాధిత వ్యాపారులు, భీంనగర్ స్థానికులు విజ్ఞప్తి

# విలువల రాజకీయాలకుమారుపేరు జైపాల్ రెడ్డి

- **జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే**



భారత మాజీ కేంద్ర మంత్రి, ఉత్తమ పార్లమెటీరియన్ మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీ సూదిని జైపాల్ రెడ్డి గారి 7వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పి.వి.ఎన్.ఆర్ మార్గ్‌లో అయన (స్ఫూర్తి స్థల్) స్మారక వనంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే శ్రీ వి. నవీన్ యాదవ్ గారు జైపాల్ రెడ్డి గారి సమాధికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు..ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి గారు విలువలకు కట్టుబడి రాజకీయాలు చేసిన అరుదైన నాయకుడని, తన మేధస్సు, వాక్చాతుర్యం, పార్లమెంటరీ సంప్రదాయాలతో దేశ రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారని అన్నారు..

జైపాల్ రెడ్డి గారి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ప్రజాసేవకు అంకితభావంతో పనిచేయాలన్నారు.

# నాయకత్వ లక్షణాలే విద్యార్థుల అసలైన ఆభరణం

**గుడిమల్కాపూర్ :**



గుడిమల్కాపూర్‌లోని గౌతమ్ మోడల్ స్కూల్ విద్యార్థి నాయకుల పదవీస్వీకార మహోత్సవం (ఇన్వెస్టిచర్ సెర్మనీ) అత్యంత ఉత్సాహంగా, ఘనంగా జరిగింది. ఈ వేడుకలో నూతనంగా ఎన్నికైన స్టూడెంట్ కౌన్సిల్ నాయకులకు అధికారికంగా బాధ్యతలను అప్పగించారు. విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సేవాభావాలను పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రముఖులుఈ కార్యక్రమానికి సబ్‌ఇన్‌స్పెక్టర్ రాజు ముఖ్య అతిథిగా, ప్రముఖ న్యాయవాది కలీమ్ అహ్మద్ విశిష్ట అతిథులుగా విచ్చేసి కార్యక్రమాన్ని మరింత శోభాయమానం చేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను ఉద్దేశించి చేసిన స్ఫూర్తిదాయక ప్రసంగాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపడమే కాకుండా, బాధ్యతాయుతమైన నాయకులుగా ఎదిగేందుకు ఎంతగానో ప్రేరేపించాయి.పాఠశాల యాజమాన్యం అతిథుల విలువైన సమయానికి, వారి అమూల్యమైన ప్రోత్సాహానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది.

ఉత్సాహంగా పాల్గొన్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులుఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు.

ప్రతిజ్ఞా స్వీకారం: పాఠశాల కీర్తి ప్రతిష్టలను, ఉన్నత విలువలను ఎల్లప్పుడూ కాపాడుతామని విద్యార్థి నాయకులు ప్రతిజ్ఞ చేయడంతో కార్యక్రమం ముగిసింది.

అందరి ప్రశంసలను అందుకున్న ఈ వేడుక చివరకు అత్యంత వైభవంగా, విజయవంతంగా సంపూర్ణమైంది.

# ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన కుటుంబానికి ఆధార్ కార్డు అందించాలి

- **ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ఆధార్ నమోదు వేగవంతం చేయాలి**
- **0-5 సంవత్సరాల చిన్నారులు, విద్యార్థుల ఆధార్ అప్‌డేషన్‌పై ప్రత్యేక దృష్టి**
- **జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**

**నాగర్ కర్నూల్, జూలై 29 (వుదయం బ్యూరో) :**




ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆధార్ కార్డు లేని ప్రతి చెంచు, గిరిజన కుటుంబానికి ఆధార్ కార్డు అందించేందుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ చెన్నయ్యతో కలిసి జిల్లా ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. జిల్లా వ్యాప్తంగా ఆధార్ నమోదు, అప్‌డేషన్, చిన్నారుల నమోదు, విద్యార్థుల ఆధార్ వివరాల సవరణలపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని లింగాల, అమ్రాబాద్, పదర, బల్మూర్, అచ్చంపేట మండలాల పరిధిలోని చెంచు గూడాలు, గిరిజన గ్రామాల్లో ఇంకా ఆధార్ నమోదు పూర్తికాని కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులు ఆధార్ నమోదు కేంద్రాలకు రావడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున అధికారులు వారి వద్దకే వెళ్లి ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని సూచించారు. గ్రామాల వారీగా కార్యాచరణ రూపొందించి, ముందస్తు సమాచారం ఇచ్చి ప్రతి కుటుంబాన్ని నమోదు ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలన్నారు.ఆధార్ కార్డు లేకపోవడం వల్ల చెంచు, గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందకుండా పోతున్నాయని కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఆధార్ కార్డు అందించడం ద్వారా రేషన్, పింఛన్లు, విద్యా పథకాలు, ఆరోగ్య సేవలు, ఉపాధి హామీ, ఇతర సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు ఎలాంటి ఆటంకం లేకుండా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఆశ్రమ తదితర 1,066 పాఠశాలల్లో చదువుతున్న 16,514 మంది విద్యార్థుల ఆధార్ అప్‌డేషన్ ఇంకా పెండింగ్‌లో ఉందని, ప్రతి పాఠశాల వారీగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి తక్షణమే పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్‌ను ఆదేశించారు.

ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారానే ఆధార్ నమోదు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి జిల్లా మహిళ శిశు సంక్షేమ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా సిబ్బంది సమన్వయంతో ఒక్క చిన్నారి కూడా ఆధార్ నమోదు నుంచి మిగిలిపోకుండా చూడాలని సూచించారు.

జిల్లాలో ఆధార్ నమోదు, అప్‌డేషన్ ప్రక్రియను కేవలం గణాంకాలకే పరిమితం చేయకుండా, ప్రతి అర్హుడికి సేవలు అందేలా క్షేత్రస్థాయిలో పని చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని చెంచు, గిరిజన కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చెన్నయ్య, అదనపు ఎస్పి వెంకటేశ్వర్లు, డీఆర్వో పాండు, జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్, లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ట్ మేనేజర్ చంద్రశేఖర్, ఈడీఎం నరేష్, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, పోస్టల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు అన్న ప్రసాదం అందించిన రమణారెడ్డి కుటుంబం

**వుదయం న్యూస్ శివంపేట జూలై 29**



మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ గురు పీఠం కు గురు పౌర్ణమి వేడుకలకు విచ్చేసిన భక్తుల సౌకర్యార్థం.శివ్వంపేట గ్రామా వాస్తవ్యులు రమణారెడ్డి. కుటుంబ సభ్యులు దయానంద రెడ్డి. సంతోష్ రెడ్డి. శ్రావ్య. విఖ్యాత్ రెడ్డి. రాజశేఖర్ రెడ్డి. సాహితి. అన్న ప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రమణారెడ్డి అన్నదానం గురించి మాట్లాడుతూ.భూదానం', 'గోదానం' (గోవుల దానం), 'అర్థదానం' (డబ్బు దానం) ఇవి అన్నీకూడా దానధర్మాలు కోవకే చెందుతాయి.ఇవి చేయాలంటే ఒక రకమైన ధనవంతులు లేదా సంపన్నులు మాత్రమే భరించగలిగే దాన రూపాలు.అన్నదానం అనేది నిత్యావసరాలతో బతికే సామాన్యుడు కూడా అన్నదానం చేయటానికి అవకాశం ఉంది. ఆకలి గొప్ప బాధ అని ప్రాచీన భారతదేశం జ్ఞానులు గుర్తించి చెప్పారు. ఆకలి అనేది అందరికీ వచ్చే వ్యాధి. దీనికి ఆహారం తప్ప మరే మందు లేదు. అందువలన భారతదేశంలో అన్నదానం అన్ని చాలా ప్రాముఖ్యత ఉంది. పురాణాల ప్రకారం, కడుపుని అగ్ని నివసించే 'అగ్ని కుండ్' తో పోల్చవచ్చు. పంచభూతాలలో అగ్ని ఒకటి లేదా మన శరీరాన్ని కలిగి ఉన్న 5 మూలకాలు. దీనికి క్రమం తప్పకుండా ఆహార నైవేద్యాలు అవసరం. నైవేద్యం ఇవ్వకపోతే ప్రాణం నిలవదు. అందువలన ఈ 'అగ్ని కుండ్' కోసం చేసిన సహాయం వేలాది యజ్ఞాలు చేసిన దానికంటే చాలా గొప్పదని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అధికారులు నిర్లక్ష్యం చేస్తే కలెక్టరేట్ ముట్టడి తప్పదు కొత్త ప్రభాకర్ రెడ్డి

**దుబ్బాక, జూలై 29 వుదయం:**



దుబ్బాక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల అభివృద్ధిపై సమగ్ర సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండల సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మండల, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. వ్యవసాయం, విద్యుత్, మిషన్ భగీరథ, హౌసింగ్, విద్య, వైద్యం తదితర శాఖల పనితీరును శాఖల వారీగా ఎమ్మెల్యే సమీక్షించారు. సమావేశంలో మాట్లాడిన ఎమ్మెల్యే, ప్రజా సమస్యల పరిష్కారమే ఈ సమీక్షల ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. రైతులకు యూరియా, డీఏపీ ఎరువుల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకూడదని ఆదేశించారు. డీఏపీ ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో వెంటనే జిల్లా అధికారులకు ఫోన్ చేసి సంబంధిత దుకాణాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పామాయిల్ సాగును ప్రోత్సహించేందుకు తానే స్వయంగా 12 ఎకరాల్లో పామాయిల్ సాగు చేస్తానని ప్రకటించారు. ప్రతి గ్రామంలో విద్యుత్ అంతరాయాలు లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచాలని, తాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చూడాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, వైద్య కేంద్రాల్లో సిబ్బంది కొరతను వెంటనే తీర్చాలని ఆదేశించారు. దుబ్బాక అభివృద్ధి విషయంలో జిల్లా అధికారుల నిర్లక్ష్యాన్ని సహించబోమని ఎమ్మెల్యే హెచ్చరించారు. "ప్రజా సమస్యలు పరిష్కారం కాకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం. అవసరమైతే ఉద్యమాల గడ్డ దుబ్బాక శక్తి ఏమిటో మరోసారి చూపిస్తాం" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు అందుతుండటం కేసీఆర్ దూరదృష్టికి నిదర్శనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# గురువులను పూజించిన బిజెపి ఎండోమెంట్ రాష్ట్ర జైంట్ కన్వీనర్

**వుదయం న్యూస్ శివ్వంపేట జులై 29**



మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో కొలువుదీరిన శ్రీ దత్తాత్రేయ మహాస్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించిన బిజెపి ఎండోమెంట్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ కవితా రెడ్డి. అనంతరం శ్రీ గురు పీఠంలో కొలువు తేదీన దత్తాత్రేయ మహాస్వామి సమక్షంలో వేద పండితులు మహర్షి గురుదేవులు శాస్త్రుల వామన శర్మను శాలువాతో ఘనంగా సన్మానించి ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది. అనంతరం ఆమె మాట్లాడుతూ. ఉపాధ్యాయులను, పెద్దలను పూజించే రోజును గురు పౌర్ణమి లేదా వ్యాస పౌర్ణమి అని పిలుస్తారు. హిందువులు ప్రతి సంవత్సరం ఆషాఢ శుద్ధ పౌర్ణమి రోజున గురుపౌర్ణమి జరుపుకుంటారు. ఈ రోజున గురుపూజోత్సవం జరిపి గురువులకు కానుకలు బహుమతులు సమర్పించి వారిని సత్కరించి వారి ఆశీర్వాదములు తీసుకొంటారు. తమ జీవితానికి మార్గనిర్దేశం చేసి, ముక్తి వైపు నడిపించినందుకు ప్రతిఫలంగా ఇలా చేస్తారు. గురువుల పట్ల ఇదే గౌరవం అన్నివేళలా పాటిస్తున్నప్పటికీ ఈ రోజు వ్యాసమహాముని పుట్టిన రోజు కాబట్టి ఈ రోజుకంత ప్రాధాన్యత ఉంది. అని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో వీరారెడ్డి. కృష్ణ. నవీన్. విజయ్. యాదగిరి రావు దంపతులు. తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 10న పటాన్చెరులో బోనాల పండుగ



- **ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్చెరు (వుదయం):**

ఆషాడ మాసంలో నిర్వహించే బోనాలను పటాన్చెరు పట్టణంలో ఆగస్టు 10వ తేదీ సోమవారం నిర్వహించేందుకు పట్టణ పుర ప్రముఖుల సమావేశంలో నిర్ణయించినట్లు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బోనాల పండుగ ఏర్పాట్లపై బుధవారం ఉదయం పటాన్చెరు పట్టణంలోని శ్రీ కోదండ సీతారామస్వామి దేవాలయంలో స్థానిక మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అధ్యక్షతన పట్టణ పుర ప్రముఖుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ఆగస్టు 10వ తేదీన నిర్వహించనున్న బోనాల పండుగ సందర్భంగా అన్ని దేవాలయాల వద్ద పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో.. ఆనందోత్సాహాల మధ్య పండుగను నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, పట్టణ పుర ప్రముఖులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, పురోహితులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఫారం సమర్పించకపోతే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం

- **ఎస్ఐఆర్ ప్రక్రియను వందశాతం పూర్తి చేయడమే లక్ష్యం**
- **జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**

**గద్వాల, జూలై 29 (వుదయం కరస్పాండెంట్)**



ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఓటరు ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ ప్రక్రియ తుది దశకు చేరుకుందని, జిల్లాలో ఇప్పటివరకు దాదాపు 89 శాతం పూర్తయిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు. మిగిలిన 11 శాతం ప్రక్రియను కూడా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు), రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) సమన్వయంతో పూర్తి చేసి వందశాతం లక్ష్యాన్ని సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ అనంతరం రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇంకా ఫారాలు సమర్పించని ఓటర్లలో కొందరి పేర్లు రెండు ప్రాంతాల ఓటరు జాబితాల్లో ఉండే అవకాశం ఉందని, అలాంటి వారు తమ ఓటు ఏ ప్రాంతంలో కొనసాగించాలనుకుంటున్నారో నిర్ణయించుకుని, మరో ప్రాంతంలోని ఓటును రద్దు చేయించుకునేందుకు సంబంధిత బీఎల్‌వోకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఒక ఓటరుకు ఒకే ప్రాంతంలో మాత్రమే ఓటు హక్కు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్ల పేర్లు ముసాయిదా ఓటర్ల జాబితాలో నమోదు కాకపోవచ్చని, తద్వారా వారు ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉంటుందని కలెక్టర్ హెచ్చరించారు. అందువల్ల అర్హత కలిగిన ప్రతి ఓటరు నిర్ణీత గడువులోగా తమ ఎన్యూమరేషన్ ఫారాన్ని సంబంధిత బీఎల్‌వోకు తప్పనిసరిగా సమర్పించాలని కోరారు. అదేవిధంగా రాజకీయ పార్టీలకు చెందిన బీఎల్ఏలు తమ పరిధిలో ఇంకా ఫారాలు సమర్పించని ఓటర్లకు అవగాహన కల్పించి, వారు త్వరితగతిన ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తి చేసి ఫారాలను అందజేసేలా చర్యలు తీసుకుని అధికారులకు సహకరించాలని కలెక్టర్ తెలిపారు.



# లహరి జ్ఞాపకార్థం జాజాపూర్ లో స్పోర్ట్స్ డ్రెస్ పంపిణీ

**నారాయణపేట జూలై 29 (వుదయం ప్రతినిధి)**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ లో జిల్లా విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ రమణ కూతురు కీర్తిశేషులైన చిన్నారి లహరి జ్ఞాపకార్థం బుధవారం విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ గోవిందరాజ్ మాట్లాడుతూ మనిషి జీవితంలో క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి,సర్వతోముఖ అభివృద్ధికి అత్యంత కీలకం అన్నారు. ఇవి రోగనిరోధక శక్తిని పెంచి, ఒత్తిడిని తగ్గించి, సమాజంలో కలిసి పనిచేసే తత్వాన్ని, నాయకత్వ లక్షణాలను క్రమశిక్షణను పెంపొందించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి అని ఎముకలు, కండరాలు దృఢంగా మారుతాయి అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రాములు, ఉపసర్పంచ్ లక్ష్మణ్ ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతి ,పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోటకొండ ప్రధానోపాధ్యాయులు డాక్టర్ సునీత ,భాను ప్రకాష్ ,నరసింహ, నరసింహులు ,మధుసూదన్ ,లక్ష్మణ్, నిర్మల, వెంకటప్ప ,తార్ పాషా ,అనంత సేన ,బాలరాజ్ ఫిజికల్ డైరెక్టర్ పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## జుట్టుకి రంగేస్తున్నారా?



ఫ్యాషనబుల్‌గా కనిపించాలనో, నెరిసిన జుట్టును దాచుకోవాలనో.. ఇలా కారణమేదైనా చాలామంది హెయిర్ కలర్స్ వాడడం ఈ రోజుల్లో కామనైపోయింది. అయితే వీటి తయారీలో వాడే వివిధ రకాల రసాయనాలు అందరికీ పడచ్చు, పడకపోవచ్చు. ఫలితంగా వీటి వల్ల చేకూరే ప్రయోజనాల కంటే దుష్ప్రభావాలే ఎక్కువగా ఉంటాయి. ఇవి దీర్ఘకాలంలో జుట్టును, కుదుళ్లను దెబ్బతీస్తాయంటున్నారు నిపుణులు. అయితే ఈ జుట్టు రంగుల వాడకంలో భాగంగా తలెత్తే దుష్ప్రభావాల్ని ముందు నుంచే కొన్ని లక్షణాల ద్వారా గుర్తించి జాగ్రత్తపడమంటున్నారు. అవేంటో తెలుసుకుందాం రండి.. జుట్టు, కుదుళ్లు తేమను కోల్పోవడం.. గడ్డిలాగా మారడం.. వంటి లక్షణాల్ని గుర్తిస్తే ఆ రంగు మీ జుట్టుకు సరిపడట్లేదని అర్థం చేసుకోమంటున్నారు నిపుణులు.

హెయిర్ కలర్స్‌లోని కొన్ని రకాల రసాయనాలు కుదుళ్లను బలహీన పరుస్తాయని నిపుణులు చెబుతున్నారు. అందుకే వీటిని వాడే క్రమంలో జుట్టు ఎక్కువగా రాలిపోవడం గమనిస్తే.. ఇకపై ఆ రంగును పక్కన పెట్టేయడం మంచిదంటున్నారు.

కుదుళ్లు పొడిబారడం, దురద, ఎరుపెక్కడం, ప్యాచుల్లా ఏర్పడడం.. వంటి లక్షణాలు గమనిస్తే ఆ హెయిర్ కలర్ మీకు నప్పట్లేదని గుర్తించమంటున్నారు నిపుణులు.

హెయిర్ కలర్స్‌లో ఉండే రసాయనాలు జుట్టును బలహీనపరిచే ప్రమాదం ఎక్కువగా ఉంటుందంటున్నారు నిపుణులు. కాబట్టి వీటిని వాడే కొద్దీ జుట్టు తెగిపోవడం, చివర్లు చిట్లడం.. వంటివి గమనిస్తే ఆ రంగు మీ జుట్టుకు మంచి కంటే చెడే ఎక్కువగా చేస్తుందని అర్థం.

కుదుళ్లలో విడుదలయ్యే సహజసిద్ధమైన నూనెల వల్లే కేశాలు మృదువుగా, షైనీగా కనిపిస్తాయి. అయితే మనం వాడే కొన్ని రకాల హెయిర్ కలర్స్ ఈ నూనెల పైనా ప్రతికూల ప్రభావం చూపుతాయని చెబుతున్నారు నిపుణులు. తద్వారా జుట్టు నిర్జీవమైపోయినట్లుగా, డల్‌గా కనిపిస్తుంది. కాబట్టి ఈ లక్షణాలు కనిపిస్తే ఆ రంగుల జోలికి వెళ్లకపోవడమే మంచిది. చాలామంది తమ తెల్ల జుట్టును కనిపించకుండా చేయడానికి హెయిర్ కలర్స్ వాడుతుంటారు. అయితే ఈ కృత్రిమ రంగు కోల్పోయిన కొద్దీ ఇంతకుముందు కంటే తెల్లజుట్టు ఎక్కువవడం గమనిస్తే ఇది మీ కేశాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నట్లే లెక్క అంటున్నారు నిపుణులు.

కొన్ని రకాల రంగులు జుట్టు కుదుళ్లలోని కెరాటిన్ బంధాలను బలహీనపరుస్తాయట.. ఫలితంగా జుట్టు ఆరోగ్యం దెబ్బతింటుంది.. పెళుసులుగా మారి ఊడిపోతుందట. అయితే జుట్టు రంగులు వాడే క్రమంలో ఇలాంటి దుష్ప్రభావాలు తలెత్తకుండా ఉండాలన్నా, కేశాలు –కుదుళ్లు డ్యామేజ్ కాకుండా జాగ్రత్తపడాలన్నా కొన్ని జాగ్రత్తలు పాటించడం మంచిదంటున్నారు నిపుణులు. రసాయనాలు కలిసిన హెయిర్ కలర్స్‌కి బదులు పువ్వులు, మొక్కల ఎక్స్‌ట్రాక్ట్స్‌తో తయారుచేసిన సహజసిద్ధమైన రంగుల్ని ఎంచుకోవడం మేలు. ఇలాంటివి ఇప్పుడు మార్కెట్లో అన్ని రంగుల్లో దొరుకుతున్నాయి.

## నిత్యం సైక్లింగ్‌తో ఆరోగ్య ప్రయోజనాలు మెండు...

ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం అత్యంత ప్రధానం. అలాంటి వాటిలో సైక్లింగ్ ఎంతో మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. మూడు పదులు నిండక ముందే కీళ్ల నొప్పులు, కాసింత నడుస్తారో లేదో ఆయాసం, మూడ డుగులు వేయక ముందే మోకాళ్ల నొప్పులు ఇలా అనేక రకాల సమస్యలతో సతమతమయ్యే వారి సంఖ్య రోజు రోజుకూ పెరిగి పోతుంది. ఇందుకు ప్రధాన కారణం గా ఒంటికి సరైన వ్యాయామం లేక పోవడమే కాకుండా చీటికి మాటికి వాహనాలను వినియోగించడం, కూర గాయలను కొనాలన్నా, పాల ప్యాకెట్ తేవాలన్నా అఖరికి ప్లే గ్రౌండ్‌కు వెళ్లాలన్నా బైక్‌తో వెళ్లాల్సిందే. వ్యాయామానికి ఉపకరించే ఎలాంటి ఖర్చులేని పేదోడి వాహనం సైకిళ్లను తొక్కే వారి సంఖ్య ఏటే టా తగ్గిపోతుంది. వాహనాలను విని యోగించే వారి సంఖ్య మాత్రం పెరిగిపోతూ వాతావరణం కాలష్యమవుతుంది. దీంతో పలు రకాల అనారోగ్య సమస్యలతో



ఎంతో మంది బాధపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సైకిల్‌ను వాడితే ఆరోగ్యం ఖర్చు లేకుండా పొదుపుతో పాటు పర్యావరణ హితులుగా నిలిచే అవకాశం ఉంటుంది. సైకిల్ తొక్కడంతో ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచ దేశాలు సైకిల్ వినియోగంతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నాయి. సైకిల్ తొక్కడంతో గంటకు సుమారు 300 కేలరీల శక్తి ఖర్చవుతుంది. తద్వారా శరీరంలో కొవ్వు పేరు కోకుండా ఉపయోగపడుతుంది. స్థూలకాయులకు ఇది మంచి వ్యాయామంగా పనిచేస్తుంది.

ప్రతి వందలో పది నుంచి 15 మంది వరకు ఊబకాయంతో బాధపడుతున్నారు అయితే వీరంతా చీటికి మాటికి మోటారు వాహనాలను వినియోగిస్తున్న వారే కావడం గమనార్హం. ఇలాం టి వారు సైకిల్ తొక్కడం వల్ల కొవ్వు తగ్గించుకుని ఆరోగ్యంగా ఉంటారు. నిత్యం సైకిళ్ల సవారీ చేయడంతో పాటు గుండె, ఊపిరి తిత్తులు, నాడీ వ్యవస్థ మెరుగ్గా పనిచేస్తుంది. మామూలు వాటి కంటే సైకిల్ తొక్కేవారు చురుగ్గా కనిపిస్తుంటారు. ప్రతి రోజు ఉద యం కొద్దిసేపు సైక్లింగ్ చేయడం వల్ల హృదయ సంబంధిత సమ స్యలు దూరమవుతాయని గుండె వైద్య నిపుణులు చెబుతున్నారు. సైకిల్ ఎలాంటి ఇంధన ఖర్చు అవసరం లేని వాహనం. కాలంతో పాటు పరిగెడుతున్న ఈనాటి పరిస్థితుల్లో మోటారు వాహనాల వినియోగం పెరుగుపోతుంది. ద్విచక్రవాహ నాల వినియోగంతో పనులు సులువుగా అయి పోవడమే కాకుండా ఎలాంటి శ్రమ లేకుండా పని పూర్తి చేయచ్చనే భావన నేటి తరంలో అధికమైంది. రెండు దశాబ్దాల క్రితం ఆరోగ్య ప్రదాయినిగా నిలిచిన సైకిల్‌ను ఇప్పుడు చాలా మంది చులకనగా చూస్తున్నారు. సైకిల్ వినియోగిం చేవారి సంఖ్య తగ్గిపోతుంది. సైకిల్ వాడకంతో అనేక వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. మధుమేహం వ్యాధి గ్రస్థులు సైకిల్ తొక్కడం వల్ల షుగర్ అదుపులో ఉం టుంది. దీంతో ఖరీదైన పెట్రోలు వాడకం తగ్గించుకునే పొదుపు మంత్రంతో విదేశీ మారక ద్రవ్యాన్ని సైతం మిగిల్చిన వారమవుతాం.

## ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే రన్నింగ్..

పరుగెత్తడం శారీరక దృఢత్వాన్ని పెంచడంతోపాటు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచే అత్యంత సులభమైన వ్యాయామాల్లో ఒకటి. క్రమం తప్పకుండా పరుగెత్తడం వల్ల శరీర సహనశక్తి పెరగడమే కాకుండా, టైప్ 2 డయాబెటిస్, పక్షవాతం వంటి వ్యాధుల ప్రమాదం తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే మానసిక ఒత్తిడి తగ్గి రోజంతా ఉత్సాహంగా ఉండేందుకు కూడా ఇది సహాయపడుతుంది. అయితే మొదటిసారి రన్నింగ్ ప్రారంభించే వారు కొన్ని ముఖ్యమైన విషయాలను తెలుసుకుని ముందుకు సాగితే గాయాల ప్రమాదం తగ్గి మంచి ఫలితాలు పొందవచ్చు. పరుగెత్తడం ప్రారంభించే ముందు సరైన రన్నింగ్ షూస్‌ను ఎంపిక చేసుకోవడం చాలా ముఖ్యం. ప్రతి ఒక్కరి పాదాల ఆకృతి, నడక తీరు భిన్నంగా ఉంటుంది. అందుకే రన్నింగ్‌కు అనువైన షూస్ ను నిపుణుల సలహాతో ఎంపిక చేసుకుంటే పాదాలు, చీలమండలు, మోకాళ్లపై అనవసర ఒత్తిడి పడకుండా ఉంటుంది. రన్నింగ్ సమయంలో ధరించే దుస్తులు కూడా పనితీరుపై ప్రభావం చూపుతాయి. చెమటను త్వరగా బయటకు పంపే సింథటిక్ ఫ్యాబ్రిక్‌తో తయారైన దుస్తులు ఉపయోగించడం మంచిది. పూర్తిగా కాటన్‌తో తయారైన దుస్తులు చెమటను నిల్వ ఉంచి చర్మం చికాకు, వాపులు వంటి సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉంటుంది. ప్రారంభంలోనే ఒక స్పష్టమైన ప్రణాళికను రూపొందించుకోవాలి.

మొదట ఒక నిమిషం పరుగెత్తి, ఐదు నిమిషాలు నడిచే విధానంతో ప్రారంభించడం ఉత్తమం. క్రమంగా శరీరం అలవాటు పడిన తర్వాత పరుగెత్తే సమయాన్ని పెంచుకోవచ్చు. ముఖ్యంగా రూపొందించుకున్న ప్రణాళికను క్రమం తప్పకుండా పాటించడం విజయానికి కీలకం. మొదటి రోజే ఎక్కువ దూరం లేదా ఎక్కువ సమయం పరుగెత్తేందుకు ప్రయత్నించకూడదు. చిన్న చిన్న వ్యవధులతో ప్రారంభించి, తర్వాత క్రమంగా దూరాన్ని, వేగాన్ని పెంచుకోవాలి. చాలా వేగంగా ప్రారంభించడం వల్ల మోకాళ్లు, చీలమండలపై ఒత్తిడి పెరిగి గాయాలకు అయ్యే ప్రమాదం ఉంటుంది. రన్నింగ్ చేసే ముందు శరీరంలో తగినంత నీరు ఉండేలా చూసుకోవాలి. పరుగెత్తడానికి రెండు గంటల ముందు కనీసం అర లీటర్ నీరు తాగడం మంచిది. ఎక్కువసేపు పరుగెత్తే సమయంలో కూడా అవసరాన్ని బట్టి నీరు తాగడం వల్ల డీహైడ్రేషన్ సమస్య రాకుండా ఉంటుంది. పరుగెత్తే ముందు వార్మప్ చేయడం తప్పనిసరి. ఐదు నిమిషాలు నడవడం లేదా తేలికపాటి స్ట్రెచింగ్, వార్మప్ వ్యాయామాలు చేయడం ద్వారా కండరాలు సడలిపోతాయి. దీంతో గాయాల ప్రమాదం తగ్గి శరీరం పరుగుకు సిద్ధమవుతుంది. రన్నింగ్‌తోపాటు విశ్రాంతి కూడా అంతే అవసరం. వ్యాయామం చేసిన తర్వాత కండరాలు కోలుకోవడానికి శరీరానికి సమయం ఇవ్వాలి. ప్రారంభ దశలో ఒక రోజు పరుగెత్తి, మరుసటి రోజు విశ్రాంతి తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. రన్నింగ్‌తో పాటు ఇతర వ్యాయామాలు కూడా చేయడం ఉపయోగకరం. సైక్లింగ్, ఈత, యోగా లేదా ఇతర క్రీడల్లో పాల్గొనడం వల్ల శరీర సమతుల్యత మెరుగుపడుతుంది. అలాగే ఒకే రకమైన వ్యాయామం వల్ల కండరాలపై పడే ఒత్తిడి కూడా తగ్గుతుంది. కొన్ని రోజులు అలసటగా అనిపించినా లేదా బద్ధకంగా ఉన్నా రన్నింగ్‌ను పూర్తిగా మానేయకూడదు. ఒక రోజు వాయిదా వేయడం అలవాటై, తర్వాత పూర్తిగా ఆపివేసే పరిస్థితి రావచ్చు. అందుకే క్రమశిక్షణతో వ్యాయామాన్ని కొనసాగించడం చాలా ముఖ్యం. ఎప్పుడూ ఒకే విధంగా పరుగెత్తకుండా అప్పుడప్పుడు మార్పులు చేసుకోవాలి. కొన్నిసార్లు స్ప్రింట్లు, మరికొన్నిసార్లు నెమ్మదిగా జాగింగ్ చేయడం మంచిది. అలాగే ప్రతిరోజూ ఒకే ప్రదేశంలో కాకుండా పార్కులు, కొండ ప్రాంతాలు వంటి కొత్త ప్రదేశాల్లో పరుగెత్తడం వల్ల ఆసక్తి పెరగడంతో పాటు సహనశక్తి, కండరాల బలం కూడా మెరుగుపడుతుందని నిపుణులు సూచిస్తున్నారు.



## ఉదయం అల్పాహారంలో పాలు లేదా నారింజ రసం.. ఏది ఉత్తమ ప్రయోజనాలను ఇస్తుంది..?

పొద్దున్నే అల్పాహారం రోజంతా శరీరానికి శక్తిని అందించే అత్యంత ముఖ్యమైన భోజనం. రాత్రంతా ఉపవాసం చేసిన తర్వాత శరీరానికి పోషకాలు, శక్తిని అందించే ఆహారం అవసరం. అల్పాహారంలో పాలు తాగాలా? లేక నారింజ రసం తాగాలా? అనే సందేహం చాలా మందికి ఉంటుంది. ఈ రెండింటికీ ప్రత్యేకమైన పోషక విలువలు ఉన్నప్పటికీ, ఆరోగ్యపరంగా కొన్ని లాభాలు, నష్టాలు కూడా ఉన్నాయి. పాలను అల్పాహారంలో తీసుకోవడం వల్ల శరీరానికి మంచి నాణ్యమైన ప్రోటీన్ అందుతుంది. ఒక గ్లాస్ పాలలో రోజువారీ అవసరమైన ప్రోటీన్‌లో సుమారు 20 శాతం వరకు లభిస్తుంది. ఈ ప్రోటీన్ ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగించి మధ్య మధ్యలో చిరుతిళ్లు తినాలనే కోరికను తగ్గించడంలో సహాయపడుతుంది. దీంతో మధ్యాహ్న భోజన సమయంలో అతిగా తినే అవకాశం కూడా తగ్గుతుంది. అంతేకాకుండా పాలలో ఉండే కాల్షియం శరీర బరువును నియంత్రించడంలో సహాయపడే కొన్ని హార్మోన్ల పనితీరుకు తోడ్పడుతుంది. అయితే పాలకు కొన్ని ప్రతికూల అంశాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా పూర్తి కొవ్వు (ఫుల్ ఫ్యాట్) ఉన్న పాలలో శాచురేటెడ్ ఫ్యాట్ ఎక్కువగా ఉంటుంది. దీన్ని అధికంగా తీసుకోవడం వల్ల గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం పెరిగే అవకాశం ఉంటుందని కొన్ని పరిశోధనలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా మధుమేహం లేదా ఊబకాయం ఉన్నవారు పాల రకాన్ని ఎంపిక చేసుకునేటప్పుడు జాగ్రత్త వహించాలి.



నారింజ రసం కూడా అల్పాహారంలో చాలామంది ఇష్టంగా తీసుకునే పానీయం. ఒక గ్లాస్ నారింజ రసం ద్వారా శరీరానికి రోజుకు అవసరమైన విటమిన్ సి దాదాపు పూర్తిగా అందుతుంది. విటమిన్ సి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసి చర్మాన్ని సూర్యకిరణాల వల్ల కలిగే నష్టాల నుంచి రక్షించడంలో సహాయపడుతుంది. అలాగే వాతావరణ కాలుష్యం వల్ల మెదడుపై పడే ప్రతికూల ప్రభావాలను తగ్గించడంలో కూడా ఇది ఉపయోగపడుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే నారింజ రసాన్ని తరచూ లేదా ఎక్కువసేపు కొద్దికొద్దిగా తాగడం వల్ల దంతాల పైపొర (ఎనామెల్) దెబ్బతినే అవకాశం ఉంటుంది. అలాగే పండ్ల రసాల్లో సహజ చక్కెరలు ఎక్కువగా ఉండటం వల్ల బరువు తగ్గాలని ప్రయత్నించే వారికి ఇవి పరిమిత మోతాదులోనే మంచివి. అందుకే పండ్లను నేరుగా తినడం, రసాన్ని మాత్రం అప్పుడప్పుడు మాత్రమే తీసుకోవడం ఉత్తమం. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. అల్పాహారంలో పండ్ల రసాల కంటే పాలు మెరుగైన ఎంపికగా పరిగణించవచ్చు. ముఖ్యంగా సేంద్రియ (ఆర్గానిక్) పాలు తీసుకుంటే విటమిన్ ఇ, ఒమెగా 3 కొవ్వు ఆమ్లాలు కొంత ఎక్కువగా లభించే అవకాశం ఉంటుంది. అదే సమయంలో నారింజ రసాన్ని పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. అయితే దానిని కొద్దికొద్దిగా ఎక్కువసేపు తాగకుండా, ఒకేసారి తాగడం వల్ల దంతాలపై ఆమ్ల ప్రభావం తగ్గుతుంది. అలాగే సమతుల్యమైన అల్పాహారంతోపాటు తీసుకుంటే దాని పోషక ప్రయోజనాలను కూడా పొందవచ్చు.

## తెల్ల బియ్యం, బ్రౌన్ రైస్.. రెండింటి మధ్య తేడాలేమిటి..

అన్నం భారతీయుల రోజువారీ ఆహారంలో విడదీయరాని భాగం. ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా వినియోగించే ధాన్యాల్లో బియ్యం ఒకటి. ప్రపంచంలో 1.2 లక్షలకు పైగా బియ్యం రకాలు ఉన్నట్లు అంచనా. బియ్యం ప్రధానంగా కార్బోహైడ్రేట్లకు మంచి మూలం అయినప్పటికీ, ఇందులో శరీరానికి అవసరమైన కొన్ని ముఖ్యమైన పోషకాలు కూడా ఉంటాయి. అయితే తెల్ల బియ్యం, బ్రౌన్ రైస్ మధ్య పోషక విలువల్లో తేడా ఉండటంతోపాటు, బరువు నియంత్రణపై కూడా వీటి ప్రభావం భిన్నంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. బియ్యంలో ఉండే విటమిన్ బి కాంప్లెక్స్ శరీరంలోని రసాయన చర్యలను నియంత్రించడంలో, ఆహారాన్ని శక్తిగా మార్చడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అలాగే ఇందులో ఉండే ప్రోటీన్ శరీర కణజాలాల మరమ్మత్తులకు ఉపయోగపడుతుంది. ఫ్రీ రాడికల్స్ వల్ల కణాలకు కలిగే నష్టాన్ని తగ్గించడంలో కూడా బియ్యంలో ఉండే కొన్ని పోషకాలు సహాయపడతాయి. తెల్ల బియ్యం, బ్రౌన్ రైస్ రెండూ ఒకే ధాన్యం నుంచి లభించినప్పటికీ, ప్రాసెసింగ్ విధానంలో తేడా ఉంటుంది. తెల్ల బియ్యం తయారీ సమయంలో గింజపై ఉండే బ్రాన్, జెర్మ్ ను తొలగిస్తారు. దీంతో దాని నిల్వ కాలం పెరగడంతో పాటు రుచి మెరుగుపడుతుంది. అయితే ఈ ప్రక్రియలో అనేక విటమిన్లు, ఖనిజాలు కూడా తగ్గిపోతాయి.



ఫలితంగా తెల్ల బియ్యంలో ప్రధానంగా పిండి పదార్థాలు (స్టార్చ్), గ్లూకోజ్ రూపంలోని కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉంటాయి. బ్రౌన్ రైస్‌లో మాత్రం పై పొట్టును మాత్రమే తొలగిస్తారు. అందువల్ల ఇందులో విటమిన్లు, ఖనిజాలు, ఫాస్ఫరస్, మెగ్నీషియం వంటి పోషకాలు తెల్ల బియ్యంతో పోలిస్తే ఎక్కువగా ఉంటాయి. ఇవి ఎముకల బలానికి తోడ్పడటంతో పాటు శరీరానికి అదనపు పోషకాలను అందిస్తాయి. అయితే బ్రౌన్ రైస్ ఉడకడానికి ఎక్కువ సమయం పడుతుంది. 100 గ్రాముల ఉడికించిన తెల్ల బియ్యంలో సుమారు 130 కేలరీలు, 29 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 2 గ్రాముల ప్రోటీన్ ఉంటాయి. ఇందులో ఫైబర్, కొవ్వు చాలా తక్కువగా ఉంటాయి. అదే 100 గ్రాముల బ్రౌన్ రైస్‌లో సుమారు 112 కేలరీలు, 24 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 2 గ్రాముల ఫైబర్, 2 గ్రాముల ప్రోటీన్, 1 గ్రాము కొవ్వు ఉంటాయి. ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల బ్రౌన్ రైస్ ఎక్కువసేపు కడుపు నిండిన భావనను కలిగిస్తుంది. బరువు తగ్గే ప్రయత్నంలో ఉన్నవారికి బ్రౌన్ రైస్ మెరుగైన ఎంపికగా చెప్పవచ్చు. ఇందులో ఉండే ఫైబర్, ఇతర పోషకాలు ఆకలిని నియంత్రించడంలో సహాయపడతాయి. తెల్ల బియ్యం అధికంగా తీసుకుంటే బరువు పెరిగే ప్రమాదం ఉంటుందని కొన్ని అధ్యయనాలు సూచించినప్పటికీ, బియ్యం ప్రధాన ఆహారంగా తీసుకునే కొన్ని దేశాల్లో అలాంటి స్పష్టమైన సంబంధం కనిపించలేదని ఇతర పరిశోధనలు పేర్కొన్నాయి.

## తేన్పులు తగ్గాలంటే..!



నలుగురిలో ఉన్నప్పుడు పదే పదే తేన్పులొస్తుంటే ఇబ్బంది పడతాం.. అసౌకర్యానికి గురవుతాం. ఈ సమస్యకు చెక్ పెట్టాలంటే కొన్ని ఇంటి చిట్కాలు మేలు చేస్తాయంటున్నారు నిపుణులు. జీర్ణ సంబంధిత సమస్యలను తగ్గించడంలో అల్లం ప్రముఖ పాత్ర పోషిస్తుంది. ఇందులో ఉన్న ఔషధ గుణాలే దీనికి కారణం! రోజుకు ఒకటి లేదా రెండుసార్లు చిన్న అల్లం ముక్కను నమలడం వల్ల తేన్పుల సమస్య నుంచి ఉపశమనం పొందచ్చంటున్నారు నిపుణులు. ఒక టేబుల్ స్పూన్ అల్లం ముక్కల్ని తీసుకొని నీటిలో వేసి ఓ పది నిమిషాల పాటు మరిగించాలి. ఈ మిశ్రమం గోరువెచ్చగా అయ్యేంత వరకు ఆగి, అందులో కొంచెం నిమ్మరసం లేదా తేనెను కలుపుకొని తీసుకోవాలి. ఇలా రోజుకు ఒకటి లేదా రెండుసార్లు చేస్తే తేన్పుల నుంచి ఉపశమనం పొందచ్చని నిపుణులు సూచిస్తున్నారు. తేన్పుల సమస్య నుంచి ఉపశమనం కలిగించడంలో బొప్పాయి కూడా కీలకపాత్ర పోషిస్తుంది. ఇందులో ఉండే 'పపైన్' అనే ఎంజైమ్ జీర్ణవ్యవస్థ, గ్యాస్ సంబంధిత సమస్యలను దూరం చేస్తుందట.

అయితే తేన్పుల సమస్యను తగ్గించడంలోనూ సోంపు ప్రభావవంతంగా పనిచేస్తుందని చెబుతున్నారు నిపుణులు.

పెరుగులో మంచి బ్యాక్టీరియా అధికంగా ఉంటుంది. ఇది అజీర్తి, కడుపుబ్బరం.. వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. అంతేకాదు.. దీన్ని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల జీర్ణక్రియ పనితీరు మెరుగుపడి, తేన్పులతో పాటు ఇతర పొట్ట సంబంధిత సమస్యల నుంచి ఉపశమనం పొందచ్చంటున్నారు.

భోజనం తర్వాత సోంపు గింజలను తీసుకోవడం చాలా మందికి అలవాటే. దీనివల్ల తీసుకున్న ఆహారం త్వరగా, సులభంగా జీర్ణమవుతుంది. జీర్ణక్రియ సాఫీగా జరిగి.. కడుపుబ్బరం, తేన్పులు వంటి సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుందంటున్నారు నిపుణులు.

## నిద్రలేమి సమస్య నుంచి బయట పడేందుకు నిపుణులు సూచిస్తున్న మార్గాలు ఇవే..

నిద్రలేమి ప్రస్తుతం చాలా మందిని వేధిస్తున్న సాధారణ సమస్యగా మారింది. ఒత్తిడి, అనారోగ్యకరమైన జీవనశైలి, అధిక స్క్రీన్ టైమ్‌తోపాటు ఆహారపు అలవాట్లు కూడా నిద్ర నాణ్యతపై ప్రభావం చూపిస్తున్నాయి. అయితే కొన్ని ఆహారాలు శరీరంలో మెలటోనిన్, సెరటోనిన్ వంటి నిద్రను ప్రోత్సహించే హార్మోన్ల ఉత్పత్తికి తోడ్పడి మంచి నిద్రకు సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. చిన్నతనంలో నిద్రపోయే ముందు వేడి పాలు తాగమని పెద్దలు చెప్పడం వెనుక కూడా ఇదే కారణం ఉంది. పాలలో ఉండే కొన్ని పోషకాలు శరీరాన్ని ప్రశాంతంగా ఉంచి నిద్రకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తాయి. పాలతో పాటు మరికొన్ని ఆహారాలు కూడా మంచి నిద్రకు దోహదపడతాయి. డార్క్ చాక్లెట్‌లో కెఫిన్ ఉన్నప్పటికీ, ఇందులో సెరటోనిన్ కూడా ఉంటుంది. సెరటోనిన్ మనసును ప్రశాంతంగా ఉంచడంలో సహాయపడుతుంది. అయితే రాత్రి సమయంలో ఎక్కువ మోతాదులో డార్క్ చాక్లెట్ తీసుకుంటే అందులోని కెఫిన్ కొందరిలో నిద్రకు ఆటంకం కలిగించే అవకాశం కూడా ఉంటుంది. కాబట్టి దీనిని పరిమిత మోతాదులో మాత్రమే తీసుకోవడం మంచిది. పిస్తాలో ప్రోటీన్‌తోపాటు విటమిన్ బి6 సమృద్ధిగా ఉంటుంది. ఈ విటమిన్ ట్రిప్టోఫాన్‌ను సెరటోనిన్‌గా, తర్వాత మెలటోనిన్‌గా మారేందుకు సహాయపడుతుంది. మెలటోనిన్ నిద్ర–మేల్కొలుపు చక్రాన్ని నియంత్రించే హార్మోన్ కావడంతో మంచి నిద్రకు తోడ్పడుతుంది. అరటిపండులో పొటాషియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి కండరాలను సడలించి శరీరానికి విశ్రాంతి కలిగించడంలో సహాయపడతాయి. దీంతో నిద్ర నాణ్యత మెరుగుపడే అవకాశం ఉంటుంది. చెర్రీ పండ్లలో సహజసిద్ధమైన మెలటోనిన్ ఉంటుంది. ఇది శరీరంలోని నిద్ర చక్రాన్ని సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది. నిద్రలేమి లేదా ప్రయాణాల వల్ల ఏర్పడే జెట్ ల్యాగ్ సమస్యలను తగ్గించడంలో కూడా చెర్రీలు ఉపయోగపడతాయని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. పీనట్ బటర్‌లో ప్రోటీన్ అధికంగా ఉంటుంది. ఈ ప్రోటీన్ ట్రిప్టోఫాన్ ఉత్పత్తికి అవసరమైన అమినో ఆమ్లాలను అందిస్తుంది. ట్రిప్టోఫాన్ నుంచి సెరటోనిన్, ఆపై మెలటోనిన్ ఉత్పత్తి కావడంతో నిద్రకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. అయితే పీనట్ బటర్‌ను పరిమిత మోతాదులోనే తీసుకోవాలి.



## యాపిల్ అప్‌గ్రేడ్ ప్లాన్.. ఇక నెలవారీ అద్దె చెల్లింపులు



ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్ తన మ్యాక్‌బుక్, ఐప్యాడ్ ధరలను ఇటీవలే భారీగా పెంచింది. తాజాగా ఐఫోన్ ధరల పెంపు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. దీంతో సాధారణ వ్యక్తి ఐఫోన్ కొనాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి. అయితే, వినియోగదారులకు ఊరటనిచ్చేలా యాపిల్ ఓ కొత్త ప్లాన్ తీసుకొచ్చింది. యాపిల్ అప్‌గ్రేడ్ పేరిట డివైజ్ లీజింగ్ ప్రోగ్రామ్‌ను లాంచ్ చేసింది. అంటే ఎంపిక చేసిన కంపెనీ ఉత్పత్తులను లీజ్‌కు తీసుకోవాలంటే.. నెలవారీ ప్రాతిపదికన కొంత మొత్తాన్ని అద్దె రూపంలో చెల్లించాల్సి ఉంటుంది.




# ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా యాపిల్

ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా మళ్లీ యాపిల్ నిలిచింది. ఇతర బిగ్ టెక్ సంస్థలతో పోలిస్తే ఏఐ మౌలిక వసతులపై చాలా తక్కువ పెట్టుబడులు పెడుతున్నా, చిప్ తయారీ సంస్థ ఎన్‌విడియాను అధిగమించి మరీ అగ్రస్థానా



నికి చేరింది. కృత్రిమే మేధ(ఏఐ) బూమ్‌తో కొద్ది కాలంగా భారీగా పెరిగిన ఎన్‌విడియా షేర్లు సోమవారం 5% నష్టపోయాయి. దీంతో కంపెనీ మార్కెట్ విలువ 4.77 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.456 లక్షల కోట్లు)కు పరిమితమైంది. అదే సమయంలో యాపిల్ షేర్లు రాణించడంతో సంస్థ మార్కెట్ విలువ 4.95 లక్షల కోట్ల డాలర్ల(దాదాపు రూ.475 లక్షల కోట్ల)కు చేరి, అగ్రస్థానానికి ఎదిగింది. ఈనెల 17న సైతం ఎన్‌విడియాను యాపిల్ కొద్దిసేపు అధిగమించినా, మళ్లీ వెనక్కివెళ్లింది. ఏడాది కాలంగా ఎన్‌విడియానే ప్రపంచంలో అత్యంత విలువైన కంపెనీగా కొనసాగుతూ వచ్చింది. ఏఐ నమూనాలకు అవసరమయ్యే గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్ల (జీపీయూల)కు భారీగా గిరాకీ రావడం కంపెనీకి కలిసివచ్చింది. 2025 అక్టోబరులో, తొలి సారిగా 5 లక్షల కోట్ల డాలర్ల మార్కెట్ విలువను అధిగమించిన మొదటి కంపెనీగానూ ఎన్‌విడియా అవతరించింది. ఇపుడేం జరుగుతోంది: ఏఐ మౌలిక ప్రాజెక్టుల వ్యయాలకు తగ్గ ప్రతిఫలంపై ఆందోళనలు పెరిగి, ఎన్‌విడియా షేర్లు ఒత్తిడిలోకి వెళ్లాయి. ఒహాయోలో ఓపెన్‌ఏఐ డేటా సెంటర్ ప్రాజెక్టుకు 250 బిలియన్ డాలర్ల ఫైనాన్షియల్ గ్యారెంటీపై ఎన్‌విడియా చర్చిస్తోందని వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. ఏఐ విస్తరణకు సంబంధించి ఆర్థిక భారం పెరుగుతోందని ఇన్వెస్టర్లు ఆందోళన చెందుతున్నట్లూ తెలిపింది. యాపిల్ మాత్రం ఇతర బిగ్‌టెక్ సంస్థలైన మైక్రోసాఫ్ట్, అమెజాన్, మెటాలతో పోలిస్తే డేటా సెంటర్లు, ఏఐ మౌలిక వసతులపై గత మూడు త్రైమాసికాలుగా మూలధన వ్యయాలు తగ్గించుకుంది.

# ఆర్‌బీఐ బంగారు నిల్వలు 880 టన్నులు



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వద్ద 880.52 టన్నుల బంగారు నిల్వలున్నాయి. 2025 మార్చి 31తో పోలిస్తే, 2026 మార్చి 31 నాటికి 0.94 టన్నుల పసిడి నిల్వలే పెరిగినట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌధ్రీ రాజ్యసభకు తెలిపారు. గత రెండేళ్లతో పోలిస్తే ఇదే కనిష్ఠ వృద్ధి అని తెలిపారు. విదేశీ మదుపర్లు లాభాలు స్వీకరించడంతో పాటు ఓవర్సీస్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్ (ఓడీఐ) బయటకు వెళ్లడం వల్లే ఇటీవలి కాలంలో నికర విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) తగ్గాయని ప్రభుత్వం తెలిపింది. 2022–23లో నికర ఎఫ్‌డీఐలు 27.99 బిలియన్ డాలర్లుగా ఉండగా, 2025–26 నాటికి 6.95 బిలియన్ డాలర్ల (అప్పటి మారకపు విలువ ప్రకారం రూ.62,550 కోట్ల)కు పరిమితమయ్యాయని ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌధ్రీ తెలిపారు. 2023–24లో 10.13 బి.డాలర్లకు, 2024–25లో 960 మి.డాలర్లకు ఇవి చేరాయన్నారు. స్థూలంగా చూస్తే 2025–26లో 94.84 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు వచ్చాయి. 2024–25లో ఇవి 80.61 బి.డాలర్లుగా ఉన్నాయి. విదేశాల్లో తమ వ్యాపారాలను విస్తరించుకోవడానికి భారతీయ కంపెనీలకు వీలు కల్పిస్తూ 2022లో ఓడీఐ నిబంధనలను సరళీకరించడం వల్ల ఉపసంహరణలు పెరిగాయని ఆయన వివరించారు. డాలరుతో పోలిస్తే రూపాయి నెలవారీ సగటు మారకపు విలువ 2014 మేలో రూ.59.3గా, 2026 మే లో రూ.95.6గా ఉందని వివరించారు. కరెంట్, సేవింగ్స్ ఖాతాల్లో కనీస సగటు నిల్వ ఉంచడంలో విఫలమైన ఖాతాదారుల నుంచి 2025–26లో ప్రైవేట్ రంగ బ్యాంకులు ఏకంగా రూ.4,948.71 కోట్లు వసూలు చేశాయి. ఇదే సమయంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా ఖాతాదారుల నుంచి ఈ రూపేణ రూ.2,137.92 కోట్లు వసూలు చేసినట్లు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధ్రీ రాజ్యసభకు వెల్లడించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.1,798.14 కోట్లు, యాక్సిస్ బ్యాంక్ రూ.1,081.33 కోట్లు వసూలు చేసి, తొలి రెండో స్థానాల్లో ఉన్నాయి. 2025–26లో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)ను తప్పుడు పద్ధతిలో క్లెయిమ్ చేసుకోవడం ద్వారా రూ.75,000 కోట్ల మోసానికి పలువురు పాల్పడ్డారని మంత్రి తెలిపారు.

# 8 ఏళ్లు జీతం తీసుకోలేదు.. ఇప్పుడేమో బిలియనీర్..!

ఆధునిక సాంకేతిక ప్రపంచంలో 'బ్రెయిన్'గా పరిగణించే చిప్‌ల కోసం చైనా ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించాలనుకున్నారు ఝు యిమింగ్. అందుకోసం 2016లో CXMT కంపెనీని ప్రారంభించారు. శాంసంగ్, ఎస్‌కే హైనిక్స్, మైక్రాన్ వంటి సంస్థల సరసన నిలవాలని కలగన్నారు. ఇది నెరవేరాలంటే.. ఎంతో సహనం అవసరం.. పరిశోధన చేయాలి.. బిలియన్ డాలర్లు కావాలి. ఈక్రమంలో 8 ఏళ్లు వేతనం తీసుకోలేదు. అలాంటి కంపెనీపై ఇప్పుడు కాసుల వర్షం కురుస్తోంది. ఆ కంపెనీ భాగస్వామ్యం కోసం యాపిల్ సంస్థ ఎదురుచూస్తోంది..! ఝు యిమింగ్ 2016లో ప్రారంభించిన చాంగ్‌గ్జిన్ మెమోరీ టెక్నాలజీస్ (CXMT) కంపెనీ పేరు రెండ్రోజులుగా అంతర్జాతీయంగా



మారుమోగుతోంది. ఆ సంస్థ షేర్లు షాంఘై స్టాక్ ఎక్స్ఛేంజీ లిస్టింగ్‌లో అదరగొట్టాయి. అరంగేట్రం చేసిన వెంటనే షేర్ ధర 500 శాతం వరకు ఎగబాకింది. తన దేశానికి చిప్ కొరత తీర్చేలా ప్రపంచస్థాయి కంపెనీలతో పోటీపడేలా చైనీస్ మెమోరీ చిప్ (DRAM)ను తయారు చేయాలన్నది నాడు యిమింగ్ లక్ష్యంగా పెట్టుకున్నారు. CXMTని స్థాపించడానికి ముందే ఆయనొక విజయవంతమైన వ్యాపారవేత్త. చింగ్‌వా యూనివర్సిటీ (చైనా ఎంఐటీగా పిలుస్తారు)లో భౌతికశాస్త్రాన్ని అభ్యసించారు. తర్వాత అమెరికా (USA)కు వెళ్లి ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ చేశారు. సిలికాన్ వ్యాలీలో తన వృత్తి జీవితాన్ని ప్రారంభించిన ఆయన.. తర్వాత చైనా (China)కు తిరిగివచ్చి 2005లో ఫ్లాష్ మెమొరీ చిప్ తయారీ సంస్థ గిగా డివైజ్‌ను ఏర్పాటు చేశారు. దానిని విజయంతంగా ముందుకు నడిపించారు. కానీ, ఆయన ప్రయాణం అక్కడితో ఆగిపోలేదు. సెమీకండక్టర్ రంగంలో చైనా ప్రభుత్వం పెట్టుబడులను ప్రోత్సహిస్తున్న తరుణంలో ఆ అవకాశాన్ని అందిపుచ్చుకొని CXMTని స్థాపించారు. ఫ్యాబ్రికేషన్ ప్లాంట్ల నిర్మాణం, మెమొరీ చిప్‌ల అభివృద్ధి, తయారీని మెరుగుపర్చడం వంటి విభాగాలపైనే భారీగా డబ్బు వెచ్చించాల్సి వచ్చింది. ఆదాయం లేకుండా పోయింది. దాంతో సంస్థ లాభాల్లోకి వచ్చే వరకూ జీతం, బోనస్‌లు తీసుకోనని యిమింగ్ ప్రతిజ్ఞ చేసినట్లు సన్నిహితులు చెప్తుంటారు. సుదీర్ఘకాలం ఆయన చేసిన ప్రయత్నాలకు ఫలితం దక్కింది. ప్రస్తుతం ఆయన స్టోరీ చైనాలో ఒక విజయగాథగా మారిపోయింది. తాజా లిస్టింగ్‌తో ఆ కంపెనీ విలువ 3.3 ట్రిలియన్ యువాన్ల (సుమారు $487 billion– రూ.46 లక్షల కోట్లు)కు చేరింది.

# నెలలో ఏకంగా 43 శాతం పతనమైన 'కోస్పి'..!



అటు చైనా నుంచి ఏఐ పోటీ.. ఇటు చిప్ కంపెనీల పతనంతో దక్షిణ కొరియా ప్రధాన స్టాక్ మార్కెట్ సూచీ 'కోస్పి (Kospi)' బెంబేలెత్తుతోంది. గత రెండు రోజులుగా ఈ సూచీ భారీగా కుదేలవుతోంది. ఫలితంగా కేవలం నెల రోజుల వ్యవధిలోనే రికార్డు గరిష్ఠాల నుంచి ఏకంగా 43 శాతానికి పైగా పతనమైంది. దీంతో మదుపర్ల సంపద దాదాపు సగం వరకు ఆవిరైంది.
మంగళవారం నాటి ట్రేడింగ్‌లో 11 శాతం దిగజారిన కోస్పి.. బుధవారం కూడా పతనమైంది. నేటి మార్కెట్ ఆరంభంలో ఒక దశలో దాదాపు 12 శాతం కుంగి 5,311.77 వద్దకు పడిపోయింది. షేర్ల విలువలు భారీగా పడిపోవడంతో.. ట్రేడింగ్ లావాదేవీలను 20 నిమిషాల పాటు నిలిపివేశారు. జూన్‌లో ఈ సూచీ రికార్డు స్థాయిలో 9,386 వద్ద జీవనకాల గరిష్ఠాన్ని తాకింది. అక్కడి నుంచి పోలిస్తే.. ప్రస్తుతం దీని విలువ 43శాతానికి పైగా తగ్గడం గమనార్హం. ఉదయం 11.30 గంటల సమయానికి కాస్త కోలుకున్న సూచీ 8 శాతం నష్టంతో 5,497 వద్ద ట్రేడ్ అవుతోంది.
చైనా నుంచి వస్తున్న చౌక కృత్రిమ మేధ (ఏఐ) మోడళ్లు అమెరికా స్టాక్ మార్కెట్లలోని భారీ పెట్టుబడులను దెబ్బతీసే అవకాశం ఉందని జెఫ్రీస్ గ్లోబల్ ఈక్విటీ స్ట్రాటజీ సంస్థ అంచనా వేసింది. ఏఐ రంగంలో నేరుగా మూలధనం వెచ్చిస్తున్న కంపెనీల్లో బదులు, వాటివల్ల పరోక్షంగా లాభపడే కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడం మంచిదని సూచించింది. దీంతో ఆయా రంగాల షేర్లపై ప్రభావం పడింది.
దక్షిణ కొరియా చిప్ తయారీ సంస్థ ఎస్‌కే హైనిక్స్ రెండో త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. సమీక్షించిన త్రైమాసికానికి గానూ కంపెనీ ఆదాయం ఆరు రెట్లు పెరిగినప్పటికీ.. ఏఐ బూమ్‌తో వచ్చిన మార్కెట్ అంచనాలను అందుకోవడంలో కంపెనీ విఫలమైంది. దీంతో మదుపర్లు నిరాశకు గురయ్యాయి. ఫలితంగా నేటి ట్రేడంగ్‌లో ఈ కంపెనీ షేర్లు 14 శాతానికి పైగా పతనమయ్యాయి. మంగళవారం కూడా ఈ సంస్థ షేర్లు భారీగానే తగ్గాయి.
ఏఐలో పెట్టుబడుల భయాలతో అటు మరో దిగ్గజ సంస్థ శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ షేర్లు కూడా వరుసగా రెండో రోజు కుదేలయ్యాయి. నిన్న 13.4శాతం తగ్గిన దీని షేరు ధర.. బుధవారం మరో 10శాతం మేర కుంగింది. దీంతో కోస్పి సూచీపై తీవ్ర ప్రభావం పడింది.

# భారీ లాభాల్లో ముగిసిన సూచీలు




దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి (stock market). అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు ఉన్నప్పటికీ.. ఐటీ, ఎఫ్ఎంసీజీ, మెటల్, బ్యాంకింగ్ స్టాక్స్ సూచీలకు దన్నుగా నిలిచాయి. విదేశీ మదుపర్ల పెట్టుబడులూ కలిసొచ్చాయి. దీంతో సెన్సెక్స్ 888 పాయింట్లు ఎగబాకగా.. నిఫ్టీ 24,250 మార్కును చేరింది. సెన్సెక్స్ 888.68 పాయింట్ల లాభపడి 77,654.60 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 264.85 పాయింట్లు ఎగబాకి 24,250.20 వద్ద ముగిసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.64 వద్ద ఉంది.
సెన్సెక్స్ 30లో ఆదానీ పోర్ట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, పవర్ గ్రిడ్, బీఈఎల్, ఎన్‌టీపీసీ షేర్లు తప్ప మిగతా స్టాక్స్ లాభాలను ఆర్జించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ 87.65 డాలర్ల వద్ద కొనసాగుతుండగా..బంగారం ఔన్స్ 4,031.84 డాలర్ల వద్ద కదలాడుతోంది. ఏఐ రంగంలో ఇంతకాలం భారీగా పెట్టుబడులు పెట్టిన మదుపర్లు.. అక్కడ ఆశించిన స్థాయిలో ప్రతిఫలాలు రావేమోనని ఇప్పుడు ఐటీ స్టాక్స్‌వైపు మొగ్గుచూపుతున్నారు. నేటి ట్రేడింగ్‌లో మదుపర్లు ఐటీ, బ్యాంకింగ్ షేర్లను కొనుగోలు చేశారు. విదేశీ పెట్టుబడిదారులు భారత్ మార్కెట్ సూచీలకు కలిసొచ్చింది. మరోవైపు యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచుతారన్న అంచనాలు మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరచాయి.




## అసిస్టెంట్ కోచ్ పదవికి రాజీనామా..



టీమ్‌ఇండియా మాజీ అసిస్టెంట్ కోచ్ ర్యాన్ డస్కాటె మళ్లీ తన పాత జట్టుకే వెళ్లిపోయాడు. కోల్‌కతా నైట్‌రైడర్స్ క్రికెట్ స్ట్రాటజీ హెడ్‌గా నియమితులయ్యాడు. భారత జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ర్యాన్ డస్కాటె రాజీనామా చేసిన కొద్దిసేపటికే .. ఆ ఫ్రాంచైజీ నుంచి ఈ ప్రకటన రావడం గమనార్హం. అంతర్జాతీయంగా నైట్‌రైడర్స్ ఫ్రాంచైజీ పలు లీగుల్లో తలపడుతోంది. ఆయా జట్ల కోసం ఆటగాళ్ల ఎంపిక, స్క్వాడ్ ప్లానింగ్, ప్రదర్శన అంచనాలు సంబంధిత అంశాలపై డస్కాటె పని చేయాల్సి ఉంటుంది. సీపీఎల్‌లో ట్రిన్‌బాగో నైట్ రైడర్స్, ఐఎల్‌టీ20లో అబుధాబి నైట్‌రైడర్స్, మేజర్ లీగ్ క్రికెట్‌లో లాస్ ఏంజెలెస్ నైట్‌రైడర్స్‌కు అసిస్టెంట్ కోచ్‌గా వ్యవహరిస్తాడు. "నైట్‌రైడర్స్ ఫ్యామిలీలోకి పునరాగమనం చేస్తోన్న ర్యాన్‌కు స్వాగతం. మా ఫిలాసఫీ ఎలా ఉంటుందో అతడికి బాగా తెలుసు. అంతర్జాతీయంతోపాటు ఫ్రాంచైజీ క్రికెట్‌లో చాలా అనుభవం ఉంది.

# తుది జట్టులో ఉంటాడు..

## అతడు భిన్నమైన ఆఫ్ స్పిన్నర్: అశ్విన్



శ్రీలంకతో టెస్టు సిరీస్ కోసం భారత సెలక్షన్ కమిటీ కొత్త స్పిన్నర్‌ను తీసుకొచ్చింది. 33 ఏళ్ల సారాంశ్ జైన్‌ను ఎంపిక చేయడంతో.. అందరి దృష్టి ఇప్పుడు అతడిపై పడింది. అతడు భిన్నమైన ఆఫ్ స్పిన్నర్ అని.. శ్రీలంకతో టెస్టుల్లో (IND vs SL) తప్పకుండా తుది జట్టులో ఉంటాడని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ వెల్లడించాడు. అలాగే తన ప్లేయింగ్ XI ఏంటో కూడా ప్రకటించాడు. గతంలో వైభవ్ సూర్యవంశీ విషయంలో తాను ఇచ్చిన స్టేట్‌మెంట్‌పై వివరణ ఇచ్చాడు.
'శ్రీలంకతో తొలి టెస్టులో తప్పకుండా రవీంద్ర జడేజా ఆడతాడు. గత మ్యాచ్‌లో ఏడు వికెట్లు తీసిన మానవ్ సుతార్‌కూ అవకాశం ఉంది. ఇక కుల్‌దీప్ కూడా ఆడాలి. ఇప్పటికే ముగ్గురు స్పిన్నర్లు అవుతారు. ఇక సారాంశ్ జైన్‌ను ఏడో స్థానంలో తీసుకోవడం ఖాయమే. అతడు భిన్నమైన ఆఫ్ స్పిన్నర్. బ్యాటర్‌గానూ పరుగులు చేయగలడు. రిషభ్ పంత్ ఐదు, శుభ్‌మన్ గిల్ నాలుగు, దేవదత్ పడిక్కల్ లేదా సాయి సుదర్శన్‌లో ఒకరు మూడో స్థానంలో బరిలోకి దిగుతారు. యశస్వి జైస్వాల్ – కేఎల్ రాహుల్ జోడీ ప్రారంభిస్తుంది. సాయి సుదర్శన్, జస్‌ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్ నిరూపించుకోవాల్సి ఉంది. ఫాస్ట్ బౌలర్ల కోసం రెండు స్లాట్‌లు ఉంటాయి. సాయి సుదర్శన్ లేకపోవడం భారత్‌కు లోటే. అతడి గైర్హాజరీలో దేవదత్ పడిక్కల్ ఆడతాడు. దేశవాళీలో మంచి ప్రదర్శనే ఇచ్చాడు. కానీ, ఫస్ట్ ఛాయిస్ మాత్రం సాయి సుదర్శనే'' అని అశ్విన్ వెల్లడించాడు.
వైభవ్ సూర్యవంశీని కొన్ని రోజులు జట్టుతోపాటు తిప్పాలని.. మైదానంలోని ప్లేయర్లకు డ్రింక్స్ ఇవ్వాలని గతంలో తాను చేసిన వ్యాఖ్యలపై అశ్విన్ వివరణ ఇచ్చాడు. "నేను అప్పుడు చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.
కించపరచాలనే ఉద్దేశంతో చేసినవి కావు. జట్టుతోపాటు ఉంటే నేర్చుకునేందుకు ఎక్కువ అవకాశం ఉంటుంది. ఎందుకంటే అతడు నేర్చుకోవాల్సింది చాలానే ఉంది. బెంచ్‌పై కూర్చొని గమనిస్తూ ఉంటే మెరుగవుతాడు. ఇక్కడ జట్టులోకి తీసుకోవడం, పక్కన పెట్టడం గురించి చర్చ వద్దు. అతడిని అతడిలా ఉండనివ్వండి. ఎదగనివ్వండి. వైభవ్ అద్భుతమైన ఆటగాడు అవుతాడనంలో ఎలాంటి సందేహం లేదు'' అని అశ్విన్ స్పష్టం చేశాడు.

# సోనమ్-హిమాంశు జోడీకి కాంస్యం




ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత్‌కు వరుసగా రెండో రోజూ పతకం వచ్చింది. సోమవారం 25 మీటర్ల పిస్టల్‌లో ఇషా సింగ్ స్వర్ణం, మను బాకర్ కాంస్యం సాధించగా.. మంగళవారం 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో సోనమ్ ఉత్తమ్ మస్కర్, హిమాంశు ధిల్లాన్ కాంస్యం దక్కించుకున్నారు. ఫైనల్లో తలో 220.6 పాయింట్లు సాధించిన ఈ జోడీ.. మొత్తంగా 441.2 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. చైనా క్రీడాకారులు స్వర్ణం, రజతం గెలిచారు. ఇలవేనిల్ (190.5)–పార్థ్ (188.3) ద్వయం 378.8 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. టోర్నీలో ఇప్పటిదాకా భారత్ ఒక స్వర్ణం, ఒక రజతం, రెండు కాంస్యాలు సాధించింది.

# విండీస్ చేతిలో పాకిస్థాన్ చిత్తు

వెస్టిండీస్‌తో మొదటి టెస్టులో పాకిస్థాన్ కథ ముగిసింది. 211 పరుగుల లక్ష్య ఛేదనలో 120 పరుగులకే కుప్పకూలింది. దీంతో 90 పరుగుల తేడాతో వెస్టిండీస్ ఘన విజయం సాధించింది. మొత్తం 40 వికెట్లూ పేసర్లే తీయడం గమనార్హం. టెస్టు చరిత్రలో ఇలా ఒక మ్యాచ్‌లో అన్ని వికెట్లను పేసర్లే పడగొట్టడం ఇది ఆరోసారి మాత్రమే. ఇక పాక్‌పై విండీస్ పేసర్లు తొలిసారి 20 వికెట్లను తీశారు. రెండు ఇన్నింగ్స్‌ల్లో ఏడు వికెట్లు తీసిన జస్టిన్ గ్రీవ్స్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. దీంతో రెండు టెస్టుల సిరీస్‌లో (WI vs PAK) వెస్టిండీస్ 1–0 ఆధిక్యం సాధించింది. రెండో మ్యాచ్ పోర్ట్ ఆఫ్ స్పెయిన్ వేదికగా ఆగస్ట్ 2 నుంచి ప్రారంభం కానుంది.
ఓవర్‌నైట్ 57/6 స్కోరుతో కష్టాల్లో ఉన్న పాకిస్థాన్‌ను కెప్టెన్ బాబర్ అజామ్ (58) కాస్త గట్టెక్కించే ప్రయత్నించాడు. హాఫ్ సెంచరీ సాధించాడు. కానీ, అతడికి మిడిలార్డర్ నుంచి సహకారం లభించలేదు. చివరి బ్యాటర్ మహమ్మద్ అబ్బాస్ (23)తో కలిసి కాసేపు పోరాడిన బాబర్ నాటౌట్‌గా మాత్రమే మిగిలాడు. దీంతో పాక్ రెండో ఇన్నింగ్స్‌లో 120 పరుగులకే ఆలౌటైంది. జైడెన్ సీలెస్ ఐదు వికెట్ల (5/20) ప్రదర్శనతో పాక్‌ను దెబ్బకొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో విండీస్ 311 పరుగులు చేయగా.. పాక్ 282 రన్స్‌కే పరిమితమైంది. అనంతరం వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 181 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలిపి పాక్ ఎదుట 211 పరుగులను లక్ష్యంగా నిర్దేశించింది. కానీ, పాక్ బ్యాటర్ల పేలవ ఆటతో 120 రన్స్‌కే కుప్పకూలి ఓటమిపాలైంది. ఇటీవలే కన్నుమూసిన క్రికెట్ దిగ్గజం సర్ గ్యారీఫీల్డ్ సోబెర్స్ జయంతి నేడు. ఆయనకు ఈ విజయం అంకితం ఇస్తున్నట్లు విండీస్ కెప్టెన్ రోస్టన్ ఛేజ్ వెల్లడించాడు. పాకిస్థాన్ విదేశీ గడ్డపై వరుసగా ఎనిమిది టెస్టుల్లో ఓటమిపాలైంది. చివరిసారిగా 2023లో శ్రీలంకపై గెలిచింది. ఆ తర్వాత అన్నీ పరాజయాలే. గత 11 టెస్టుల్లో విండీస్‌కిది రెండో విజయం మాత్రమే.



# టాపర్లు మనోళ్లే..

## వైభవ్ సూర్యవంశీ మొదలుపెట్టాడు

టీమ్‌ఇండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఐసీసీ ర్యాంకుల్లో వేట మొదలుపెట్టాడు. ఇంగ్లాండ్‌పై అరంగేట్రం చేసిన అతడు.. ఆ టీ20 సిరీస్‌లో ప్రభావం చూపించలేదు. కానీ, జింబాబ్వేపై విజృంభించిన వైభవ్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచాడు. మూడు వన్డేల్లో 151 పరుగులు చేశాడు. దీంతో ఐసీసీ ర్యాంకుల్లో దూసుకొచ్చాడు. ఏకంగా 230 స్థానాలను ఎగబాకడం గమనార్హం. దీంతో అనతికాలంలోనే వైభవ్ టాప్ –50లో అడుగు పెట్టాడు. ప్రస్తుతం 536 రేటింగ్ పాయింట్లతో 48వ స్థానంలో ఉన్నాడు. టీ20ల్లో అగ్రస్థానం భారత క్రికెటర్ ఇషాన్ కిషన్‌దే. అతడు 910 పాయింట్లతో టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. ఇంగ్లాండ్‌పై ఫర్వాలేదనిపించిన అభిషేక్ శర్మ జింబాబ్వేపై తేలిపోయాడు. దీంతో



అతడి ర్యాంక్‌పైనా ప్రభావం పడింది. ఒక స్థానం కోల్పోయిన అభిషేక్ (819) మూడో ర్యాంకుకు పడిపోయాడు. పాకిస్థాన్ ఆటగాడు సహిబ్జాద ఫర్హాన్ (848) రెండో ర్యాంకుకు చేరాడు. తిలక్ వర్మ (750) రెండు స్థానాలు ఎగబాకి ఆరో ర్యాంక్‌లో నిలిచాడు. ఇక టీ20 బౌలింగ్ విభాగంలో టాప్ –10లో భారత్ నుంచి ఒకే ఒక్క బౌలర్ మాత్రమే ఉన్నాడు. వరుణ్ చక్రవర్తి (663) మూడు స్థానాలను కోల్పోయినా 9వ ర్యాంకులో ఉన్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా ఐదు స్థానాలను కోల్పోయాడు. ప్రస్తుతం 17వ ర్యాంకులో కొనసాగుతున్నాడు.
వన్డే ర్యాంకింగ్స్‌లో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఇప్పటి వరకు ఆ స్థానంలో ఉన్న కివీస్ ఆటగాడు డారిల్ మిచెల్ (794) రెండో స్థానానికి పడిపోయాడు. గిల్ ఖాతాలో ప్రస్తుతం 801 పాయింట్లు ఉన్నాయి. టీమ్‌ఇండియా సీనియర్ బ్యాటర్లు విరాట్ కోహ్లి (767), రోహిత్ శర్మ (758) వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో కొనసాగుతున్నారు. వన్డే బౌలింగ్ విభాగంలో భారత్ నుంచి టాప్–10లో ఒక్కరూ లేరు. కుల్‌దీప్ యాదవ్ (596) మాత్రం 11వ స్థానంలో ఉన్నాడు. ఇక జట్లపరంగా.. వన్డే, టీ20ల్లో టీమ్‌ఇండియా అగ్రస్థానంలో ఉంది. టెస్టుల్లో మాత్రం నాలుగో ర్యాంకులో నిలిచింది. టీ20ల్లోనూ ఇంగ్లాండ్ (268)తో భారత్ (268)కు తీవ్ర పోటీ తప్పడం లేదు.

# వుదయం సినిమా

## 'శ్రీనివాస మంగాపురం' నా కెరీర్‌లో బెస్ట్



**వుదయం సినిమా** సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు అన్న కుమారుడు జై కృష్ణ ఘట్టమనేని అజయ్ భూపతి దర్శకత్వంలో 'శ్రీనివాస మంగాపురం' సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానిని కూడా ఈ చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో సీనియర్ నటుడు డాక్టర్ మోహన్ బాబు పవర్ ఫుల్ పాత్రను పోషిస్తున్నారు. నిర్మాత పి. కిరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని వైజయంతి మూవీస్ బ్యానర్ పై అశ్విని దత్ సమర్పిస్తున్నారు. ఇప్పటివరకు విడుదలైన పాటలు, టీజర్లు, ట్రైలర్ కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ చిత్రం జూలై 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు అజయ్ భూపతి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. శ్రీనివాస మంగాపురం ఎలా ఉండబోతుంది? ఇది కంప్లీట్ లవ్ స్టోరీ. అలాగే చాలా ఇంటెన్స్, ఎమోషనల్ స్టోరీ. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కూడా. ఫిక్షన్ కథ. అయితే నిజ జీవితంలో జరిగిన సంఘటనల ఆధారంగా కూడా కొన్ని సీన్స్ రాశాను. అవన్నీ చాలా అద్భుతంగా ఉంటాయి. ఇందులో లవ్ స్టోరీతో పాటు సూపర్ ఎమోషన్స్ ఉంటాయి. మోహన్ బాబు గారి క్యారెక్టర్‌తో పాటు ఇంకా చాలా మంచి క్యారెక్టర్స్ ఉన్నాయి. పెద్ద నరేష్ గారి క్యారెక్టర్‌ను చాలా ఎంజాయ్ చేస్తారు.

## నటుడు రమేష్ కుటుంబానికి అండగా మెగాస్టార్ చిరంజీవి



**వుదయం సినిమా:** తోటి కళాకారుల కష్టసుఖాల్లో ఎప్పుడూ ముందుండే మెగాస్టార్ శ్రీ చిరంజీవి మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. 'గబ్బర్ సింగ్' చిత్రంతో పాటు పలు చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించిన నటుడు రమేష్ ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న చిరంజీవి వెంటనే స్పందించారు. అపోలో ఆసుపత్రిలో డాక్టర్ సుబ్బారెడ్డితో తరచుగా మాట్లాడుతూ రమేష్ ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్న చిరంజీవి, చికిత్సకు అవసరమైన అన్ని విధాల సహాయం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన, చికిత్స ఖర్చులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకూడదనే ఉద్దేశంతో ఆయన సతీ మణికి తన తరపున ₹3 లక్షల చెక్కును అందజేశారు. అంతే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకం ద్వారా కూడా అవసరమైన సహాయం అందేలా సిఫార్సు చేస్తామని చిరంజీవి కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. అలాగే నిన్న శ్రీ నాగబాబు మరో ₹2 లక్షల చెక్కును అందించి ఆర్థిక సహాయాన్ని అందించారు. తోటి కళాకారుల పట్ల చిరంజీవి గారు ఎప్పటినుంచో చూపిస్తున్న ఆప్యాయత, ఆత్మీయత, బాధ్యతాభావానికి ఇది మరో నిదర్శనంగా నిలిచింది. ఎన్నో సందర్భాల్లో అవసరంలో ఉన్న సినీ కార్మికులు, నటీనటులకు ఆయన అందించిన సహాయం పరిశ్రమలో అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

## AAFA లోని ప్రతీ సభ్యునికి బీమా కవరేజీ



**వుదయం సినిమా:** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ భారతదేశంలోని ఏడు రాష్ట్రాల నుండి వచ్చిన అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ AAFAకు చెందిన దాదాపు 1,000 మంది సభ్యులతో ఆరు గంటలకు పైగా సమయాన్ని గడిపారు. వచ్చిన ప్రతీ అభిమానితో అల్లు అర్జున్ ఆప్యాయంగా మాట్లాడారు. అందరికీ విలువైన సలహాల్ని అందించారు. ప్రతీ ఒక్క సభ్యునికి అల్లు అర్జున్ ప్రత్యేకంగా ఫోటోలను ఇచ్చారు. అల్లు అర్జున్ తన ఫ్యాన్స్‌తో కలిసి నవ్వుతూ ముచ్చటించడమే కాకుండా కలిసి నృత్యం చేశారు. ఒకరినొకరు అభిప్రాయాల్ని పంచుకున్నారు. అల్లు అర్జున్ తన స్టైల్లో ప్రసంగాన్ని ఇస్తూ ఎన్నో చమత్కారాలు చేశారు. ఆ ప్రాంగణం, అక్కడి వాతావరణం ఒక సెలబ్రిటీ కార్యక్రమంలా కాకుండా ఫ్రెండ్స్ గెట్ టుగేదర్‌లా తలపించింది. ఇది తన జర్నీకి సపోర్ట్‌గా నిలిచిన అభిమానులతో ప్రత్యేక బంధాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ కార్యక్రమానికి హాజరైన వెయ్యి మంది AAFA సభ్యులందరికీ బీమా కవరేజీని అందించారు. ఇది తన అభిమానుల సంక్షేమానికి ఆయన ఇచ్చే ప్రాముఖ్యతను మరోసారి ధృవీకరించింది. ఈ వేడుకలో పాల్గొనడానికి అభిమానులు ఏడు వేర్వేరు రాష్ట్రాల నుండి వందల కిలోమీటర్లు ప్రయాణించి వచ్చారు. అల్లు అర్జున్ ఒక సినిమా ప్రమోషన్ కోసమో, ఒక బ్రాండ్ ఈవెంట్ కోసమో కాకుండా కేవలం అభిమానుల ప్రేమకు కృతజ్ఞతలు చెప్పడానికే రోజంతా వారికి కేటాయించారు. సెలబ్రిటీలతో అభిమానులకు ముఖాముఖి అంటే కొన్ని నిమిషాలకే పరిమితమవుతూ ఉంటుంది.

## "భగవంతుడు" నుంచి సెకండ్ సింగిల్



**వుదయం సినిమా:** యంగ్ టాలెంటెడ్ హీరో తిరువీర్ నటిస్తున్న కొత్త సినిమా "భగవంతుడు". ఈ సినిమాలో ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటిస్తోంది. కన్నడ నటుడు రిషి ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాను ఏషియన్ ఫిలిమ్స్ నారాయణ దాస్ నారంగ్, పనస శంకరయ్య గౌడ్ సమర్పణలో రవి పనస ఫిలిం కార్పొరేషన్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెంబర్ 1గా నిర్మిస్తున్నారు సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ రవి పనస. ఈ సినిమాతో జి.జి. విహారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రొమాంటిక్ పీరియడ్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న "భగవంతుడు" సినిమా త్వరలోనే రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'సిత్తరాల నవ్వు' రిలీజ్ చేశారు. ఈ పాటను మ్యూజిక్ డైరెక్టర్ కృష్ణ ప్రసాద్ బ్యూటిఫుల్ గా కంపోజ్ చేయగా, డైరెక్టర్ జి జి విహారి ఆకట్టుకునే లిరిక్స్ అందించారు. ప్రముఖ సింగర్ జావెద్ అలీ రిపీటెడ్ గా వినేలా పాడారు. 'సిత్తరాల నవ్వు' పాట ఎలా ఉందో చూస్తే – 'సిత్తరాల నవ్వు, అరే సిలకల్లే నువ్వు, చేమంతి పువ్వు, నీలాల కళ్లు, అరే పారే సెలయేళ్లు, ఒంపు పరవళ్లు.. అంటూ సాగుతూ ఏరువాక పున్నమి లాంటి అమ్మాయి, కొండ గాలి దేవర వంటి అబ్బాయి మధ్య ప్రేమను చూపిస్తూ రూపొందించిన ఈ మట్టి పాట ప్రతి ఒక్కరిని ఇంప్రెస్ చేస్తోంది.

## 'శ్రీ శ్రీ'నుంచి 'బొమ్మ బొమ్మ' సాంగ్



**వుదయం సినిమా:** దుల్కర్ సల్మాన్ ప్రస్తుతం నూతన దర్శకుడు రవి నెలకుదిటి దర్శకత్వంలో రూపొందుతున్న క్రేజీ ఎంటర్‌టైనర్ శ్రీ శ్రీ బిజీగా ఉన్నారు. ప్రతిష్టాత్మక ఎస్ఎల్వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్, నిర్మాణ సంస్థకు 10వ (#SLV10) మైల్ స్టోన్ చిత్రంగా నిలుస్తోంది. ఇషాన్ సక్సేనా ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డే తొలిసారి జంటగా నటిస్తున్న ఈ సినిమా ప్రేమ, వినోదం, భావోద్వేగాలతో కూడిన రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన వర్కింగ్ స్టిల్స్, ఫస్ట్ లుక్ పోస్టర్ మంచి స్పందన అందుకోగా, తాజాగా ఈ సినిమా మ్యూజికల్ జర్నీని ప్రారంభిస్తూ తొలి పాట 'బొమ్మ బొమ్మ'ను మేకర్స్ విడుదల చేశారు.

## ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47లో 'సంపూర్ణ'గా యువినా పార్థవి



విక్టరీ వెంకటేష్ 'చిట్టి బాబు'గా, శ్రీనిధి శెట్టి 'స్వర్ణ'గా ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణ పొందిన తర్వాత, 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47 – AK47' చిత్ర బృందం కుటుంబంలోని మరో సభ్యురాలిని పరిచయం చేసింది. ఈ చిత్రంలో చిట్టిబాబు, స్వర్ణ దంపతుల ముద్దుల కుమార్తె 'సంపూర్ణ' పాత్రలో బాలనటి యువినా పార్థవి నటిస్తోంది. అమాయకత్వం, చిలిపితనం, అల్లరితో నిండిన సంపూర్ణ పాత్ర చిట్టిబాబు జీవితంలో నవ్వులు పూయించడంతో పాటు, అనూహ్యమైన చిన్న చిన్న సంఘటనలకు కూడా కారణమవుతుంది. ఈ పాత్ర ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకునేలా ఉండనుందని చిత్ర బృందం తెలిపింది. పాత్రల పరిచయాలతో సినిమాపై రోజురోజుకూ ఆసక్తిని పెంచుతున్న మేకర్స్, తదుపరి 'సర్వ' పాత్రలో నటిస్తున్న రాజా ప్రజ్వల్ను పరిచయం చేయనున్నారు.

## హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సె చేతుల మీదుగా రెస్టారెంట్ లాంచ్

**వుదయం సినిమా:** గుంటూరు అంటేనే రుచులకు నిలయం. తాజాగా గుంటూరు ప్రజలకు సరికొత్త రుచిని అందిస్తూ హియ్యా డైనో మండి రెస్టారెంట్ ప్రారంభం అయింది. వరుస విజయాలతో దూసుకెళ్తున్న అందాల తార భాగ్యశ్రీ బోర్సె చేతుల మీదుగా నాలుగవ బ్రాంచ్ గా హియ్యా డైనో మండి రెస్టారెంట్ గ్రాండ్ లాంచ్ గుంటూరులో ఘనంగా ప్రారంభం అయింది. పిల్లలను, పెద్దలను ఆకర్షించే ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ రెస్టారెంట్ అందరిని ఆకర్షిస్తుంది. ఈ సందర్భంగా హీరోయిన్ భాగ్యశ్రీ మాట్లాడుతూ.. గుంటూరు ప్రజలందరికి హియ్యా డైనో మండి గురించి ముందే తెలుసు, హైదరాబాద్ లో చాలా పాపులర్ అని అన్నారు. ఇక్కడ ఫుడ్ చాలా రుచిగా ఉందన్నారు. అందరూ తప్పకుండా వచ్చి ఒక్కసారి ఆ రుచిని చవిచూడాలని పేర్కొన్నారు. ఒక్కసారి తింటే మళ్లీ మళ్లీ వస్తారు, కచ్చితంగా నచ్చుతుందని అన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు ఈ వాతావరణాన్ని బాగా ఇష్టపడతారని పేర్కొన్నారు. ఒక ఫ్యామిలీ ఆహ్లాదారకరమైన వాతావరణంలో ప్రశాంతంగా భోజనం చేసేలా ఉందని తెలిపారు. ముఖ్యంగా తన అభిమానులకు హియ్యా డైనో మండికి స్వాగతం పలికారు.



## 'భోగి' భారీ క్లైమాక్స్ షెడ్యూల్ పూర్తి



**వుదయం సినిమా:** 'చార్మింగ్ స్టార్' శర్వా హీరోగా, 'మాస్ మావెరిక్' సంపత్ నంది దర్శకత్వంలో రూపొందుతున్న ప్రతిష్టాత్మక పాన్–ఇండియా పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి'. శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్న ,లక్ష్మి రాధామోహన్ సమర్పిస్తున్న ఈ చిత్రం భారీ స్థాయి అత్యున్నత నిర్మాణ ప్రమాణాలతో అంచనాలను పెంచుతూనే ఉంది. శర్వాను ఇప్పటివరకు ఎప్పుడూ చూడని పవర్‌ఫుల్ లుక్‌లో పరిచయం చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో పాటు, గ్రామీణ యువతిగా అనుపమ పరమేశ్వరన్ లుక్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. తాజాగా చిత్ర యూనిట్ భారీగా రూపొందించిన 22 రోజుల క్లైమాక్స్ షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసింది.

## 'ది ఆరిజిన్ ఆఫ్ అగధ' పేరుతో మేకింగ్ వీడియో విడుదల



**వుదయం సినిమా:** శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద అజయ్ కేఆర్ సమర్పణలో కాశి విశాలాక్షి బలుసు నిర్మాణంలో ఎంఎస్ రాజు తెరకెక్కించిన చిత్రం 'అగధ'.

ఈ చిత్రం యువతను, ప్రేమికులను ఆకట్టుకునే అంశాలను కలిగి ఉంది. కథనం కొన్ని చోట్ల సాగదీతగా అనిపించినప్పటికీ, ప్రధాన నటీనటుల నటన మరియు మణిశర్మ సంగీతం కోసం థియేటర్లలో ఒకసారి చూడదగిన చిత్రం.

**రేటింగ్: 3/5**

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.